www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
మంగళవారం
15-10-2024
సంపుటి : 01 | సంచిక : 163 | పేజీలు : 12 | వెల : 5/-
తెలంగాణ / ఆంధ్రప్రదేశ్







## నేడు ఇస్లామాబాద్‌కు జైశంకర్ ప్రయాణం

- తొమ్మిదేళ్ల తరువాత వెళ్లడం ఇదే తొలిసారి
- ఎస్‌సీవో సదస్సులో పాల్గొననున్న విదేశాంగ మంత్రి



2

## సెంట్రల్ గాజాలోని స్కూలుపై ఇజ్రాయెల్ వైమానిక దాడి

- చిన్నారులు సహా 20 మంది మృతి
- శరణార్థి శిబిరంగా ఉపయోగపడుతున్న పాఠశాల



2



### అన్ని విధాలుగా సహకరిస్తాం..

## మరిన్ని పెట్టుబడులు

# పెట్టండి

- ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాలపై దృష్టి సారించండి
- ఫాక్స్ కాన్ కంపెనీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి
- కొంగరకలాన్ ఫాక్స్ కాన్ కంపెనీని సందర్శించిన సీఎం, మంత్రి శ్రీధర్‌బాబు

**విశ్వంభర, హైదరాబాద్ :**
తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్ శివారు కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సందర్శించారు.
ఈ సందర్భంగా ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమైన సీఎం కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు ఈ సందర్భంగా కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించడంలో అన్ని విధాలుగా సహకరిస్తామని సీఎం రేవంత్ వారికి మరోసారి భరోసా ఇచ్చారు.
కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ఫాక్స్ కాన్ ముందుకు రావాలని ముఖ్యమంత్రి వారిని కోరారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి గారు, ప్రభుత్వ ఐటీ విభాగం ఉన్నతాధికారులు, ఫాక్స్‌కాన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణకు

## ప్రతిరూపం గద్దర్

సినీ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదగాలి
గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



2

### అర్థశాస్త్రంలో ముగ్గురికి

## నోబెల్

- డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్‌లకు పురస్కారం
- దేశాల మధ్య సంపదలో అసమానతలపై పరిశోధన
- ముగిసిన నోబెల్ అవార్డుల ప్రకటన

2

### దిగజారిన భారత్, కెనడా

## సంబంధాలు

- దౌత్యవేత్తలను వెనక్కి రప్పిస్తున్న ఇండియా
- ట్రూడో సర్కారుపై విశ్వాసం లేదన్న విదేశాంగ శాఖ
- భారత్‌లోని కెనడా దౌత్యవేత్తకు సమన్లు

2

## నెలాఖరులోపు మంత్రివర్గ విస్తరణ!

ఎల్లుండి ఢిల్లీకి
సీఎం రేవంత్ పయనం



2




## పంచాంగం

( 15-10-2024, మంగళవారం)
శ్రీ క్రోధినామ సంవత్సరం
ఆశ్వయుజ మాసం శుక్లపక్షం
తిథి: త్రయోదశి రా.12.11 వరకు తర్వాత చతుర్థశి
నక్షత్రం: పూర్వాబాధ్ర రా.9.57వరకు
సూర్యోదయం: ఉ.6.12
సూర్యాస్తమయం:సా.5.50
వర్జ్యం: ఉ.6.36 నుంచి ఉ.8.00 వరకు
దుర్ముహూర్తం: ఉ.8.32 నుంచి ఉ.9.19 వరకు
తిరిగి రా.10.47 నుంచి రా.11.37
రాహుకాలం: మ.2.56 నుంచి మ.4.23 వరకు
యమగండం: ఉ.9.07 నుంచి ఉ.10.34 వరకు
అమృత ఘడియలు: మ.3.00 నుంచి మ.4.25 వరకు

# తెలంగాణకు ప్రతిరూపం గద్దర్

### డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ సినీ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గౌరవిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సినీ పరిశ్రమ దేశంలోనే కాదు ప్రపంచంలోనే శాసించే స్థాయికి ఎదగాలని అన్నారు. సినీ పరిశ్రమకు ఏ సమస్యలు ఉన్నా వినడానికి, పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి మీ అందరితో చెప్పాలని కోరినట్టు వివరించారు. సినీ పరిశ్రమల అవార్డుల విషయానికొస్తే నంది అవార్డులు ఒక పండుగలా నిర్వహించేవారని, రాష్ట్ర విభజన తర్వాత ఎందుకో గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదని అన్నారు. తెలంగాణ అంటేనే సాంస్కృతిక జీవనం. తెలంగాణ అంటేనే ఆట, పాట.. ఇక్కడ బాధ వచ్చినా... సంతోషం వచ్చినా పాట ద్వారానే వ్యక్త పరుస్తామని వివరించారు. తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది... అందర్నీ అక్కున చేర్చుకొని, ప్రేమించే సంస్కృతి మన రాష్ట్రంలో ఉంటుందన్నారు. అసమానతలు, వైరుధ్యాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నారు అని వివరించారు.

**గద్దర్ ఒక లెజెండ్**

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ సమాజాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకు సమాయత్తం చేసి నడిపించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని డిప్యూటీ సీఎం అన్నారు. గద్దర్ ఒక లెజెండ్, ఒక శతాబ్ద కాలంలో ఆయన లాంటి వ్యక్తి పుడతారని నేను అనుకోవడం లేదని, ప్రపంచంలోని అన్ని సమస్యలపై ఆయన ప్రజలను పాటలతో కదిలించాలని తెలిపారు. తెలంగాణ ఆట, పాటను ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అన్నారు. తెలంగాణలో ఏ గ్రామంలో చూసిన గద్దర్ లాగే పాడాలని ప్రయత్నిస్తుంటారని ..తెలంగాణ మొత్తానికి గద్దర్ ప్రతిరూపమని తెలిపారు. అడవి, సినిమా, మానవులు, రాజ్యాంగం అన్నిట్లో గద్దర్ తనదైన ముద్ర వేశారని అన్నారు. గద్దర్ మొదట విప్లవోద్యమ బాటలో అడవి బాట పట్టినా కాలక్రమమైన దేశంలోని అన్ని సమస్యలకు భారత రాజ్యాంగమే పరిష్కారమని భావించి దాన్ని ఆయన విస్తృతంగా ప్రచారం చేశారని వివరించారు. అన్ని అంశాలు పరిశీలించే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని కమిటీ సభ్యులకు వివరించారు. అన్ని అవార్డుల తరహాలోనే అన్ని రంగాలకు గద్దర్ అవార్డులు ఇచ్చుకోవచ్చని తెలిపారు. సినీ పరిశ్రమలోని అందర్నీ గౌరవించుకోవాలి, ప్రతి అవార్డు గొప్పగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుందని తెలిపారు.

**పండుగలా అవార్డుల కార్యక్రమం**

గద్దర్ అవార్డుల కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలి, ఏ తేదీన జరపాలనేది కమిటీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గద్దర్ ను అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. కొద్దిరోజుల్లోనే కమిటీ మరోమారు సమావేశమై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కమిటీ సభ్యులను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతమైనదని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ అంటూ డిప్యూటీ సీఎం కు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్ స్కిల్స్ నేర్పించేందుకు ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు. అన్ని అంశాలు పరిశీలించి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్, కల్చర్ కు సంబంధించిన అంశాలకు చోటు కల్పించడం పై నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమిటీ సభ్యులు నర్సింగరావు, తనికెళ్ల భరణి, సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్ రాజు, హరిశంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు పాల్గొన్నారు.

## నెలాఖరులోపు
# మంత్రివర్గ విస్తరణ!

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ ఈ నెలాఖరులోపు పూర్తయ్యే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 17వ తేదీన జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశానికి సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లు హాజరు కానుండటంతో మరుసటి రోజున మంత్రివర్గ విస్తరణపై కాంగ్రెస్ పెద్దలతో భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెలాఖరులోపు కేబినెట్ విస్తరణ ప్రక్రియ పూర్తి చేయాలన్న లక్ష్యంతో ఏఐసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే పలు మార్లు ఈ అంశంపై హైకమాండ్ చర్చించినప్పటికీ ఏకాభిప్రాయం కుదరకపోవడంతో జాప్యం అవుతూ వస్తోంది.

నలుగురికి అవకాశం

కేబినెట్‌లో నాలుగు మంత్రి పదవులను భర్తీ చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం, సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మంత్రిమండలిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు 11 మంది మంత్రులున్నారు. ఇప్పుడు కొత్తగా నలుగురికి అవకాశం దక్కనుందని సమాచారం. ఈ అంశంపై చర్చ జరిగే నేపథ్యంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబులు కూడా ఈనెల 17 సాయంత్రం కానీ, ఈ నెల 18వ తేదీ ఉదయం కానీ ఢిల్లీ వెళ్లాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక సమీకరణాల విషయంలో ఎక్కడో ఒకచోట రాష్ట్ర ప్రభుత్వం, ఏఐసీసీ రాజీ పడాల్సి ఉంటుందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

మరోవైపు ఈనెల 17న సీడబ్ల్యూసీ సమావేశానికి రావాలని కాంగ్రెస్ హైకమాండ్ సభ్యులను ఆదేశించింది. ఈ భేటీకి తెలంగాణ నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌లు హాజరు కానున్నారు. సీడబ్ల్యూసీ సభ్యులైన వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, మాజీ ఎమ్మెల్యే వంశీ చంద్ రెడ్డిలు కూడా ఈ సమావేశానికి హాజరవుతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. భేటీలో ప్రధానంగా ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో ఓటమి పాలు కావడంపై మేథోమథనం చేస్తారని, లోటుపాట్లపై చర్చిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అదేవిధంగా త్వరలో జరగబోయే మహారాష్ట్ర, ఝార్ఖండ్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కూడా సీడబ్ల్యూసీలో చర్చిస్తారని పీసీసీ వర్గాలు తెలిపాయి. ఈ సమావేశం కోసం ఈ నెల 16వ తేదీ రాత్రికి సీఎం రేవంత్ రెడ్డి దిల్లీ వెళ్లే అవకాశం ఉంది. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ 16వ తేదీ రాత్రి కానీ, 17వ తేదీ ఉదయం కానీ వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

# నేడు ఇస్లామాబాద్‌కు జైశంకర్ ప్రయాణం

**దిల్లీ:** భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ పాకిస్థాన్ పర్యటనకు సిద్ధమయ్యారు. రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంఘం వార్షిక సమావేశంలో ఆయన పాల్గొననున్నారు. ఈ క్రమంలో పాక్ ప్రధాని ఇచ్చే డిన్నర్‌లో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు తెలిసింది. ఇరు దేశాల మధ్య సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్న తరుణంలో విదేశాంగ మంత్రి పాక్ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఎస్‌సీవో సదస్సులో పాల్గొనేందుకు విదేశాంగ మంత్రి జైశంకర్ మంగళవారం ఇస్లామాబాద్‌కు వెళ్లనున్నారు. అనంతరం సభ్యదేశాల ప్రతినిధులకు పాక్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ ఇచ్చే విందులో జైశంకర్ పాల్గొనే అవకాశాలున్నట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా ఆయన పాకిస్థాన్‌లో 24గంటల కంటే తక్కువ సమయమే ఉండనున్నట్లు సమాచారం. మరోవైపు ఈ సమావేశానికి చైనా, రష్యా ప్రధానులు కూడా హాజరుకానున్నారు. ఇందుకోసం చైనా ప్రధాని ఇప్పటికే ఇస్లామాబాద్ చేరుకున్నారు. సభ్యదేశాల నుంచి ముఖ్యులు రానున్న నేపథ్యంలో ఇస్లామాబాద్ మొత్తం భద్రతావలయంలో ఉంది. ఈ ఏడాది ఎస్‌సీవో సదస్సుకు పాకిస్థాన్ ఆతిథ్యమిస్తోంది. ఇందులో భాగంగా భారత్‌కూ ఆహ్వానం అందించింది. ఈ విషయాన్ని భారత ప్రభుత్వం రెండు నెలల క్రిందటే ధ్రువీకరించింది. అయినప్పటికీ.. పాకిస్థాన్‌తో ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు ఉండవని స్పష్టం చేసింది. అటు పాకిస్థాన్ కూడా ద్వైపాక్షిక చర్చలపై ఇలాగే స్పందించింది. తొమ్మిదేళ్ల తర్వాత భారత విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించడం ఇదే తొలిసారి. 2015 డిసెంబర్‌లో నాటి విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ అఫ్గాన్‌పై ఏర్పాటు చేసిన ఓ సదస్సులో భాగంగా పాక్‌కు వెళ్లారు.

# ఏం ఆశించి రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెడుతున్నారు?

**- మాజీ మంత్రి కేటీఆర్**

**విశ్వంభర, హైదరాబాద్:** వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ అంతర్ధానమవుతుందని బీఆర్ ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఓ వైపు మూసీ నదికి ముఖ్యమంత్రే మరణశాసనం రాస్తూ.. మరోవైపు సుందరీకరణ ప్రాజెక్టు చేపడతారా?అని ప్రశ్నించారు. పదేళ్లు ఒత్తిడి చేసినా రాడార్ స్టేషన్‌కు భారాస ప్రభుత్వం ఒప్పుకోలేదని, ఏం ఆశించి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెడుతోందని నిలదీశారు. దామగుండం రాడార్ స్టేషన్‌ను బీఆర్ ఎస్ వ్యతిరేకిస్తోందని, స్టేషన్‌కు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలతో కలిసి పోరాటం చేస్తామని చెప్పారు.



# దివ్యాంగులకు అన్ని రంగాల్లో చేయూత




- ప్రైవేట్ రంగంలో 4 శాతం రిజర్వేషన్లకు కృషి
- త్వరలో బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి అనుమతి
- సంక్షేమ పథకాల్లోనూ రిజర్వేషన్.. మంత్రి సీతక్క వెల్లడి
- దివ్యాంగుల జాబ్ పోర్టల్ ఆవిష్కరణ
- రిజిస్టర్ చేసుకుంటే అర్హత ప్రకారం ఉద్యోగాలు

విశ్వంభర, హైదరాబాద్: దివ్యాంగులకు విద్య, ఉద్యోగ, ఉపాధి, సంక్షేమాల్లో చేయూతనిచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారికి అవసరమైన పరికరాల కొనుగోలు కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.50 కోట్ల ఖర్చు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. ప్రైవేట్ సంస్థల్లో దివ్యాంగులకు ఉద్యోగ అవకాశాల కోసం యూత్ ఫర్ జాబ్స్ స్వచ్ఛంద సంస్థతో కలిసి ప్రత్యేకంగా తయారు చేసిన vikalangulajobportal.telangana.gov.in పోర్టల్‌ను ఆమె సోమవారం ఆవిష్కరించారు. అలాగే మహిళా సంక్షేమ శాఖలో 10 మందికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ఉద్యోగాల్లో దివ్యాంగులకు నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. ఒక శాతం రిజర్వేషన్‌ను నాలుగు శాతానికి పెంచే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిపారు. దివ్యాంగులు జాబ్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకుంటే చాలు క్వాలిఫికేషన్ ప్రకారం ఉద్యోగాలు వస్తాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల్లోనూ దివ్యాంగులకు రిజర్వేషన్ పాటిస్తామని మంత్రి చెప్పారు. బ్యాక్‌లాగ్ పోస్టులకు త్వరలో భర్తీ చేయనున్నట్లు సీతక్క తెలిపారు. దీనిపై కసరత్తు జరుగుతోందని చెప్పారు.

ఇతరులతో పోటీ పడేందుకు దివ్యాంగులకు ఎన్నో అవరోధాలు ఉంటాయి. అందువల్ల వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆన్‌లైన్ జాబ్ పోర్టల్ రూపొందించినట్లు మంత్రి సీతక్క తెలిపారు. పోర్టల్‌లో నమోదు చేసుకుంటే అర్హత ప్రకారం ఉద్యోగాలు లభిస్తాయన్నారు. ప్రైవేటు సంస్థలు కూడా ఉద్యోగాల్లో వికలాంగులకు రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ నిధుల్లో ఐదు శాతం దివ్యాంగులకు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, దివ్యాంగుల సహకార సంస్థ ఛైర్మన్ వీరయ్య, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జేడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.


# దిగజారిన భారత్, కెనడా సంబంధాలు



**దిల్లీ :** భారత్, కెనడాల మధ్య దౌత్య సంబంధాలు మరింత దిగజారాయి. ఇందుకు సంబంధించి సోమవారం కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్యకేసులో ఇటీవల భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ సహా పలువురు దౌత్యవేత్తలను 'పర్సన్ ఆఫ్ ఇంట్రెస్ట్'లుగా (అనుమానితులుగా) కెనడా పేర్కొనడాన్ని భారత్ తీవ్రంగా ఖండించి భారత్.. కెనడాలోని తన హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలు, అధికారులను వెనక్కి రప్పించాలని నిర్ణయించినట్లు ప్రకటించింది. తమ దౌత్యవేత్తలకు భద్రత కల్పించే విషయంలో ట్రూడో సర్కారుపై తమకు విశ్వాసం లేదని భారత విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ఈ వ్యవహారంపై అంతకుముందు భారత్‌లోని కెనడా దౌత్యవేత్తకు విదేశాంగ శాఖ సమన్లు జారీ చేసింది. ఎటువంటి ఆధారాలు లేకుండానే భారత హైకమిషనర్, ఇతర దౌత్యవేత్తలను లక్ష్యంగా చేసుకోవడం ఆమోదయోగ్యం కాదని ఆ దౌత్యాధికారికి స్పష్టం చేసినట్లు వెల్లడించింది. భారత వ్యతిరేక కార్యకలాపాలకు ట్రూడో ప్రభుత్వం ఇస్తున్న మద్దతుకు ప్రతిస్పందనగా తగిన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని పేర్కొంది. ఖలిస్థానీ ఉగ్రవాది నిజ్జర్ హత్య కేసులో భారత హైకమిషనర్ సంజయ్ కుమార్ వర్మ పేరును కెనడా అనుమానితుల జాబితాలో చేర్చింది. వీటిని తప్పుపట్టిన భారత్.. ఈ ఆరోపణలు కెనడా ప్రభుత్వపు ఓటు బ్యాంకు రాజకీయాలకు అద్దం పడుతున్నాయని తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే భారత్‌లోని కెనడా రాయబారి స్టీవర్ట్ వీలర్‌కు సమన్లు జారీచేసింది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం

*** రాష్ట్రంలో ఐదురోజులు వర్షాలు**
*** పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ**



**విశ్వంభర, హైదరాబాద్:** రాష్ట్రంలో రాగల ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని.. వాయువ్య దిశగా కదులుతూ మరింత బలంగా మారుతుందని పేర్కొంది. మంగళవారం ఉదయం వరకు మధ్యబంగాళాఖాతం వరకు చేరుతుందని చెప్పింది. ఆ తర్వాత రెండురోజుల్లో మరింత ముందుకు కదులుతూ పశ్చిమ వాయువ దశగా కదులుతూ తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఏపీ తీరాలకు చేరే అవకాశం ఉందని వెల్లడించింది. మంగళవారం నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

అల్పపీడన ప్రభావంతో హైదరాబాద్‌లో వానలు

మరోవైపు ఏపీలో దక్షిణ కోస్తా జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, విశాఖ జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. వచ్చే 4 రోజులు అక్కడ భారీ నుంచి కుండపోత వానలు కురవొచ్చని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆవర్తనం ప్రభావంతో సోమవారం హైదరాబాద్ నగరంలో పలుచోట్ల వర్షం పడింది.

కూకట్‌పల్లి, సుచిత్ర, కొంపల్లి, జీడిమెట్ల, బాలానగర్, ఖైరతాబాద్, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, ప్రగతినగర్, పటాన్‌చెరు, మేడ్చల్, కృష్ణాపూర్, గండిమైసమ్మ, మల్లంపేట్, దుండిగల్, వికారాబాద్ జిల్లాలోని తాండూరు, బహదూర్‌పల్లి, సూరారం, గుండ్ల పోచంపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దసరా సెలవుల అనంతరం నగరానికి చేరుకున్న ప్రజలు ట్రాఫిక్‌లో ఇరుక్కొని ఇబ్బందులు పడ్డారు. మరోవైపు రానున్న మూడు రోజులు ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ సూచించింది.

# సెంట్రల్ గాజాలోని స్కూలుపై ఇజ్రాయెల్ వైమానిక దాడి

**గాజా :** పశ్చిమాసియాలో రోజురోజుకూ యుద్ధం మరింత తీవ్రం అవుతోంది. సెంట్రల్ గాజాలోని ఓ పాఠశాలపై ఇజ్రాయెల్ చేసిన వైమానిక దాడిలో చిన్నారులు సహా 20 మంది మృతి చెందారు. మరో దాడిలో నుసిరత్‌లోని ఇద్దరు మహిళలు కూడా మరణించారు. వాస్తవానికి గత ఏడాది కాలంగా జరుగుతున్న యుద్ధం వల్ల నిరాశ్రయులైన అనేక మంది పాలస్తీనియన్లకు ఆశ్రయం కల్పించడం కోసం ఈ పాఠశాలను ఓ శరణార్థి శిబిరంగా మార్చారు. కానీ ఈ పాఠశాలపైనే ఇజ్రాయెల్ దాడికి పాల్పడింది' అని స్థానిక ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ దాడిలో చనిపోయినవారి మృతదేహాలను నుసైరత్‌లోని అల్ అవ్దా ఆసుపత్రికి, డీర్ అల్ బలాహ్‌లోని అల్‌అక్సా ఆసుపత్రికి తరలించామని సదరు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఇజ్రాయెల్ ఆర్మీ


బేస్‌పై హెజ్‌బొల్లా డ్రోన్ దాడి

ఓవైపు ఇజ్రాయెల్ సెంట్రల్ గాజాపై వైమానిక దాడి చేయగా, మరోవైపు సెంట్రల్ ఇజ్రాయెల్‌లోని ఆర్మీ బేస్‌ను టార్గెట్ చేసుకుని హెజ్‌బొల్లా డ్రోన్ దాడి చేసింది. ఈ దాడిలో తమ సైనికులు నలుగురు మరణించారని, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది.

ఇజ్రాయెల్‌కు అమెరికా 'థాడ్'

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. అత్యాధునిక క్షిపణి రక్షణ వ్యవస్థ అయిన 'థాడ్'ను తమ మిత్రదేశం ఇజ్రాయెల్‌కు సరఫరా చేయాలని నిర్ణయించింది. థాడ్ వ్యవస్థను ఆపరేట్ చేయడానికి అమెరికా తన సైనికులను కూడా ఇజ్రాయెల్‌కు తరలించనుందని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు థాడ్ సాయపడుతుందని పెంటగాన్ పేర్కొంది. అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాల మేరకు ఇజ్రాయెల్‌లో ఈ థాడ్ వ్యవస్థను మోహరించేందుకు రక్షణశాఖ మంత్రి లాయిడ్ ఆస్టిన్ అనుమతి ఇచ్చారని తెలిపింది. ఈ అమెరికా నిర్ణయంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ప్రత్యక్షంగా గానీ లేదా పరోక్షంగా గానీ ఇజ్రాయెల్‌కు సాయం చేస్తే, అది ఇరాన్‌పై దాడికి పాల్పడినట్లేనని హెచ్చరించింది.

# అర్థశాస్త్రంలో ముగ్గురికి నోబెల్




**స్టాక్‌హోం:** అర్థశాస్త్రంలో ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారాన్ని రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రకటించింది. 2024 సంవత్సరానికి గాను ముగ్గురికి దీనిని అందించనుంది. దేశాల మధ్య సంపదలో అసమానతలపై పరిశోధనలకుగానూ డారెన్ ఏస్‌మోగ్లు, సైమన్ జాన్సన్, జేమ్స్ ఎ. రాబిన్‌సన్ ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. వైద్యవిభాగంతో మొదలైన నోబెల్ పురస్కారాల ప్రకటన సోమవారంతో ముగిసింది. గత సోమవారం వైద్యశాస్త్రంలో విజేతలను ప్రకటించగా.. తర్వాత వరుసగా భౌతికశాస్త్రం, రసాయనశాస్త్రం, సాహిత్యం విభాగాల్లో పురస్కారాలను ప్రకటించారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిపై ప్రకటన చేయగా.. తాజాగా అర్థశాస్త్రంలో ముగ్గురు ఆర్థికవేత్తల పేర్లను వెల్లడించారు. డారెన్, సిమోన్.. అమెరికాలో కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందినవారు కాగా.. షికాగో యూనివర్సిటీలో రాబిన్‌సన్ పరిశోధనలు చేస్తున్నారు. స్వీడన్‌కు చెందిన శాస్త్రవేత్త, ఇంజినీర్, వ్యాపారవేత్త ఆల్‌ఫ్రెడ్ నోబెల్ పేరు మీదుగా ప్రపంచంలో వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి ఈ అవార్డును ప్రదానం చేస్తోన్న సంగతి తెలిసిందే. 1896లో ఆల్‌ఫ్రెడ్ నోబెల్ మరణించగా.. 1901 నుంచి ఆయన ట్రస్ట్ ద్వారా ఈ అవార్డులను ఏటా ప్రదానం చేస్తున్నారు. అవార్డు గ్రహీతలకు 11 మిలియన్ల స్వీడిష్ క్రోనర్ నగదు అందుతుంది. డిసెంబర్ 10న నిర్వహించే కార్యక్రమంలో గ్రహీతలకు అవార్డులను అందజేస్తారు.

## గ్రూప్1 మెయిన్స్
# హాల్ టికెట్లు విడుదల




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణ గ్రూప్1 మెయిన్స్ హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు హాల్‌టికెట్లను తన అధికారిక వెబ్‌సైట్‌లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) పొందుపరిచింది. ఈ నెల 21 నుంచి 27 వరకు మెయిన్ ఎగ్జామ్స్ జరగనున్నాయి. మొత్తం 31,382 మంది అభ్యర్థులు గ్రూప్1 మెయిన్స్‌కు అర్హత సాధించారు. టీజీపీఎస్సీ గ్రూప్1 మెయిన్స్ హాల్‌టికెట్లు విడుదలయ్యాయి. ఈ మేరకు హాల్‌టికెట్లను తన అధికారిక వెబ్‌సైట్‌లో టీజీపీఎస్సీ పొందుపరిచింది.

# 18న సాక్షుల వాంగ్మూలం నమోదు

*** నాంపల్లి కోర్టులో విచారణ**

**విశ్వంభర, హైదరాబాద్ :** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 18న కేటీఆర్‌తో పాటు నలుగురు సాక్షులు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్ ల స్టేట్‌మెంట్లను కోర్టు రికార్డు చేయనుంది.

తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేటీఆర్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ది కోసం నిరాధారమైన ఆరోపణలు చేశారని అందులో పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ గతంలోనే లీగల్ నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో పేరొన్నారు. ఇచ్చిన గడువు ముగిసిన నేపథ్యంలో మంత్రిపై పరువు నష్టం దావా వేసినట్టు తెలిపారు. తాను ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, తొమ్మిదేండ్లకుపైగా రాష్ట్ర మంత్రిగా పనిచేశానని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు.

ప్రస్తుతం సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నానని తెలిపారు. రాష్ట్రానికి ప్రపంచ దేశాలనుంచి పెట్టుబడులు సాధించేందుకు రాష్ట్రం తరఫున విదేశాల్లో జరిగిన అనేక సమావేశాలకు హాజరయ్యానని తెలిపారు. రాష్ట్ర పురోగతికి అంకితభావంతో పనిచేసి పలు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాంటి తనపై మంత్రి సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని, ఆమె వ్యాఖ్యలు తన పరువుకు భంగం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలను, సోషల్ మీడియాలోని కథనాలను, పలు టీవీ ఛానల్లో వచ్చిన వార్తలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తంచేసి కోర్టుకు సమర్పించారు. పత్రికల్లో వచ్చిన క్లిపింగ్‌లను, ఫోటోలను పిటిషన్‌కు జోడించి దాఖలు చేశారు.

కొండా సురేఖ గతంలో కూడా ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేసి, ఎన్నికల సంఘంతో చీవాట్లు తిన్న విషయాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలను రాజకీయపరమైన వ్యాఖ్యలుగా మాత్రమే కాకుండా ప్రణాళికబద్ధంగా చేసిన కుట్రగా చూడాలని కేటీఆర్ తన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. సురేఖ చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకొని, వాటి వెనుక ఉన్న నేరపూరిత దురుద్దేశాల పరిగణలోకి తీసుకొని, ఆమెకు చట్ట ప్రకారం శిక్ష వేయాలని కోర్టును కోరారు. బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమా, దాసోజు శ్రవణ్‌లను పిటిషన్ సాక్షులుగా చేర్చిన విషయం విదితమే.

# డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి

*** క్యాట్‌లో ఐఏఎస్ అధికారుల పిటిషన్లు**

**ఢిల్లీ:** కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్) ఆదేశాలతో ఇటు తెలంగాణ, అటు ఆంధ్రప్రదేశ్‌లలో కొనసాగుతున్న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు పునర్విభజన చట్టం ప్రకారం కేటాయించిన రాష్ట్రాల్లో రిపోర్ట్ చేయాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ విభాగం (డీవోపీటీ) జారీ చేసిన ఆదేశాలను సవాల్ చేస్తూ పలువురు ఐఏఎస్ అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు. డీవోపీటీ ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ అధికారులు వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి, సృజన క్యాట్‌లో వేర్వేరుగా పిటిషన్‌లు దాఖలు చేశారు. తెలంగాణలో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని వాకాటి కరుణ, వాణి ప్రసాద్, ఆమ్రపాలి కోరారు. ఏపీలోనే కొనసాగేలా ఉత్తర్వులు ఇవ్వాలని ఐఏఎస్ అధికారిణి సృజన కోరారు. వారి పిటిషన్లపై కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టనుంది.

ఏపీకి కేటాయించి తెలంగాణలో కొనసాగుతున్న వారిలో ఐఏఎస్ అధికారులు వాణీప్రసాద్, వాకాటి కరుణ, రొనాల్డ్ రోస్, ఆమ్రపాలి, ప్రశాంతి, ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాల్సిన వారిలో ఐఏఎస్ అధికారులు సృజన, శివ శంకర్, హరికిరణ్ ఉన్నారు. ఏపీ నుంచి తెలంగాణకు వెళ్లాలని దరఖాస్తు పెట్టుకున్న ఎస్.ఎస్.రావత్, అనంతరాము అభ్యర్థనలను డీవోపీటీ తిరస్కరించింది. వీరిద్దరూ ఆంధ్రాలోనే కొనసాగుతారు.

### 21న రాష్ట్రానికి రానున్న కాళేశ్వరం

# న్యాయ కమిషన్ ?

*** విచారణ కొనసాగింపు**

**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ఎత్తిపోతల్లోని ప్రధాన బ్యారేజీల్లో అవకతవకలు, నష్టాలపై విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ ఈ నెల 21న రాష్ట్రానికి రానున్నట్లు తెలిసింది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై అఫిడవిట్లు సమర్పించిన వారిని బహిరంగ విచారణ చేస్తున్న కమిషన్ మలిదశలోనూ దీన్ని కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. గత నెల 19 నుంచి 28 వరకు విచారణ చేపట్టిన అనంతరం 29న జస్టిస్ ఘోష్ కోల్‌కతాకు వెళ్లారు. 28వ తేదీన చివరగా మాజీ ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లును కమిషన్ విచారించింది. విచారణను అర్ధాంతరంగా ముగించి మళ్లీ పిలుస్తామని తెలిపింది. ఈ నెలలో విచారణ కొనసాగించే అవకాశాలు ఉన్నాయి. ఐఏఎస్‌లు, విశ్రాంత ఐఏఎస్ అధికారులతోపాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులను కూడా విచారణకు పిలిచే అవకాశాలు ఉన్నట్లు సమాచారం.

క్వాలిటీ కంట్రోల్‌పై 'విజిలెన్స్' దృష్టి?

'కాళేశ్వరం'పై విచారిస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదికను రూపొందించడంలో నిమగ్నమైంది. ఇందులో భాగంగా తదుపరి విచారణకు నీటిపారుదల శాఖలోని క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్లను పిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇటీవల సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్ (సీడీవో), స్టేట్ లెవల్ స్టాండింగ్ కమిటీ సభ్యులను పలువురిని పిలిచి విచారణ నిర్వహించింది. గతంలో సమర్పించిన ప్రాథమిక, మధ్యంతర నివేదికల్లో క్వాలిటీ కంట్రోల్ విభాగం లోపాలు కూడా ఉన్నాయని పేర్కొంది. ఈ నేపథ్యంలో ప్రత్యక్ష విచారణకు ఈ విభాగానికి చెందిన ప్రస్తుత, గతంలో పనిచేసిన ఇంజినీర్లను పిలిచే అవకాశాలు ఉన్నాయి. మేడిగడ్డ బ్యారేజీ పనుల పూర్తికి సంబంధించి 'కంప్లీషన్ సర్టిఫికేట్' విషయంలో ప్రాజెక్టు ఇంజినీర్లు, నిర్మాణ సంస్థ మధ్య లేఖల పరంపర కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ విషయంపైనా విచారణ ఉండొచ్చని తెలుస్తోంది.

### మాడభూషి శ్రీధర్, పాశం యాదగిరిపై

# పోలీసుల దాడి గర్హనీయం

*** మాజీ మంత్రి హరీశ్‌రావు ఖండన**



**విశ్వంభర, హైదరాబాద్ :** నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిన్న ఆదివారం నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిపై రేవంత్ రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. పోలీసుల అనుచిత ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నానని పేర్కొన్నారు. కాగా తమపై సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని మాడభూషి శ్రీధర్, పాశం యాదగిరిలు తెలిపారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వయంగా ఫోన్ చేస్తే వెళ్లామని, రేవంత్ రెడ్డి వస్తున్నారని ఆయన సెక్యూరిటీ తన గొంతు నొక్కి తోసేశారని, తన మిత్రుడు యాదగిరి కాలి పైన తొక్కితే నెత్తురు వచ్చిందని మాడభూషి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ అంటే చంపడమా? ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చుట్టూ ఉన్న వాళ్లు పోలీసులా? లేక ప్రైవేట్ సైన్యమా? సీఎం కోసం అక్కడ ఉన్న ప్రతి వాడిని చంపేయాలా? అని ప్రశ్నించారు. అదృష్టవశాత్తు చావు నుంచి తప్పించుకుని, బయటపడ్డామన్నారు. మీ అలయ్ బలాయ్ లేకపోతే మానేయండి.. సామాన్యుల్ని చంపకండి అంటూ శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు.

### మహారాష్ట్రలో పెరుగుతున్న

# అండర్ వరల్డ్ డాన్‌ల ప్రభావం

ప్రభుత్వానికి గుజరాత్ డాన్‌ల మద్దతు

వారితో లింక్ లేకుంటే సిద్ధిఖీ కుట్రదారులను శిక్షించాలి

సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు

**ముంబయి:** ఎన్సీపీ (అజిత్ పవార్ వర్గం) సీనియర్ నేత, సల్మాన్‌ఖాన్ స్నేహితుడు బాబా సిద్ధిఖీ హత్య నేపథ్యంలో శివసేన(యూబీటీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత మహాయుతి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో గ్యాంగ్ వార్‌లు, అండర్ వరల్డ్ డాన్‌ల ప్రభావం పెరుగుతోందని దుయ్యబట్టారు. ఈ కుట్రలు గుజరాత్‌లో జరుగుతున్నాయని అన్నారు. ఇటీవల గుజరాత్‌లో రూ.5,000 కోట్ల విలువైన డ్రగ్స్ లభ్యమైన విషయం గురించి ప్రస్తావిస్తూ అంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ పట్టుబడ్డాయంటే ఇంకా దేశంలో ఏ స్థాయిలో డ్రగ్స్ పంపిణీ అయ్యుంటాయో అని అనుమానం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర ప్రభుత్వానికి గుజరాత్‌కు చెందిన అండర్ వరల్డ్ డాన్‌ల మద్దతు ఉందని సంజయ్ రౌత్ ఆరోపించారు. నిజంగా వారితో ఎటువంటి సంబంధాలు లేకపోతే సిద్దిఖీ హత్యకు కుట్ర పన్నిన వారికి శిక్ష విధించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేకు సవాలు విసిరారు. ''బద్లాపూర్ లైంగిక వేధింపుల కేసులో చర్య తీసుకున్న తర్వాత శిందే తనను తాను సింహమని ప్రకటించుకున్నారు. అదే నిజమైతే, ఆయనకు ధైర్యముంటే సిద్దిఖీ హత్యకు కుట్రపన్నిన వారిని వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలి'' అని రౌత్ అన్నారు.

### అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ పనులు పూర్తి చేయాలి

**కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్**

**విశ్వంభర, మహబూబాబాద్:** సోమవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే గుర్తించబడి కొనసాగుతున్న పాఠశాలల అభివృద్ధి పనులు, (438) అమ్మ ఆదర్శ పాఠశాలల, త్రాగు నీరు, సరఫరా, టాయిలెట్స్ , విద్యుత్ సరఫరా, మైనర్ రిపేర్స్ , బాలికలకు ప్రత్యేక టాయిలెట్స్, పనులు, (315) మన ఊరు మన బడి, క్రింద కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, పెయింటింగ్స్, గ్రీన్ చాక్ బోర్డు, టేబుల్స్, అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధి తదితర పనులలో పెండింగ్ ఉంటే వెంటనే పూర్తి చేయాలని, సంబంధిత పంచాయతీరాజ్, ఆర్ అండ్ బీ, ట్రైబల్ వెల్ఫేర్, టీజీ డబ్ల్యూఐసీ, శాఖలను కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాఠశాల అభివృద్ధి, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి, పనులను పూర్తి చేసి విద్యార్థిని, విద్యార్థులకు హ్లాదకరమైన వాతావరణంలో విద్యాబోధనలు అందించడం కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో (ఇన్చార్జి) డీఈఓ శ్రీరాములు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

### క్రీడలను ప్రోత్సహిస్తున్న సీఎం రేవంత్

**డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**

**విశ్వంభర, కరీంనగర్ :** మానకొండూరు నియోజకవర్గం శంకరపట్నం గ్రామంలో క్రీడల బహుమతి ప్రధాన కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ముఖ్యఅతిథి గౌరవ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యానారాయణ తో పాటు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పెరుమండ్ల రామకృష్ణ మాట్లాడుతూ దివంగత నందన్ స్మారకార్థం వారి తల్లిదండ్రులు క్రీడలు నిర్వహించడం చాలా అభినందనీయం అన్నారు. స్థానిక శాసనసభ్యులు డాక్టర్ కమ్మంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కరీంనగర్ జిల్లాకు, రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించే విధంగా పలు కార్యక్రమాలు చేపడుతుండడం చాలా హర్షించదగ్గ విషయమని, రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు క్రీడలను దేశవ్యాప్తంగా ప్రోత్సహిస్తుందని డాక్టర్ రామకృష్ణ అన్నారు. యువతి యువకులు క్రీడల వైపు మొగ్గుచూపి వచ్చే ఒలంపిక్స్ లో భారతదేశం కలలుగన్న మెడల్స్ ను తప్పకుండా సాధిస్తారని పూర్తి విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శంకరపట్నం నాయకులు కార్యకర్తలు, గ్రామస్తులు, యువతి యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఏపీలో ముగిసిన మద్యం దుకాణాలకు లాటరీ



**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ ముగిసింది. శుక్రవారం దరఖాస్తుల స్వీకరణకు గడువు ముగియగా సోమవారం లాటరీ పద్ధతిలో విజేతలను ప్రకటించారు. ఈసారి విజేతల్లో మహిళల సంఖ్య కూడా భారీగానే ఉండడం విశేషం. లైసెన్స్ ఫీజులో ఆరో వంతు డబ్బును 48 గంటల్లోగా చెల్లించి వ్యాపారాలు ప్రారంభించుకోవచ్చని ప్రభుత్వం తెలిపింది. ఇందుకోసం లాటరీ తీసిన కేంద్రంలోనే కౌంటర్ కూడా ఏర్పాటు చేశారు. శ్రీసత్యసాయి పుట్టపర్తి జిల్లాలోని 87 మద్యం షాపులకు లాటరీ తీయగా అందులో 60 దుకాణాలు మహిళలే గెలుచుకోవడం విశేషం. జిల్లాలో మొత్తం 1074 అప్లికేషన్లు రాగా 87 మందిని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. బాపట్ల జిల్లాలో 117 షాపులకు 2149 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 6 షాపులను మహిళలు దక్కించుకున్నారు. వైఎస్సార్ జిల్లాలో 139 దుకాణాలు కేటాయించగా ఓ న్యూస్ ఛానల్ ప్రతినిధులు కమలాపురం నియోజకవర్గంలోని 4 దుకాణాలను లాటరీలో దక్కించుకున్నారు. వారితో సిండికేట్ కోసం స్థానిక నేతలు అప్పుడే వారితో మంతనాలు ప్రారంభించినట్లు సమాచారం. లక్ కొద్దీ దక్కినా లైసెన్స్ రద్దు : అల్లూరి జిల్లాలో ఓ వ్యక్తి మద్యం దుకాణాల కోసం పెద్ద యజ్ఞమే చేశాడు. మొత్తం 60 అప్లికేషన్లు పెట్టుకున్నాడు. ఇందులో 3 షాపులు లాటరీలో వచ్చాయి. లాటరీ ద్వారా లిక్కర్ షాప్ గెలుచుకున్న వారిలో ఓ వికలాంగుడు కూడా ఉన్నాడు. పెదబయలులో అతనికి దుకాణం దక్కింది. మరోవైపు జిల్లాలోనే లాటరీ దక్కిన వ్యక్తి లైసెన్స్ రద్దు చేశారు. ఏం జరిగిందంటే లాటరీ వచ్చిన వ్యక్తి గిరిజనేతరుడని తేలింది. దీంతో అతని లైసెన్స్ రద్దు చేసి రెండోస్థానంలో వచ్చిన వ్యక్తికి కేటాయించారు. మొత్తం 3,396 మద్యం దుకాణాలకు దాదాపు 90 వేల దరఖాస్తులు వచ్చాయి. కేవలం దరఖాస్తుల ద్వారానే రూ.1,800 కోట్ల వరకు ఆదాయం సమకూరిందని అంచనా. ఏపీలో 2017లో చివరిసారిగా ప్రైవేటు మద్యం పాలసీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ అయింది. అప్పట్లో 4,380 దుకాణాలకు 76 వేల దరఖాస్తులు వచ్చాయి. కానీ ఈసారి 3,396 దుకాణాలకు మాత్రమే ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చినా సుమారు 90 వేలకుపైనే దరఖాస్తులు వచ్చాయి.

రిపోర్టర్స్ కావలెను V3 NEWS తెలుగు దినపత్రిక విశ్వంభర
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Project By GNR
ANVAYA
Premium luxury villa
KONGARAKALAN
Creating A Beautiful Home For You And Your Family
Marketed By South Icon Group
NO Pre EMI's UPTO 24 Months
PRICE 5499/- Per Sft
200 Yards@ 1.5 Cr
400 Yards @ 2.5 Cr
Approved By hmda
80% Loan Available From All Leading Banks



52,000 sqft Iconic Club House With Forest View
30 Ac Area Villa Project With 320 Premium Luxury Villas
Evergreen Surroundings for A Life Time Beside Forest

AMENITIES
- Gym
- Aerobics
- Indoor Games
- Olympiad Size Swimming pool,
- Badminton court
- Squash Court
- Banquet halls
- Multi-purpose & conference hall
- Creche
- Spa and Saloon
- Bar and Lounge
- Supermarket
- Canteen
- Clinic
- Billiards pool table
- Library

LOCATION HIGHLIGHTS
- 28 ACRES BIGGEST GATED COMMUNITY BT ROAD FACING LAYOUT
- 30 MIN DRIVE FROM KOKAPET/FINANCIAL DISTRICT THROUGH TSPA JUNCTION
- PROXIMITY TO 19000 ACERS PHARMA CITY
- PROXIMITY TO TCS ADIBATLA, AEROSPACE AND FABCITY.
- PROXIMITY TO EDUCATIONAL INSTITUTIONS
- 30 MIN DRIVE FROM HI-TECH CITY, GACHIBOWLI
- 15MIN DRIVE FROM RGIA AIRPORT

South Icon Group Your Trust Our Legacy
Corp Office : Plot No. 63P & 62 (NP) 3rd Floor, Samatha nagar Nagole 'X' Roads, Hyderabad - 500 068.
CONTACT FOR MORE DETAILS 9652167668

STUDENT VISA ASSISTANCE



BP TECH INDIA, USA
- Training By Real Time Experience
- Hands on Based Training
- Job Assistance
- Personality Development

.NET | Java | python | DevOps | Power BI | Selenium | SOFTWARE TESTING | aws
FIRST TIME IN NAGOLE
Address: Plot No.63P % 62 (NP) 2nd Floor, Samatha Nagar, Nagole X Road, Hyderabad - 500 068.
bptechindiapvtltd@gmail.com
www.bptechllc.in
+91 70955 35566

# 'హైడ్రా' భవిష్యత్తు తరాలకు భరోసా

## చెరువే ' ఊరికి ఆదరువు"

హైడ్రా అనే మాట నేడు ప్రతి ఒక్కరి నోట వినిపిస్తున్న మాట. పాలక పక్షం నుంచి ప్రతిపక్షం వరకు ,సంపన్నుల నుంచి సామాన్యుల వరకు, ఎన్నారైల నుంచి సాఫ్ట్వేర్ ఇంజనీర్ల వరకు ఎవరి నోటా విన్నా హైడ్రా... హైడ్రా ...హైడ్రా అంటూ చర్చిస్తూనే ఉన్నారు. అసలు హైడ్రా అంటే ఏమిటి? దీని విధి విధానాలు ఏమిటి? అసలు ఎందుకు ఈ హైడ్రా! ఎవరికోసం ఈ హైడ్రా!! ఏమి చేయబోతుంది ఈ హైడ్రా !అనే సందేహాలు, ప్రశ్నలు అందరిలోనూ తలెత్తుతూనే ఉన్నాయి. అందుకే హైడ్రా గురించి ,హైదరాబాద్ రియాలిటీ భవిష్యత్తు గురించి ఓ విశ్లేషణాత్మక వివరణ మీకోసం..




### హైడ్రా విధులు.. విధానాలు

హైడ్రా అంటే హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్. సింపుల్ గా హైడ్రా అని పిలుస్తున్నాం. ఈ హైడ్రా గతంలోనే ఉన్నప్పటికీ నేడు విస్తృతంగా ప్రచారానికి వచ్చిన మాట . హైదరాబాదు పరిధిలోని అంటే జిహెచ్ఎంసి పరిధి అనగా ఔటర్ రింగ్ రోడ్డు లోపల వైపు ఉన్న చెరువులను గుంటలను పరిరక్షించడం దీని ప్రధాన బాధ్యత. కబ్జాలకు గురికాకుండా చూడటం హైడ్రా విధి విధానం దీనితో పాటు వరదలు భూకంపాలు ప్రకృతి వైపరీత్యాలు విపత్తులు వచ్చినప్పుడు నగర ప్రజలకు అండగా ఉంటూ సేవలందించడం దీని విధి విధానాలు. ముఖ్యమంత్రి చైర్మన్ గా ఉండే ఈ హైడ్రాకు ఒక కమిషనర్ ఉంటూ తన విధులను నిర్వర్తిస్తుంది. అయితే ఈ హైడ్రా ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ నేటి ప్రభుత్వము వెలుగులోకి తీసుకువచ్చి హైడ్రాకు క్యాబినెట్ ఆమోదం, గవర్నర్ రాజముద్రతో మరిన్ని అధికారాలను కట్టబెట్టడంతో హైడ్రా విధులు మరింత విస్తృతం కానున్నాయి. ఈ హైడ్రా ఒక చట్టబద్ధ సంస్థగా ప్రభుత్వ ఆస్తులను, చెరువులను ,కుంటలను పరిరక్షించే వ్యవస్థగా చూడాల్సిన బాధ్యత పౌరులపై ఇక బలంగా ఉండబోతుంది.

### హైడ్రా తో " హైరానా ?" ఎందుకంత ఆందోళన?...

హైడ్రా అనగానే ఎందుకంత హైరానా పడుతున్నారు ?హైడ్రా అనగానే ఎందుకంత ఆందోళన చెందుతున్నారు? హైడ్రాతో పేద, సామాన్య ప్రజలకు ఏమిటీ సమస్య? హైడ్రా చర్యలతో ఎవరికీ నష్టం? ఎవరికి లాభం !! హైడ్రా ఎవరికోసం... సంపన్నుల కోసమా ! పేదవారి కోసమా!! ప్రతిపక్ష పార్టీలపై కక్ష సాధింపు కోసమా? లేక బిల్డర్లను వెంచర్ ఓనర్లను భయపెట్టి తన 'దారి"కి తెచ్చుకోవడం కోసమా? అనేక అనేక ప్రశ్నలు ఈ నోటా ఆ నోట రావడమే కాక నేడు రాష్ట్రంలో విస్తృతంగా చర్చ సాగిస్తున్నాయి .నిజానికి హైడ్రా రాకతో కబ్జాదారుల గుండెల్లో గుబులు పుట్టుకుంటుంది. చెరువులను ,కుంటలను, ఎఫ్ టి ఎల్, బఫర్ జోన్ స్థలాలను నిబంధనలకు విరుద్ధంగా లే. అవుట్ చేసి విక్రయించి సామాన్యులను నట్టేట ముంచారు. దీని మూలంగా హైడ్రా రాకతో సామాన్యులు ఆందోళన చెందాల్సి వచ్చింది. కబ్జాదారులు దర్జాగా తమ ఖజానా నింపుకున్నారు. చెరువులలో, ఎఫ్టీఎల్ ప్రాంతంలో, బఫర్ జోన్ స్థలాలలో నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధన ఎప్పటినుంచో ఉన్నప్పటికీ పట్టా భూముల సాకుతో యధేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు .దీంతో నగరంలోని పురాతన కాలం నాటి 5000 చెరువులకు గాను అన్ని కనుమరుగైపోయి కేవలం 935 చెరువులు మాత్రమే మిగిలి ఉన్నాయి. అందుకే వాటి రక్షణకు " హైడ్రా" అవతరించింది.

### ' చెరువే' ఆ ఊరికి ష ఆదురువు...

చెరువులే ఊరికి ఆదరువు. చెరువు ఊరికి తల్లి లాంటిదని గ్రామీణ ప్రాంతంలో పెద్దలు చెబుతున్న మాట. గ్రామంలో చెరువు ఉండి నీళ్లతో కళకళలాడితే ఆ గ్రామంలో పంటలకు సాగునీరు అందించడంతోపాటు సబ్బండ జీవరాశులకు దాహార్తిని తీర్చే జీవనదిగా ఉంటుంది. బట్టలు ఉతకడం నుంచి పిల్లలు ఈత నేర్చుకోవడం తోపాటు పశువులకు దాహార్తిని తీర్చే నిలయాలుగా చెరువులు నిలిచేవి. అలాంటి చెరువుల పరిరక్షణ రక్షణ మనందరి బాధ్యతగా నిలవాల్సిన ఆవశ్యకత అవసరం ఇప్పుడు ఎంతైనా ఉంది.

### చెరువు శిఖం, ఎఫ్టిఎల్, బఫర్ జోన్లు అంటే ఏమిటి...

ఒక చెరువుకు కట్ట ఉంటుంది ఆ కట్ట సామర్థ్యాన్ని బట్టి వర్షపు నీరు నిలువ ఉండే విధంగా లోతట్టు ప్రాంతం అంచనా వేసి ఆ కట్టకు అలుగు ఏర్పాటు చేస్తారు. వర్షం పడినప్పుడు చెరువు కట్టకు సమాంతరంగా నీళ్లు ఉన్న ప్రాంత మే చెరువు 'శిఖం'. ఈ శిఖం ప్రాంతం వర్షాలు పడుతున్న కొద్ది పెరిగే అవకాశం ఉంటుంది. దీనికోసం మరింత నీరు నిల్వ ఉండటం కోసం ఉండే ప్రాంతం ఎఫ్ టి ఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్ ),దీని తర్వాత కూడా ఇంకా వర్షాలు ఎక్కువగా పడితే నీళ్లు వచ్చి నిల్వ ఉండటానికి అవకాశం ఉన్న ప్రాంతాన్ని' బఫర్ జోన్' గా పిలుస్తారు. అయితే చెరువు శిఖం మాత్రం ఆ చెరువు విస్తీర్ణాన్ని బట్టి ప్రభుత్వ భూమిగా ఉంటుంది. FTL, బఫర్ జోన్ ప్రాంతాలు పట్టా భూములుగా ఉంటాయి. ఈ భూములను ప్రభుత్వాలు భూమిలేని పేదలకు పట్టాలిచ్చి వ్యవసాయం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తుంది. కాబట్టి FTL, బఫర్ జోన్లలో కేవలం వ్యవసాయ మాత్రమే చేసుకోవాలి తప్ప ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. హైదరాబాదు నగరం మహానగరంగా విస్తరిస్తున్న సమయంలో చెరువులు కుంచించుకుపోయి బఫర్ జోన్ ప్రాంతాలకు సైతం పట్టాలు ఉన్నాయనే కారణంతో ఆ హక్కుదారులు అమ్మడం, నిర్మాణదారులు ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం మూలంగా వెంచర్లు ఏర్పడి అక్రమ నిర్మాణాలు చకాచకా జరిగిపోయాయి. కానీ చిన్న చెరువులు ఐదు ఎకరాలలోపు విస్తీర్ణం ఉంటే ఎఫ్టిఎల్ ప్రాంతం నుంచి 9 మీటర్ల వరకు బఫర్ జోన్ గా వదిలివేయాలి, 5 ఎకరాల పైన విస్తీర్ణం ఉన్న చెరువులకు ఎఫ్టిఎల్ ప్రాంతాల నుంచి 30 మీటర్ల వరకు బొఫర్ జోన్లుగా ప్రభుత్వం నిర్ధారించింది ఈ బఫర్ జోన్ ప్రాంతంలో కానీ FTL ప్రాంతంలో గాని ఎలాంటి నిర్మాణాలు చేపట్ట కూడదని నిబంధనలు విధించింది .ఇప్పుడు ఈ నిబంధనలు తుంగలో తొక్కి ఎవరైతే అక్రమ నిర్మాణాలు చేపట్టారో వారి గుండెల్లో 'హైడ్రా' అనే రైలు పరిగెడుతుంది.

### హెచ్ ఎం డీ ఏ వెంచర్లకు 'హైడ్రా'తో ఎలాంటి ఇబ్బంది లేదు...

హెచ్ఎండిఏ నిబంధనల ప్రకారము FTL, బఫర్ జోన్ వదిలిన వెంచర్లలో కొనుగోలు చేయడం మూలంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవు. 2013 హెచ్ఎండిఏ ఏర్పడిన తర్వాత ఎవరైతే లే ఔట్లు చేసి బిల్డింగులు నిర్మించారో వారికి హైడ్రా ఎఫెక్టు ఉందా అనే ప్రశ్న తలెత్తుతుంది. నిబంధనల ప్రకారం కుంటలకు చెరువులకు ,నాలాలకు బఫర్ జోన్లు వదిలి చేసిన వెంచర్లలో ఓపెన్ ప్లాట్స్ కొనుగోలు చేయడం మూలంగా ఎలాంటి ఇబ్బందులు కలగకపోవచ్చు. కానీ నిబంధనలు అతిక్రమించి చేసిన వెంచర్లలో కొనుగోలు చేస్తే తప్పక మూల్యం చెల్లించాల్సి వస్తుంది. కాబట్టి అలాంటి ప్రాజెక్టులలో కొనుగోలు చేసిన వారు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే జరగబోయే నష్టం నుంచి కొంతైనా బయటపడే అవకాశం ఉంది.



- ఎం నరసయ్య
ప్రముఖ రియల్ ఎస్టేట్ విశ్లేషకుడు

# వస్తు ప్రమాణాలపై ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి




వస్తువులన్నింటికీ నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు ఉన్నా, సర్వం నాసిరకం అవుతున్న నేటి పరిస్థితుల్లో ప్రభుత్వాలు ప్రతి వస్తువుకు నాణ్యతా ప్రమాణాలు ఉండేలా ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అమెరికన్ సొసైటీ ఆఫ్ మెకానికల్ ఇంజనీర్స్ (ఏఎస్ఎంఈ), ఇంటర్నేషనల్ ఎలక్ట్రోటెక్నికల్ కమిషన్ (ఐఈసీ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ), ఇంటర్నేషనల్ టెలి కమ్యూనికేషన్ యూనియన్ (ఐటీయు), ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్స్ (ఐఈఈఈ), ఇంటర్నెట్ ఇంజనీరింగ్ టాస్క్ ఫోర్స్ (ఐఈటీఎఫ్) వంటి ప్రమాణాల అభివృద్ధి సంస్థలలో వినియోగదారులు, నియంత్రకాలు , పరిశ్రమలలో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు ప్రామాణీకరణ ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుతారు. వేలాది మంది నిపుణుల కృషిని గుర్తు చేసుకుంటారు. 1946, అక్టోబరు 14న లండన్‌లో జరిగిన సమావేశంలో 25 దేశాల ప్రతినిధులు పాల్గొని వినియోగ దారులకు ప్రామాణికమైన, నాణ్యమైన వస్తు ఉత్పత్తులను అందించేందుకు అంతర్జాతీయ ప్రామాణిక సంస్థను ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. దానికి గుర్తుగా అక్టోబరు 14న ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపుతారు. ఒక సంవత్సరం తరువాత అంతర్జా తీయ ప్రమాణిక సంస్థ ఏర్పడినప్పటికీ, 1970 వరకు మొదటి ప్రపంచ ప్రమాణాల దినోత్సవం జరుపుకోలేదు.

ప్రస్తుతం ఈ సంస్థలో 125 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రామాణీకరణ ప్రాముఖ్యత గురించి పరిశ్రమలు, వినియోగదారులలో అవగాహన పెంచుతారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాలలోని జాతీయ సంస్థలు వేరువేరు రోజుల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. 2014లో యునైటెడ్ స్టేట్స్ 2014, అక్టోబరు 23న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని నిర్వహించింది. కెనడా దేశపు జాతీయ అక్రెడిటేషన్ బాడీ అయిన స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా (ఎస్.సి.సి) అంతర్జాతీయ సంస్థలతో కలిసి ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంటుంది. 2012లో స్టాండర్డ్స్ కౌన్సిల్ ఆఫ్ కెనడా అక్టోబరు 12న ప్రపంచ ప్రమాణాల దినోత్సవాన్ని జరుపుకుంది. 1947లో భారతదేశంలో బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చట్టాన్ని ఆమోదించి బ్యూరోను ఒక శాసన బద్ధమైన సంస్థగా మార్చారు. అప్పటి నుంచే ఐ.ఎస్ .ఐ ముద్ర ప్రకటితమైంది. ఈ ముద్ర గల వస్తువులు నాణ్యత కలిగినది. 1947లో భారతీయ ప్రమాణాల సంస్థ మొదటి రెండు విభాగాలను ఏర్పాటు చేసింది. ఒకటి బట్టలకు, రెండవది ఇంజనీరింగ్‌కు సబంధించినది. ఈ సంస్థ నిర్ణయించిన తొలి ప్రమాణం ఏమిటో తెలుసా. మన జాతీయ పతాకం ఎంత పొడవు, వెడల్పు ఉండాలన్నది ఈ సంస్థ నిర్ణయించింది. 1951లో ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ సంస్థ కార్యాలయంలో దాన్ని స్వీకరిం చారు. అంతే కాదు మెట్రిక్ విధానాన్ని దేశంలో 1955లో ప్రవేశ పెట్టారు. తర్వాత తూనికలు, కొలతల పరిమాణాన్ని చట్టాన్ని ఆమోదించింది. కాలక్రమంలో టెలి కమ్యూని కేషన్స్ టీకాలు, నూనె గింజలు, తాగునీరు, పాడి పరిశ్రమ వంటివి కూడా ఈ సంస్థ పరిధిలోకి చేర్చారు. ఐఎస్ఐ మార్కు సంస్థ అనుమతి లేనిదే ఎవరూ వాడకూడదు. అన్ని సాంకేతిక పరీక్షలు, తనిఖీలు నిర్వహించిన దరిమిలా ఒక సంవత్సరానికి ఐఎస్ఐ లైసెన్స్ ఇస్తుంది.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# అద్భుత నృత్య కళాకారిణి శోభానాయుడు



వెంకట నాయుడు, సరోజినీ దేవి దంపతులకు ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి, పద్మశ్రీ అవార్డు గ్రహీత శోభా నాయుడు విశాఖపట్నం జిల్లా అనకాపల్లిలో 1956లో శోభ జన్మించారు. ఊయలలో ఉన్నప్పుడే నాట్యం చేయడం మొదలు పెట్టిన అద్భుత నృత్య కారిణి శోభానాయుడు. చిన్నతనంలో ఉయ్యాలలో ఉన్నప్పుడే కాళ్లూ, చేతులు లయబద్ధంగా కదిలించేవారట.. అది చూసిన తల్లి సరోజినీ దేవి శోభానాయుడికి నృత్యం నేర్పించాలనుకున్నారు. నాలుగో యేటే డ్యాన్స్ క్లాసులో చేర్పించారు శోభానాయుడిని, ఐదో యేట తొలి ప్రదర్శన ఇచ్చారు. ఆ రోజుల్లో కూచిపూడి పేరు ప్రాచుర్యంలో ఉండేది. కూతుర్ని ఎలాగైనా మంచి నృత్యకారిణిని చేయాలని ఆలోచించిన తల్లి సరోజినీ దేవి కూచిపూడిలో శిక్షణ కోసం చెన్నై తీసుకువెళ్లాలను కున్నారు. ఆడవాళ్లు వంటింట్లో నుండి హాల్ లోకి రావడమే తప్పు అని భావించే కుటుంబంలో పుట్టారామె. అలాంటింది నృత్యం కోసం అనకాపల్లి నుండి చెన్నై వెళ్లడం పెద్ద సాహసమే. అయినా ఆమె ఎదిరించారు. డ్యాన్స్ తర్వాత సినిమాల్లో చేరుస్తారా అంటూ ఎన్నో విమర్శలు చేశారు. అయినా తల్లి వెనక్కి తగ్గలేదు. తన కూతురికి ఉన్న టాలెంట్ ను సపోర్ట్ చేయాలనుకుంది. పదకొండేళ్లు చెన్నైలో కూతుర్ని పెట్టుకుని డ్యాన్స్ నేర్పిస్తూ అష్టకష్టాలూ పడ్డారు. శోభానాయుడు వెంపటి చిన సత్యం శిష్యురాలు. వెంపటి నృత్య రూపాలలో ఈమె అన్ని ప్రధాన పాత్రలనూ పోషించింది. చిన్నతనంలోనే ఆమె నృత్య నాటకాల్లో పాత్రలు పోషించడం మొదలు పెట్టింది. సత్యభామ, పద్మావతి, చండాలిక పాత్రల్లో ఆమె రాణించింది. స్వచ్ఛమైన నృత్యరీతి, అంకితభావం ఉన్న నాట్య గురువు. నాట్యం వృత్తిగా తీసుకున్న ప్రతిభాశాలి శోభా నాయుడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శోభానాయుడు తన బహుముఖ ప్రతిభకు నిదర్శనంగా 1982లో నృత్య చూడామణి, 1998లో ఎన్టీయార్ పురస్కారం, 1990లో సంగీత నాటక అకాడమీ అవార్డు, 2001లో పద్మశ్రీ పురస్కారం, 2011లో తంగిరాల కృష్ణ ప్రసాద్ స్మారక అవార్డులు అందుకున్నారు. హైదరాబాదులోని కూచిపూడి ఆర్ట్ అకాడమీ ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ద్వారా పిల్లలకు శిక్షణనిచ్చింది. శోభానాయుడు శిష్యులు పలువురు రాష్ట్ర, జాతీయ పురస్కారాలను అందుకున్నారు. శోభానాయుడు గత సంవత్సరం 64 సంవత్సరాల వయసులో మృతి చెందారు. దాదాపు నెల రోజుల క్రితం తన ఇంట్లో కాలు జారిపడిన ఆమె తలకు గాయం కాగా, అప్పటి నుంచి హైదరాబాద్ లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, అక్టోబర్ 13 అర్ధ రాత్రి దాటాక తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా న్యూరోలాజికల్ సమస్యతో చికిత్స పొందారు కూడా. హైదరాబాద్‌లో కూచిపూడి ఆర్ట్స్ అకాడమీని స్థాపించి వేల మందికి కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇచ్చి, ఎందరో నాట్య కళాకారులను తయారు చేశారని గుర్తు చేశారు.

# నవతరానికి ప్రేరణ అబ్దుల్ కలాం

## సామాన్య కుటుంబంలో జన్మించి అత్యున్నత శిఖరాలకు...

### నేడు డాక్టర్ అబ్దుల్ కలాం జయంతి

ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, అత్యున్నత శిఖరాలను అధిరోహించిన మహనీయుల జీవితం నేటి నవతరానికి స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆయన అందరిలా అతి సామాన్య కుటుంబంలో జన్మించాడు. బాల్యంలో అనేక ఒడిదొడుకులను, కష్టాలను ఎదుర్కొన్నాడు. మొక్కవోని దీక్షతో ఆత్మవిశ్వాసంతో విద్యాభ్యాసం కొనసాగించాడు. చిన్నప్పుడే ఒక స్థిరమైన లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాడు. డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ఆ లక్ష్యం చేరాలని కలలు కన్నాడు. నిరంతర సాధనతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. భారతదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేసి అందరి మన్నలను అందుకున్న ఆ మహానుభావుడు చిన్నారులకు ప్రీతిపాత్రుడు. ఆయన జీవితమే నేటి నవ తరానికి ఒక ప్రేరణ.



అందరూ ఏపీజే అబ్దుల్ కలాం అని పిలిచే ఆయన అసలు పేరు డాక్టర్ అవుల్ ఫకీర్ జైన్ లాబ్దిన్ అబ్దుల్ కలామ్. ఈయన తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం దగ్గర ఉన్న ధనుష్కోటిలో పుట్టాడు. సామాన్య కుటుంబంలో పుట్టిన ఆయన పట్టుదల క్రమశిక్షణ, జ్ఞాన జిజ్ఞాసతో ఇంజనీరుగా ,శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా తన సేవలను ఈ జాతికి అందించాడు. శాస్త్ర రంగంలో విశేష కృషి చేసినందుకు గాను పద్మభూషణ్, పద్మ విభూషణ్,తో పాటు దేశ అత్యున్నత పురస్కారం, భారతరత్నతోను భారత ప్రభుత్వం సత్కరించింది. దేశ విదేశాల్లోని విశ్వవిద్యాలయాలు, గౌరవ డాక్టరేట్లతో ఆయనను గౌరవించాయి. రామనాథపురం హైస్కూల్లో చేరగానే తనలోని పది హేనేళ్ళ జిజ్ఞాసి మేల్కొన్నాడు. 1950లో ఇంటర్మీడియట్ పరీక్షకు చదవడానికి తిరుచినాపల్లిలో ట్రీచి సెయింట్ జోసెఫ్ కాలేజీలో చేరాడు. అబ్దుల్ కలాం అన్నయ్య ముస్తఫా కు ఒక కిరాణా దుకాణం ఉండేది. అప్పుడు ఆ కిరాణం దుకాణంలో ఉండి చదువుకుంటూ దుకాణాన్ని చూస్తుండేవాడు. ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత నేరుగా ఇంజనీరింగ్ లో చేరవచ్చు. అప్పుడు అబ్దుల్ కలాం దక్షిణ భారతదేశమంతటిలోను సాంకేతిక విద్యకు తల మానిక లాంటి మద్రాస్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తు చేశాడు. ప్రవేశానికి ఎంపిక అయితే అయ్యాడు కానీ అటువంటి ప్రతిష్టాత్మక సంస్థలో చదవడం అంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. దాదాపు వెయ్యి రూపాయలు అవసరమవుతాయి. కానీ అది తన తండ్రికి తలకు మించిన భారం విషయం అనుకున్నాడు. అప్పుడు తన సోదరి జోహార తనకు తోడుగా నిలబడింది. తన బంగారు గాజులు గొలుసు కుదరపెట్టి ఆమె తనకు సహాయం చేసింది. కలాం చదువుకోవాలన్న ఆమె ఆకాంక్ష.తన సామర్థ్యంపై ఆమె నమ్మకం గాఢంగా నన్ను చలింప చేసాయి అనుకున్నాడు. అప్పుడు అబ్దుల్ కలాం తన సొంత సంపాదన మీదనే ఆమె గాజులు విడిపిస్తానని తన మనసులోఒట్టు పెట్టుకున్నాడు. తను చదువుకునే రోజుల్లో తనకు వచ్చే స్కాలర్షిప్పే తన జీవన భాగ్యరేఖ అని భావించాడు.అది గాని లేకపోతే తాను చదువుకోవడం చాలా కష్టం అని అనుకున్నాడు. ఇంజనీరింగ్ పూర్తి చేసుకున్న తర్వాత డాక్టర్ అబ్దుల్ కలాం "మన విమానాన్ని మనమే తయారు చేసుకుందాం " అని తమిళంలో ఒక వ్యాసం రాశాడు. ఆ వ్యాసం అప్పుడు అందరిలో ఆసక్తి రేకెత్తించింది. ఆ పోటీలో గెలిచాడు. ప్రఖ్యాత తమిళ వారపత్రిక,ఆనంద వికటన్ సంపాదకుడి చేతుల మీదుగా మొదటి బహుమతి పొందాడు. డాక్టర్అ బ్దుల్ కలాం ఏరోనాటికల్ ఇంజనీరుగా కోర్సు పూర్తి చేసుకుని బయటకు వచ్చేసరికి రెండు అవకాశాలు వచ్చాయి.తన చిరకాల స్వప్నం నిజం చేసే రెండు ఉద్యోగ అవకాశాలు తన ముందుకు వచ్చాయి. ఒకటి సైనిక దళంలో ఉద్యోగం, రెండవది రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే సాంకేతిక ఉత్పాదక డైరెక్టర్ గా రెండు ఉద్యోగాలు ఒకేసారి వచ్చాయి. డాక్టర్ అబ్దుల్ కలాం రామేశ్వరం నుండి భారత రాష్ట్రపతిగా ఎదిగిన జీవిత చరిత్ర తెలుసుకొని ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువతరం ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



- దేవులపల్లి రమేశ్
సిద్దిపేట, నంగునూర్
9963701294

# రాజకీయాలను భ్రష్టుపట్టించేలా నేతల మాటలు : కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**విశ్వంభర, వరంగల్:** భారాస, కాంగ్రెస్ పాలన ఒకేలా ఉందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. బీఆర్ ఎస్ ప్రభుత్వ పథకాలకే కాంగ్రెస్ పేరు మార్చి ఇస్తోందని వ్యాఖ్యానించారు. ఉచిత బస్సు హామీ తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం మరేదీ నెరవేర్చ లేదన్నారు. గ్రామీణ స్థాయిలో బీజేపీని బలోపేతం చేస్తామన్నారు. ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భాజపా సభ్యత్వ నమోదు సమీక్షకు ఆయన హాజరయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.."రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారింది. హామీల అమలుకు నిధులు ఎలా సమకూరుస్తారో స్పష్టత లేదు. మూసీ సుందరీకరణ పేరిట రూ. లక్ష కోట్లు కేటాయించారు. నిధుల ఖర్చుపై ప్రణాళిక లేదు. తిట్లు, ఫిరాయింపుల్లో భారాస, కాంగ్రెస్ పోటీపడుతున్నాయి. కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీల అమలుపై పోరాటం చేస్తాం. 400 ఎకరాలు సమకూర్చితే మామునూరు విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్ వస్తుంది. రాజకీయాలను భ్రష్టుపట్టించేలా నేతల మాటలున్నాయి" అని కిషన్‌రెడ్డి విమర్శించారు.

**ఆలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం:**

దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక పర్యాటకం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మోదీ ప్రధాని అయ్యాక ఆలయాల రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. భద్రాచలం, రామప్ప, జోగు లాంబ, బల్కంపేట ఆలయాలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. వెయ్యి స్తంభాల మండపంలో పూజా కార్యక్రమాలు ప్రారంభించామన్నారు. "దేశ వ్యాప్తంగా 150 దేవాలయాలకు పూర్వవైభవం తీసుకొస్తున్నాం. ఇప్పుడు యువత కూడా పెద్ద సంఖ్యలో ఆలయాలకు వస్తున్నారు. దేశవ్యాప్తంగా ఆధ్యాత్మిక వాతావరణం పెరుగుతోంది. పెద్దలపై గౌరవం, దేశభక్తి, సమాజంపై బాధ్యత పెంచుకోవాలి. అంకితభావం, చిత్తశుద్ధితో దేశాభివృద్ధికి కృషి చేస్తాం. మోదీ ప్రభుత్వ హయాంలోనే రామప్ప దేవాలయానికి యునెస్కో గుర్తింపు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో భద్రకాళి ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.



**కిషన్ రెడ్డికి స్వాగతం పలికిన రావు పద్మా రెడ్డి:**

కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డికి హనుమకొండ జిల్లా బీజేపీ అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి స్వాగతం పలికారు. ఉమ్మడి వరం గల్ జిల్లా పర్యటనలో భాగంగా హనుమ కొండ జిల్లాకి విచ్చేసిన కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ జి.కిషన్ రెడ్డిని హనుమకొండ అదాలత్ వద్ద బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు శాలువతో సత్కరించి ఆహ్వానించారు.

# క్రీడాకారుల ప్రతిభను గుర్తించాలి

## క్రీడాకారిణికి ఉప్పల ఫౌండేషన్ ఆర్థిక సహాయం



**విశ్వంభర, ఎల్బీనగర్:** క్రీడాకారుల్లో వున్న ప్రతిభను గుర్తించాలి అని టి పిసిసి ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. సోమవారం నాగోల్‌లోని తన క్యాంపు కార్యాలయంలో జాతీయ యోగ అసన పోటీలకు ఎంపికైన పూజితకి ఖర్చులకి ఉప్పల ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ జాతీయ స్థాయిలో రాణించి సమాజానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలి అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్రీడాకారులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నారు అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అమ్మాయి తల్లి లక్ష్మి, పూర్ణ, డా. ఏ ఆర్ గుప్త, ఆర్య వైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



**విశ్వంభర, కుల్కచర్ల:** కుల్కచర్ల మండల పరిధిలోని పిరంపల్లి గ్రామానికి చెందిన నక్క ఈరమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సోమవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఈరమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి మనో ధైర్యం కల్పిం చారు. పరిగి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ కొత్తబ లిజ రాజు, గ్రామ మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, నరసింహులు,బోల్లనర్సింలు, పాల్గొన్నారు.

# పద్మశ్రీ మొగిలయ్యకు అండగా రాచకొండ కమిషనర్

**విశ్వంభర, నాగోల్:** పద్మశ్రీ కిన్నెర మొగులయ్యకి ప్రభుత్వం ఇచ్చిన భూమిలో గోడలను గుర్తు తెలియని దుండగులు కూల్చివేయడంతో రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్‌ని ఎల్‌బి నగర్ లోని క్యాంపు కార్యాలయంలో మొగులయ్య కలిసి సమస్య వివరాలను తెలియజేసారు. భూమి పరిరక్షణకు పూర్తి బాధ్యత తీసుకొంటామని అతనికి సిపి హామీ ఇచ్చారు. అనంతరం కమీషనర్ మొగులయ్యని గౌరవ పూర్వకంగా సత్కరించారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకి తెలంగాణ ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా, హయత్ నగర్ మండలం, భాగ్ హయత్ నగర్ సర్వే నెం.159లో 600 గజాల భూమిని మంజూరు చేయడం జరిగింది. మొగులయ్య సదరు ప్లాట్‌కు చుట్టూ ఫ్రీ కాస్ట్ గోడ నిర్మించుకున్నారు. మొగులయ్య తన ప్లాట్ వద్దకు వెళ్లి చూసేసరికి ఉత్తరం వైపు ఉన్న ఫ్రీ కాస్ట్ గోడను గుర్తుతెలియని వ్యక్తులు కూలగొట్టడం జరిగిందని మొగులయ్య హయత్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తక్షణమే స్పందించిన అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ విషయంలో రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపియస్‌ని మొగులయ్య సోమవారం ఎల్‌బి నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కలిసి మాట్లాడారు. తను మరల ఫ్రీ కాస్ట్ గోడ పునర్ నిర్మించుకొనుటకు తగిన తోడ్పాటు గురించి మొగులయ్య నుండి వివరాలు సిపి స్వయంగా అడిగి తెలుసుకోవడం జరిగింది. ఆ భూమి పరిరక్షణకు పూర్తి బాధ్యత తీసుకొంటామని ఈ కేసులో తదుపరి విచారణ చేసి గుర్తుతెలియని నేరస్థులను పట్టుకొని చట్టరీత్యా తగిన చర్యలు తీసుకుంటామని కమీషనర్ హామీ ఇవ్వడం జరిగింది. ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ మనోహర్, హయత్ నగర్ సిఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగులకు అండగా ఉంటా: మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**విశ్వంభర, మీర్‌పేట్:** మహేశ్వరం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పాల్గొని దివ్యాంగులకు వాహనాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు నేను అండగా ఉంటా మీకు ఎలాంటి కష్టం వచ్చినా నాకు ఫోన్ చేయండి అని మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి భరోసా కల్పించారు.

## ఆర్కే పురంలో ఘనంగా "మహా సత్సంగం"



**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం ఆర్కే పురం డివిజన్ లో "మహాసత్సంగము" నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మీ దేవాలయం నుండి రామకృష్ణ పురం కోపరేటివ్ సొసైటీ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమం కు ముఖ్య అతిథిగా ఇస్కాన్ బ్రహ్మచారి ప్రణవనంద దాస్, ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియ దాస్, మాయ నర్సింగ్ రావు. ఈ కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయం వ్యవస్థాపక అధ్యక్షులు గౌరీశెట్టి చంద్ర శేఖర్ గుప్త, చిలుక ఉపేందర్ రెడ్డి, రామ రావ్, రమేష్ బాబు, గందే శ్రీకాంత్, విజయ లక్ష్మి, నీలిమ, రాధ, సురేఖ, అర్చన, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క ఇటుక కూడా కూల్చకుండా ముందు నేను ఉంటా

### ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఎల్బీనగర్ నియోజక వర్గం పరిధి లోనిమూసి నది పరివాహక ప్రాంతాల్లో ఉన్న కట్టడాలు ఒక్క ఇటుక కూడా కూల్చకుండా ముందు నేను ఉంటా అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం చైతన్యపురి డివిజన్ పరిధిలోని ఫణిగిరి కాలనీవాసులు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ గత రెండు రోజుల క్రితం ఒక ప్రముఖ వార్త ఛానెల్ నందు ఫణిగిరి కాలనీ చుట్టుపక్కల మూసినది పరివాహక ప్రాంతాల్లో ఉన్న కట్టడాలు కూల్చివేస్తామని అని తెలపడంతో ఎమ్మెల్యే ను కలిసి తమ భాధ ను చెప్పు కోవడం జరిగింది అన్నారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మీరు ఎవరు ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.ఒక ఇటుక కూడా కూల్చకుండా చూస్తామని తెలిపారు.మీకు నేను అండగా వుంటానని వారికి ధైర్యం తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్ రెడ్డి,పవన్,కడియం మోహన్ రాజ్, కాలనీవాసులు వేణుగోపాల్,వీరచారి,జ్యోతి,ఆంజనేయులు,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**విశ్వంభర, భూపాలపల్లి:** ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహితుల పాత్ర కీలకం ఆట పాటలు, చిలిపి పనులు కష్టం, సుఖం ఇలా ఏదైనా కాని మన వెన్నంటే ఉండి నేనున్నాను అంటూ ధైర్యం చెప్పేదే ఒక స్నేహం. ఆనందం, బాల్యం, స్మృతులు, కరచాలనాలు, చెమ్మగిల్లిన కళ్ళతో అలింగనాలు గురువుల మందలింపులు తలుచుకుంటూ ఒకసారి వయస్సు మరచి పోయి చిన్న పిల్లల కేరింతలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాఘవరెడ్డి పేట అవరణం కోలాహలంగా మారింది. ఈ ప్రాంగణంలో అడుగు పెడుతూనే హెూదాలను మరిచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరిస్తూ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాఘవరెడ్డి పేట పాఠశాలలో 2008-09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పండుగగా మారింది. 16 సంవత్సరాల తర్వాత ఎక్కడెక్కడికో వెళ్ళిన వారు కొందరు, ఎక్కడెక్కడో స్థిర పడిన వారు కొందరు, ఉద్యోగాల్లో కొందరు, సహధర్మచారిణీలుగా కొందరు, వివిధ స్తితుల్లో జీవిస్తూ తమ మిత్రులను కలవాలనే తలంపులో ఆనాటి విద్యార్థులైన కొంత మంది విద్యార్థులకు ఆలోచన కలిగింది. ఈ సమ్మేళనంలో తమ గురువుల బోధనలు తమ కుటుంబ పరిస్థితులు నాటి చిలిపి చేష్టలను క్రమశిక్షణ పేరుతో గురువుల దండనలు తలుచుకుంటూ సాగిన పూర్వ విద్యార్థుల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆడిన ఆటలు పాటలు అలరించాయి. వచ్చిన పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాఘవరెడ్డి పేట ఆవరణలో పొద్దు పోయే వరకు గడిపి బరువెక్కిన హృదయాలతో ఎవరి గమ్య స్థానాలకు వారు కదిలారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగిశెట్టి వెంకటేశ్వర్లు, బత్తుల సదానందం, దేవేందర్రావు సర్, ఇంద్రాదేవి మేడమ్, రఘుపతి సర్, రవి సర్ లు పూర్వ విద్యార్థులు సునీల్, అఫ్జల్, సంగి తిరుపతి, కొండ్ర అనిల్, మాధవరావు, చిలుక సంధ్య, అమూల్య, అనూష మొదలగువారు పాల్గొన్నారు. విద్యార్థులు సమాజసేవ చేయడమే మా లక్ష్యం అని ఆ మార్గంలో కృషి చేయాలని, గవర్నమెంట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని ఉపాధ్యాయులు సూచించారు.



## జలగరి దేవకుమార్ ఆధ్వర్యంలో ఆలయ్ బలయ్



**విశ్వంభర, పటాన్‌చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు పట్టణ పరిధిలో తెలంగాణ సంస్కృతి సంప్రదాయమైన దసరా పండగ సందర్భంగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం పటాన్ చేరు పట్టణ యువ నాయకులు జలగరి దేవ రాజ్ ఆధ్వర్యంలో తన స్వగృహంలో రాజకీయాలకతీతంగా ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు అలయ్ బలయ్ కార్యక్రమానికి విచ్చేసిన వారికి శాలువాతో సన్మానించి స్వాగతం పలికారు. జలగరి దేవ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో ఘనంగా నిర్వహించుకునే పండగ దసరా పండుగని కులమతాలకు అతీతంగా ఇక నుండి ప్రతి ఏటా నిర్వహించుకుంటామని, అలయ్ బల య్ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పలు పార్టీల నేతలు, పలు సంఘాల నాయకులు, జేడీకే యువ సేన సభ్యులు పాల్గొన్నారు.

## రజక విద్యాభవన్‌కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, హన్మకొండ:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గం హన్మకొండ 10, 31వ డివిజన్‌లో వీరనారి చాకలి అయిలమ్మ విగ్రహం వద్ద కోటి రూపాయల నిధులతో నిర్మాణం చేస్తున్న రజక విద్యాభవన్‌కు వరంగల్ పశ్చిమ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్య శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అద్యక్షులు ఎస్. కుమార్ యాదవ్, అన్కేశ్వరపు సురేందర్, తెలంగాణా హై కోర్ట్ జడ్జ్, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు చీకటి ఆనంద్ సత్తు రమేష్, ఎల్లయ్య, చీకటి వీరస్వామి, మిర్జా అజీజుల్లా బేగ్, కే. కృష్ణ, మంద రాకేశ్, ఏ. ఈ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## భువనగిరి ఎమ్మెల్యేను కలిసిన మలిదశ ఉద్యమకారులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డిని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిస్టఫర్ కలిశారు. ప్రభుత్వం ఉద్యమకారులకు 25వేల రూపాయలు పెన్షన్ తో పాటు 250 చదరపు గజాల స్థలం ఇచ్చి, గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఉద్యమకారులకు న్యాయం జరిగే విధంగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సంగిశెట్టి క్రిస్టఫర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న, యాదాద్రి జిల్లా సాంస్కృతిక శాఖ కార్యదర్శి మల్లం వెంకటేశం, 1969 ఉద్యమకారులు తొలి మలిదశ ఉద్యమకారులు గంగాధరి సత్తయ్య, ఎరుకల స్వామి, లింగరాజుపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు గంధమల్ల గోపాల్, కన్నెకంటి శ్రీనివాసాచారి, మాంటి లింగం, రామన్నపేట మండలం అధ్యక్షులు నోముల శంకర్, చౌటుప్పల్ మండలాధ్యక్షుడు గట్టు సుధాకర్, కదిరేని స్వామి, పాల్గొన్నారు.

# డిగ్రీ కాలేజీల యాజమాన్యాలతో ప్రభుత్వం చర్చలు జరపాలి



**విశ్వంభర, షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయక పోవ డంతో సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు వారి తల్లి దండ్రుల ఇబ్బందులు పడుతున్నారని, సిబ్బం దికి జీతాలు ఇవ్వలేక భవన కిరాయిలు చెల్లిం చలేక ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూన్నాయని ఎఐఎస్ఎఫ్ నాయకులు వ్యక్తం చేసారు. గత మూడు సంవత్సరాల నుండి ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక డిగ్రీ కళాశాల యాజమాన్యాలు రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్ చేస్తున్నట్లు ప్రకటించాయని ఎఐఎస్ఎఫ్ షాద్ నగర్ ఇన్చార్జ్ ఆకాష్ నాయక్ తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికి స్పందించకుండా మౌనంగా ఉండడం సరికాదని ఆయన అన్నారు. ఇప్పటికే అనేక సెలవులు రావడం వల్ల విద్యార్థులు విద్యా సంవత్సరంలో వెనుకబడ్డారని మళ్లీ రేపటి నుండి డిగ్రీ కళాశాలలు ఫీజురీయంబర్స్ మెంట్ విడుదల చేసే వరకు నిరవధికంగా బంద్ చేస్తే విద్యార్థులకు తరగతుల నిర్వహణ, సెమిస్టర్ పరీక్షల నిర్వహణ ఆలస్యమయ్యే అవకాశం ఉంటుందని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కునే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజు బకాయిల విడుదల చేయడం లో నిర్లక్ష్యం చేసిందని మాట్లాడిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఫీజు బకాయిలు మొత్తం ఒకే సారి విడుదల చేస్తామని చెప్పారు. ఆనాటి పీసీసీ అధ్యక్షుడు, నేడు ముఖ్య మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్న ఇప్పటికీ ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్షిప్ బకాయిల విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేయడం సరికా దని అన్నారు. అనేక రకాల ఖర్చులు చేస్తూ అనేక చెల్లింపులు చేస్తున్న ప్రభుత్వం ఫీజు బకాయిలు విడుదల చేయడంలో చేస్తున్న నిర్లక్ష్యం సరికాదని తెలిపారు. వెంటనే ప్రభు త్వం డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి వారికి ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయడం పై హామీ ఇవ్వాలని, లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఫీజు బకాయిల విడుదల అయ్యే వరకు పెద్ద ఎత్తున ఉద్యమాల తో ఉద్యమిస్తామని ఎఐఎస్ఎఫ్ షాద్ నగర్ ఇన్చార్జ్ ఆకాష్ నాయక్ హెచ్చరించారు.

## కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం : హరీశ్‌రావు

**విశ్వంభర, సంగారెడ్డి:** సంగారెడ్డిలో కలుషిత నీటితో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం బాధాక రమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విజయరామరాజు, అల్లం నవాజ్ రెడ్డి వంటి ముఖ్య నాయకులను కోల్పోవడం నిజంగా ఎంతో బాధాకరంమన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సాను భూతిని తెలిపారు. పార్టీకి చేసిన సేవలను ఎప్పటికీ మర్చిపోమంటూ వారికి నివాళుర్పించారు. అలయ్ బలయ్ పండుగ మన తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని నింపిందన్నారు.

## ఘనంగా వాసవి భవన్ దుర్గా మాత నిమజ్జనం



**విశ్వంభర, నార్కెట్‌పల్లి:** నవరాత్రులు అత్యంత భక్తి శ్రద్ధలతో వివిధ రూపాలలో పూజలందుకున్న దుర్గా మాత నిమ్మజ్జనం అదివారం షార్ట్ ఫిల్మ్ నటుడు నిర్మాత యూట్యూబర్ శివకోటి శేఖర్ జండా ఊపి ఘనంగా ప్రారంభించారు. తదనంతరం పట్టణ వీధుల్లో ఆర్య వైశ్య మహిళల కోలాటల మధ్యన నిమజ్జన శోభా యాత్ర కన్నులపండుగ గా కొనసాగింది. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆర్య వైశ్యులు పాల్గొన్నారు.

# అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులు

## మోండా మార్కెట్ ముత్యాలమ్మ ఆలయం వద్ద ఉద్రిక్తత, ఒకరి అరెస్టు

**విశ్వంభర, సికింద్రాబాద్:** సికింద్రాబాద్ మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్యాలమ్మ ఆలయంలోకి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అర్ధరాత్రి చొరబడి అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దాంతో ఆలయ పరిసర ప్రాంతాలలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆలయం వద్దకు చేరుకున్న స్థానికులు వెంటనే నిందితులను పట్టుకోవాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. పోలీసులు స్థానికులను నిలువరించే ప్రయత్నం చేశారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఒకర్ని అరెస్టు చేశారు. మరోవైపు ఈ విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలయం వద్దకు వచ్చి సీపీ ఆనంద్‌తో కలిసి గర్భగుడిని పరిశీలించారు.

### ఆలయాలను రక్షించే బాధ్యత ప్రభుత్వానిదే...కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి ఆలయాలకు రక్షణ కల్పించాలని డిమాండ్? చేశారు."హైదరాబాద్? నగరంలో గత కొన్ని రోజులుగా కావాలనే హిందూ దేవాలయాల మీద ముఖ్యంగా నవరాత్రి పూజల సందర్భంగా చాలా రకాల ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల ఎగ్జిబిషన్? గ్రౌండ్‌లో జరిగిన సంఘటన అందుకు నిదర్శనం. అదేదో దొంగతనానికి వచ్చారని ఒకసారి, మానసికంగా బాగా లేదని మరోకసారి పోలీసులు మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేస్తున్నారు.



ఈ అంశంపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. రానున్న రోజుల్లో హిందూ దేవాలయాలన్నింటినీ రక్షించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి “ అని కిషన్‌రెడ్డి అన్నారు.

### ఎంపీ, ఎమ్మెల్యేల ఖండన

మరోవైపు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ కూడా ఘటనా స్థలికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. అదేవిధంగా అమ్మవారి విగ్రహం ధ్వంసం ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మల్కాజ్?గిరి ఎంపీ ఈటల రాజేందర్? తెలిపారు. దాడి చేసిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విగ్రహం ధ్వంసంపై గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఒక్క రాజకీయ నాయకుడిని ఆలయం వద్దకు రానిస్తున్నారని, తనను మాత్రం ఎందుకు గృహ నిర్బంధం చేశారో అర్థంకావటం లేదన్నారు.

## రూ. 2 లక్షల 50 వేల ఎల్ఓసీ మంజూరు



**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్ర ఐటీ అండ్ పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎం ఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గంలోని మహాదేవపూర్ మండలం బొమ్మపూర్ గ్రామానికి చెందిన సింగిరెడ్డి సుప్రియకి రూ. 2,50,000 ఎల్ఓసీ మంజూరు చేసి ఇప్పించారు. సింగిరెడ్డి సుప్రియ బ్రెయిన్ సర్జరీకి సంబంధించి నిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం 2 లక్షల 50 వేల ఎల్ఓసీ మంజూరు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రిలో వారి సహాయకులకు హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## పూలే విగ్రహాన్ని కూల్చిన దుండగులను శిక్షించాలి

### బహుజన నాయకుల విగ్రహాల ధ్వంసంపై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

### వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్



**విశ్వంభర, వరంగల్:** వరంగల్ లోని దేశాయిపేట సెంటర్‌లో గల మహాత్మా జ్యోతి రావ్ పూలే విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగలను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. దేశాయిపేట్ సీకేఎం కాలేజ్ గ్రంథాలయం ముందు గల మహాత్మా జ్యోతి రావ్ పూలే విగ్రహాన్ని రాత్రి కొంతమంది గుర్తు తెలయని దుండగలు ధ్వంసం చేయగా కూలిన విగ్రహాన్ని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ సందర్శించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ పోలీసు అధికారులు దుండగలను గుర్తించి వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. ఇటీవల కాలంలో దేశ వ్యాప్తంగా మహనీయులు, బహుజన నాయకుల విగ్రహాల పైన వరుసగా దాడులు జరుగుతున్నాయని, దీని పైన ప్రభుత్వం స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షులు కురిమిళ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి సాంబరాజు, విక్రమ్, కొడారి అనిల్, సంతోష్, కేవీపీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపనకు రానున్న సీఎం



**విశ్వంభర, పూడూరు:** పూడూరు మండల పరిధిలోని దామగుండంలో ఏర్పాటు కాబోతున్న నేవీ రాడార్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్, కేంద్ర, రాష్ట్ర శాఖ మంత్రులు, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, వికారాబాద్ జిల్లా ఎమ్మెల్యేలు విచ్చేస్తున్నట్టు పరిగి ఎంఎల్ఏ డాక్టర్ టి, రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశ రక్షణలో నేవీ రాడార్ స్టేషన్ కీలక పాత్ర పోషించ బోతుందని పరిగి నియోజకవర్గానికి ఈ ప్రాజెక్టు తలమానికం అని తెలిపారు.

# గన్‌పార్క్ వద్ద సాయిబాబాకు పలువురి నివాళి

## సంతాప సభకు నిరాకరణ

**విశ్వంభర, హైదరాబాద్:** గన్‌పార్కులోని అమర వీరుల స్థూపం వద్ద ప్రొఫెసర్ సాయిబాబా భౌతిక కాయానికి పలువురు నివాళులర్పించారు. సీపీఐ నేత నారాయణతో పాటు పలువురు వామపక్ష నేతలు అంజలి ఘటించారు. సాయిబాబా అభిమానులు పెద్ద ఎత్తున అక్కడికి తరలివచ్చారు. కామ్రేడ్ సాయిబాబా అమర్ రహే, లాల్ సలాం, ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. గన్‌పార్కు వద్ద 5 నిమిషాల సంతాప సమావేశం ఏర్పాటు చేస్తామని కుటుంబసభ్యులు, అభిమానులు కోరగా.. పోలీసులు నిరాకరించారు. సాయిబాబా అంబులెన్స్‌లోనే ఉంచి నిర్వహిస్తామని చెప్పినా అనుమతివ్వలేదు. దీంతో సాయిబాబా అభిమానులు, పోలీసుల మధ్య వాగ్వాదం జరిగింది. అనంతరం సాయిబాబా భౌతికకాయాన్ని మౌలాలిలోని ఆయన నివాసానికి తరలించారు. పుస్తకాలు కాకుండా సమాజాన్ని చదివేవారు మేధావులని సీపీఐ నేత నారాయణ అన్నారు. సాయిబాబా అలాంటి వ్యక్తి అని కొనియాడారు. గన్‌పార్కు వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. పదేళ్ల అన్యాయంగా జైల్లో నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. దోషి ఎవరో తేల్చాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తికి లేఖ రాస్తామని నారాయణ చెప్పారు.

## మార్పు, హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి: హరీశ్‌రావు

సాయిబాబా భౌతిక కాయానికి మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీ కోదండరామ్ నివాళి అర్పించారు. జైలు నుంచి వచ్చిన కొన్నాళ్లకే సాయిబాబా మరణించడం బాధాకరమని హరీశ్‌రావు అన్నారు. సమాజంలో మార్పు, హక్కుల కోసం పోరాడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. హక్కుల కోసం పోరాడేవారిపై అక్రమ కేసులు పెట్టడం బాధాకరమన్నారు. సాయిబాబాపై కేంద్రం అణచివేత ధోరణితో వ్యవహరించిందని కోదండరామ్



తెలిపారు. ఆయన మృతికి కేంద్రం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ మౌలిక సూత్రాల అమలు కోసం సాయిబాబా పోరాడారని తెలిపారు. ప్రజాస్వామ్య వాదులంతా ఆయన నిర్బంధాన్ని ఖండించారని కోదండరామ్ గుర్తుచేశారు.

## యూట్యూబ్ ఛానల్ పై కేసు నమోదు చేయాలి

### కేసముద్రం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన మున్నూరు కాపులు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా మున్నూరు కాపుల అస్థిత్వంపై తీన్మార్ తల్వార్ టీవీ పేరుతో ఉన్న యూట్యూబ్ ఛానల్ లో పరుష పదజాలంతో, మున్నూరు కాపుల మనోభావాలు దెబ్బతినేలా వాఖ్యలు చేసిన నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని మున్నూరుకాపు సంక్షేమ సంఘం, కేసముద్రం మండలం సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మున్నూరు కాపులు వలసవాదులని, మోసగాళ్లని దూషిస్తూ యూట్యూబ్‌లో అప్ లోడ్ చేసిన వీడియో ద్వారా మాట్లాడిన నిర్వాహకునిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. మున్నూరుకాపుల ఐకమత్యాన్ని చూసి ఓర్వలేక ఇలాంటి చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు. జనాభా దామాష పద్ధతిలో తమ రిజర్వేషన్లను సాధించే దిశలో ఇలాంటి చిల్లర రాజకీయాలు చేసే వారికి మేమంతా ఏకమై తగిన బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందని అన్నారు. బీసీలపై ఎన్ని కుట్రలు చేసినా రాబోయే బీసీ రాజ్యాన్ని ఎవరూ ఆపలేరని తెలిపారు. ఇట్టి సంఘటన వెనుక ఎవరున్నా వారిని వదిలే ప్రసక్తే లేదని, వారిని శిక్షించకుంటే బీసీలంతా ఒకే గొంతుకై నినదిస్తారని హెచ్చరించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చందా గోపి, కముటం స్వామి, కోశాధికారి సింగంశెట్టి ఏకాంతం, గౌరవ సలహాదారులు రావుల మురళి, దామరకొండ ప్రవీణ్ కుమార్, పిన్ని రాము, దలువాయి శ్రీనివాస్, తుంపిల్ల వెంకన్న పాల్గొన్నారు.


# ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలి

**విశ్వంభర, భూపాలపల్లి:** ఐడీఓసీ కార్యాలయ సమావేశపు హాలులో సోమవారం అన్ని శాఖల అధికారులతో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమస్యల వినతులు స్వీకరించారు. సమస్య పరిష్కారానికి ప్రజలు అందచేసిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ప్రజావాణిలో ప్రజలు అందించిన సమస్యలు పరిష్కారం అయ్యేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ప్రజావాణిలోమొత్తం 36 వివిధ రకాల దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. భూపాలపల్లి మండలం, జంగేడు గ్రామానికి చెందిన పైడిపాల సుధాకర్ తండ్రి రాజీరు తాను దివ్యాంగుడనని మూడు చక్రాల సైకిల్ ఇప్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ మూడు చక్రాల సైకిల్ మంజూరు చేయాలని సంక్షేమ అధికారి చిన్నయ్యను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ అదేశాల మేరకు సంక్షేమ అధికారి చిన్నయ్య సుధాకర్‌కు మూడు చక్రాల సైకిల్ అందచేశారు. ఈ సందర్భంగా సుధాకర్ జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి మూడు చక్రాలు సైకిల్ మంజూరు చేయడం వల్ల ధన్యవాదాలు తెలిపారు. ఎటు వెళ్లాలన్నా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తన పరిస్థితిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ వెంటనే మూడు చక్రాల సైకిల్ మంజూరు చేశారని ఎటైనా వెళ్లేందుకు ఇబ్బంది తీరిందని సంతోషం వ్యక్తం చేశారు. జూకల్లు గ్రామం, చిట్యాల మండలానికి చెందిన కంది మాధవరెడ్డి జూకల్లు గ్రామ శివారు సర్వే నంబర్ 55లో ఎస్ ఆర్ ఎస్ పీ కెనాల్ నీటి కుంట భూమి 5.20 ఎకరాలు ఉందని, అట్టి నీటి కుంట నుండి అక్రమంగా వేసిన పైపు లైన్ ద్వారా నీటిని సొంత అవసరాలకు వినియోగిస్తున్నారని, దీని వల్ల భూ గర్భ జలాలు తగ్గిపోయే అవకాశం ఉందని పేర్కొంటూ అట్టి క్వారీ భూమి ఎస్ఆర్ఎస్పీకి చెందినది అయినందున మోటార్లు తొలగించి అట్టి భూమికి సూచికలు బోర్డ్ ఏర్పాటు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం ఇరిగేషన్ ఈఈ కి ఎండార్స్మెంట్ చేశారు. చిట్యాల మండలం, గోపాలపూర్ గ్రామానికి చెందిన శ్రీరామోజు శ్రీనాథ్ మాచినిపర్తి గ్రామ శివారులో, వెంకటేశ్వర్లు పల్లెలో 315 సర్వే నంబర్లులో భూమి కలదని, వర్షా కాలంలో ఎగువ నుండి వచ్చే వరద నీరు వెళ్లకుండా చేయడం వల్ల తన 3 ఎకరాల భూమిలో పంట నష్టం జరుగుతున్నదని విచారణ చేపట్టి నీరు వెళ్లకుండా అడ్డు కట్ట వేయడం, మోరీలను పూడ్చడం జరిగిందని సమస్య పరిశీలించాలని చేసిన దరఖాస్తు పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు నిమిత్తం జిల్లా పంచాయతి అధికారికి ఎండార్స్మెంట్ చేశారు. భూపాలపల్లి మండలానికి చెందిన ఎం రాజు, ఎం పూర్ణ చందర్ లు అక్షర ఫెలిసిటీస్ అండ్ మేనేజ్మెంట్ కాంట్రాక్టర్ కలెక్టర్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ పద్దతిలో సెక్యూరిటి గార్డ్స్



ఉద్యోగాలు ఉన్నాయని నమ్మించి లక్ష రూపాయలు తీసుకున్నారని, 5 నెలలు పనిచేయించుకుని జీతాలు ఇవ్వకుండా నాకు కాంట్రాక్టు రాలేదని ఆఫీస్ నుండి వెళ్లగొట్టారని తాము చెల్లించిన డబ్బులు మరియు జీతాలు ఇప్పించాలని చేసిన దరఖాస్తు పరిశీలించిన జిల్లా కలెక్టర్ తగు చర్యలు కొరకు జిల్లా విద్యాశాఖాధికారికి ఎండార్స్మెంట్ చేశారు. ఆర్డీఓ మంగిలాల్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మల్ రెడ్డి రంగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినశ్రీనివాసరావు



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఇబ్రహింపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా జరిగాయి. మలక్ పేట్‌లోనీ తిరుమల హిల్స్ లోని ఆయన నివాసంలో జరిగిన వేడుకల్లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు పాల్గొని శాలువా కప్పి కేక్ కట్ చేయించి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ వచ్చే పుట్టినరోజు మంత్రి హోదాలో జరగాలని వేడుకుంటున్నట్లు కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువజన నాయకుడు స్వరూప్ రాజ్ పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్ రావు



**విశ్వంభర, హయత్‌నగర్:** హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ఆధ్వర్యంలో డివిజన్లోని పద్మావతి కాలనీలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ సభ్యత్వ కార్యక్రమంలో మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజల నుండి అనూహ్య స్పందన ఏర్పడుతుందని ఎల్బీనగర్ నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీ కార్పొరేటర్ల కృషితో ఇప్పటికే 30,000 పైగా సభ్యత్వ నమోదు చేయడం జరిగిందని, రానున్న రోజుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయడం జరుగుతుందని తెలిపారు. వికసిత భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్ రెడ్డి, మల్కాజ్గిరి పార్లమెంటు జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, ఎల్. బి. నగర్ కన్వీనర్ కొత్త రవీందర్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ అధ్యక్షులు ఉగాది ఎల్లప్ప, అధ్యక్షురాలు పార్వతి, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవిందా చారి, నాయకులు గంగాని శ్రీను, యాదగిరి, వెంకట్ రెడ్డి, లక్ష్మణ్, కాలనీ వాసులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




షాద్ నగర్ నూతన సిఐ నరసయ్య గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన షాబాద్ సహకారసంఘం మాజీ డైరెక్టర్ పట్లోళ్ల రాంరెడ్డి, సహకార సంఘం మాజీ చైర్మన్ నరసింహులు గౌడ్, శ్రీశైలం, బొంతపల్లి విద్యాసాగర్. విశ్వంభర, షాద్ నగర్

## ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ఇంటర్ నెట్ సర్వీస్ సెంటర్ ప్రారంభం



**విశ్వంభర, చివ్వేంల:** మార్చిలో జరిగే వరంగల్, ఖమ్మం, నల్లగొండ నియోజకవర్గ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో అర్హత గల ఉపాధ్యాయులు తమ ఓటును నమోదు చేసుకొనుటకు గాను ఏపీయూఎస్, టీపీయూఎస్ రాష్ట్ర పూర్వ అధ్యక్షులు తీకుళ్ళ సాయిరెడ్డి సోమవారం సూర్యాపేటలో ఇంటర్ నెట్ సర్వీస్ సెంటర్‌ను ప్రారంభించారు. సూర్యాపేట వాణిజ్య భవన్ సెంటర్ లో గల సాయికృష్ణ నెట్ సెంటర్లో ఉపాధ్యాయులు అధ్యాపకులు, ఆచార్యులు అందరూ ఉచితంగా సేవలను పొందవచ్చున్నారు. 1)దరఖాస్తు ఫామ్.19, 2)సర్వీస్ సర్టిఫికెట్ పైన ప్రధానోపాధ్యాయులు /ప్రిన్సిపాల్ సంతకం చేసిన కాపీ, 3)ఓటరు ఐడి, 4) ఆధార్ కార్డ్, 5) పాస్పోర్ట్ సైజ్ ఫొటో తీసుకొచ్చి సర్వీస్ సెంటర్ లో ఇస్తే వెంటనే నమోదు చేస్తారని తెలిపారు. 2019 లో ఉన్న ఓటర్ జాబితా పూర్తిగా రద్దయినందున ప్రతి ఒక్కరూ మళ్ళీ నమోదు చేసుకోవాల్సిందేనని తెలిపారు. నమోదుకు నవంబర్ ఆరవ తేది వరకు గడువు ఉన్నప్పటికి వెంటనే నమోదు చేసుకొని జాతీయవాదులకు అండగా నిలవాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమం లో బెల్లంకొండ రామమూర్తి, వారణాసి నర్సింహామూర్తి, కాసార్ల వెంకటరెడ్డి, ఉపేందర్ రెడ్డి, వేణు, కొత్తపెల్లి నవీన్ రెడ్డి, భగవాన్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

**నవంబర్ 6 వరకు ఓటరుగా నమోదుకు అవకాశం**

**పాత ఓటర్లు మళ్లీ పేరు నమోదు చేసుకోవాల్సిందే**

**విశ్వంభర, భూపాలపల్లి:** కరీంనగర్ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీల పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29తో ముగియనుంది. దీంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉమ్మడి నాలుగు జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా తయారీపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. దరఖాస్తుల దాఖలుకు నవంబర్ 6 వరకు అవకాశం ఉంది. అదేనెల 23న పట్టభద్రుల ఓటరు ముసాయిదా జాబితా, డిసెంబర్ 30న తుది జాబితా విడుదల చేస్తారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు ఓటరుగా అర్హులని అధికారులు తెలిపారు. 2021 అక్టోబర్ 31 వరకు డిగ్రీ లేదా అందుకు సమానమైన పరీక్ష పాసైన వారు ఓటరుగా అర్హులని, 2024 నవంబర్ 01 నాటికి డిగ్రీ పాసై మూడేళ్లు పూర్తి కావాలని అధికారులు తెలిపారు. కొత్త ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ, సిబ్బంది నియామకం, శిక్షణ, ఈవీఎంల పరిశీలన వంటి ప్రక్రియ ప్రస్తుతం సాగుతోంది అధికారులు తెలిపారు. మరోవైపు 2025 మార్చి 28 లోపు ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధమవుతోంది. పట్టభద్రుల ఓటరు జాబితాలో గతంలో పేరు నమోదై ఉన్నవారు సైతం ఈసారి ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం దరఖాస్తు చేసిన వారి పేర్లు మాత్రమే జాబితాలో నమోదు చేస్తామని ప్రకటించారు. దరఖాస్తుల స్వీకరణకు నవంబర్ 6వ తేదీ వరకు గడువు ఉందన్నారు. అదే నెల 23న ముసాయిదా జాబితా విడుదల చేస్తారు. డిసెంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి, అదేనెల 30న ఓటరు తుది జాబితా విడుదల చేయ డానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి ఫారం –19ను తహసీల్దార్/ఆర్డీవో కార్యాలయాల్లో పొందవచ్చు. ప్రైవేట్‌గా ముద్రించిన దరఖాస్తులు, ఎన్నికల సంఘం వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్నవి కూడా చెల్లుబాటవుతాయి. విద్యాసంస్థలో పనిచేసిన అనుభవ సర్టిఫికెట్‌పై అధికారి సంతకం చేయించి ఫారంతో జతచేయాలి. తప్పుడు ధ్రువీకరణ, సమాచారంతో దరఖాస్తు చేస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950, సెక్షన్ 31 ప్రకారం శిక్షార్హులు. 2024 నవంబర్ 1 నాటికి ముందున్న ఆరేళ్లలో (01 నవంబర్ 2018 నుంచి 31 అక్టోబర్ 2024 వరకు) మూడేళ్లకు తగ్గకుండా ఉన్నత పాఠశాల.. ఆ పైస్థాయి విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు/అధ్యాపకులుగా పనిచేసి ఉండాలి. (మూడేళ్లపాటు క్రమం తప్పకుండా ఉండనక్కర్లేదు) ఉపాధ్యాయుడు రెగ్యులర్/అడ్‌హక్‌గా నియమించబడి(ఫుల్‌టైం ఉపాధ్యాయునిగా)ఉండాలి. పార్ట్‌టైం టీచర్లు ఓటర్లుగా అర్హులు కారు. ఆసక్తిగవారు ఎఎఎ.ఎవశీ వశ్రీఖఅస్త్రుఖు.అఅఎ.అఅ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేయాలి. ఫొటో, సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. వెరిఫికేషన్ అధికారి వస్తే సర్వీసు సర్టిఫికెట్ ఒరిజినల్ అందజేయాలి. ఓటరుగా నమోదు చేసుకునే వారు 2024 నవంబర్ 1 నాటికి మూడేళ్ల డిగ్రీ లేదా ఇందుకు సమానమైన పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. ఫారం నంబర్ 18 పూర్తిచేసి పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో తహసీల్దార్ కార్యాలయం/ రెవెన్యూ డివిజన్ అధికారి(ఆర్డీవో) కార్యాలయంలో అందజేయాలి. ఒరిజినల్ డిగ్రీ సర్టిఫికెట్ లేదా జిరాక్స్‌పై అభ్యర్థి సంతకంతోపాటు గెజిటెడ్ అధికారి సంతకం చేసి జతపరచాలి. చిరునామా కోసం ఆధార్ లేదా డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు ఐడీ జిరాక్స్ చేయాలి. ప్రభుత్వ ఉద్యోగులు/ఉపాధ్యాయులు కార్యాలయాధిపతితో డిగ్రీ ధ్రువీకరిస్తే సరిపోతుంది. అభ్యర్థులు ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఒకే కుటుంబానికి చెందిన వారి దరఖాస్తులను ఒకరే అధికారులకు అప్పగించవచ్చు. ఇతరులు ఏక మొత్తంలో దరఖాస్తులు తీసుకొస్తే స్వీకరించరు అని అధికారులు తెలిపారు.

> **పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుకు నిబంధనలివే..**
> - భారతీయ పౌరుడై ఉండాలి
> - నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలి
> - 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

# ఆమనగల్లులో అభివృద్ధి శూన్యం




**విశ్వంభర, ఆమనగల్లు:** అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా తయారైంది ఆమనగల్లు మండల పరిస్థితి. గత ప్రభుత్వం కంటే ముందు ఎమ్మెల్యే ఒకరై ప్రభుత్వం వేరొకటై ఉండడంతో అభివృద్ధి పనులు అసలే జరగలేదు. ఆ తర్వాత గత ప్రభుత్వంలో జూనియర్ కళాశాల, ఇంటిగ్రేటెడ్ మార్కెట్, సురసముద్ర ట్యాంక్ బండ్, ప్రభుత్వ వైద్యశాల, డిగ్రీ కళాశాల వంటి పనులకు నిధులు మంజూరైన ఏ పనులు కూడా సక్రమంగా నడవడం లేదు, నిర్లక్ష్యం ఎక్కడ ఉంది, ఎవరు పనులను కొనసాగించడం లేదు, ప్రభుత్వం ఏమి చేస్తుంది ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ప్రభుత్వం మారిన ఇప్పటికీ అలాగే ఉంది, తప్పు ఎవరిది ప్రభుత్వాన్ని మార్చిన ప్రజలదా! పనులు కొనసాగించని ప్రభుత్వాన్నిదా! అని ఆమనగల్లు మండల ప్రజలు సందిగ్ధంలో పడ్డారు. మండల ప్రజలు ఒకరికి ఓటేస్తే నియోజకవర్గ ప్రజలు మరోలా తీర్పు ఇచ్చారు. మరి మండల పరిస్థితి ఎవరు పట్టించుకోవాలి ఎవరు చేసిన పాపం! ఒక దిక్కు ఎంపీ వర్గం, మరో దిక్కు వంశీ వర్గం, మరో దిక్కు ఎమ్మెల్యే వర్గం, మరి ఆమనగల్లు మండలానికి దిక్కెవరు? గత ప్రభుత్వంలో ఎన్నో కొన్ని పనులు కొనసాగిన మండలానికి కావాల్సిన నిధులను ఎవరుఅడగాలి! ఎవరు పట్టించుకోవాలి! మండల పరంగా కేవలం 5 ఎంపీటీసీ సీట్లు ఉన్నాయని ఎందరికి తెలుసు ప్రతి మండలంలో 10 నుంచి 15 ఎంపీటీసీలు ఉండగా ఆమనగల్లు మండలాన్ని విడదీసి 5 ఎంపీటీసీలతో ఒక్క జడ్పీటీసీ తో కొనసాగిస్తున్నారు. మండలంలో, గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది, మునిసిపాలిటీలో ప్రభుత్వం వేరేగా ఉంది. మరి అభివృద్ధి జాడలు ఎక్కడ? అభివృద్ధి చేసేవారు కనపడక మండల ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వచ్చి కర్తాల్, వెల్దండ, కల్వకుర్తిలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. మండలంలో ఏ కార్యక్రమం ప్రారంభించలేదు. ఎక్కడ ఉందీ లోపం, ఆమనగల్లు కాంగ్రెస్ నాయకులు ఎక్కడ ఉన్నారు. నాయకత్వ లోపం స్పష్టంగా కనబడుతుంది. ఆమనగల్ కు కావలసిన నాయకులు ఎవరు జూనియర్ కాలేజీ, ప్రారంభిందేప్పుడు దాదాపు 10 ఎకరాల దాకా ఉన్న భూమిని, గతంలో అన్యక్రాంతమైన భూమిని ఎవరు రక్షిస్తారు. నేను చేస్తే నీకు పేరు, నువ్వు చేస్తే నాకు పేరు రాదు. ఏంటి ఈ రాజకీయాలు అని ప్రశ్నిస్తున్న ప్రజలు ఏది ఏమైనా ప్రభుత్వం మనది, అభివృద్ధి మనది, మండలం మనది అనుకుని పనులు చేస్తేనే మీకు మున్సిపాలిటీ ఎన్నికలలో మళ్లీ ఛాన్స్ ఉంటుందని పేద ప్రజలను మండలాన్ని, ప్రజలను పట్టించుకోని నాయకులను మేము కూడా పట్టించుకోమని ఆమనగల్లు మున్సిపాలిటీ ప్రజలు గంటా పదంగా తెలియజేస్తున్నారు. నాయకులు పట్టించుకుని ఆమనగల్లు మండలాన్ని, మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తేనే మిమ్మల్ని ఆశీర్వదిస్తామని ప్రజలు ముక్తకంఠంగా తెలియజేస్తున్నారు.

## అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపనకు నేను వ్యతిరేకం

**ఎమ్మెల్యే వేముల వీరేశం**



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం ఇంద్ర పాలనగరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూస బాలకిషన్ 50వ జన్మదిన కార్యక్రమానికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. రామన్నపేట పట్టణంలోని మల్లిఖార్జున్ పంక్షన్ హాలులో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. వేముల వీరేశం ప్రసంగిస్తూ రామన్నపేట పట్టణంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాప నకు తాను పూర్తి వ్యతిరేకం అని తెలిపారు. ప్రజలకు హాని కలిగించే విషయంలో అస్సలు సహించేది లేదన్నారు. రామన్నపేట అఖిలపక్షానికి తన యొక్క పూర్తి మద్దతు ఉంటుందని చెప్పారు. అంబుజా కంపెనీ పెట్టకుండా ఉమ్మడి జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి, పారిశ్రామిక మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి వరకు తీసుకవెళ్తానని తెలిపారు.

## అంగరంగ వైభవంగా దుర్గామాత నిమజ్జనం

**శోభయాత్రలో అలరించిన కళాకారుల నృత్య విన్యాసాలు**



**విశ్వంభర, పటాన్ చేరు:** సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు నియోజక వర్గం జిన్నారంలో అంగరంగ వైభవంగా దుర్గామాత నిమజ్జన శోభాయాత్ర కొనసాగింది. శోభయాత్రలో వివిధ వేషధారణలో కళాకారులు చేసిన నృత్య విన్యాసాలు గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. జిన్నారం మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యువజన సంఘం ఆధ్వర్యంలో శరన్నవరాత్రులు 19 సంవత్సరాల నుంచి నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు దుర్గ శరన్నవరాత్రులు భక్తి శ్రద్ధలతో నిర్వహించి ఆదివారం సాయంత్రం విద్యుత్ దీపాలా వెలుగుల్లో డప్పు చప్పులు, పోతరాజుల విన్యాసల మధ్య శోభయాత్ర కొనసాగింది. గ్రామ ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. భక్తి శ్రద్ధలతో నిమజ్జనం ఊరేగింపులో గ్రామస్తులు, మహిళలు భాగస్వాములయ్యారు. వివిధ దేవీ రూపాల్లో విజయవాడ కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్నయి. అనంతరం తొమ్మిది రోజులపాటు అమ్మవారికి అలంకరించిన చీరలను వేలంపాట నిర్వహించారు. భక్తులు ఆసక్తిగా వేలంపాటలో పాల్గొని అమ్మవారి చీరలను సొంతం చేసుకున్నారు. అనంతరం ఫ్రెండ్స్ యువజన సంఘం సభ్యులు మాట్లాడుతూ 19 సంవత్సరాలుగా దుర్గా శరన్నవరాత్రులు ఉత్సవాలకు సహకరిస్తున్న దాతలకు గ్రామ ప్రజలకు అమ్మవారి కృప కటాక్షాలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి, గోపగౌని శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, బ్రహ్మేందర్, నవీన్ రెడ్డి, శ్రీనివాస్, శివ రెడ్డి, సాయి గౌడ్, టిల్లు, మణి, సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం ఆధ్వర్యంలో శత ఘటాభిషేకం



**విశ్వంభర, సంస్థాన్ నారాయణపురం:** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలోని శ్రీ అన్నపూర్ణేశ్వరి ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రతిష్టించి దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకులు శ్రీ శంకరనంద స్వామి ఆధ్వర్యంలో సోమవారం శతగటభిషేకాన్ని ప్రాచీన శివాలయం నుండి స్థానిక చౌరస్తా రామాలయం వరకు గ్రామ మహిళలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజా వాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**



**విశ్వంభర, మహబూబాబాద్:** సోమవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు, రెవెన్యూ, లెనిన్ వత్సల్ టోప్పో, డేవిడ్ లతో కలిసి కలెక్టర్ ప్రజా వాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ఏదైనా శాఖ పరమైన సమస్యలు ఉంటే వారికి కావలసిన సమాచారం గైడ్ చేయాలని సూచించారు. సోమవారం రెవెన్యూ శాఖకు సంబంధించి 22, పంచాయతీరాజ్ 3, ఎస్టీ వెల్ఫేర్ 3, మున్సిపల్2, సివిల్ సప్లై 2, వైద్య ఆరోగ్యశాఖ 2, బ్యాంకింగ్ 2, ఇలా తదితర విభాగాలకు చెందిన మొత్తం 46 దరఖాస్తులు వచ్చాయని, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి సుబ్బారావు, డీసీఓ వెంకటేశ్వర్లు, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ నరేష్, డీఆర్డీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన్ రాజు, జడ్పీసీఈవో నర్మద, బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహస్వామి, ఏడీ ల్యాండ్ సర్వే నరసింహమూర్తి, డీహెచ్ఓ మరియన్న,డీఏఓ విజయ నిర్మల, ఎల్డీఎం ఎస్ మూర్తి, వెల్ఫేర్ అధికారిని వరలక్ష్మి, డీఎంసీఎస్ క్రిష్ణవేణి, డీఎస్ఓ ప్రేమ్ కుమార్, అన్ని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంబధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానందకు సన్మానం



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కేపీ. వివేకానందను మర్యాద పూర్వకంగా కలిసి దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జగజ్జనని అయిన అమ్మవారి కటాక్షాలు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద సంపూర్ణంగా ఉండాలని కోరుకుంటూ వేద పండితులు అమ్మవారి ఆశీర్వాదం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ. వివేకానంద మాట్లాడుతూ దసరా పండుగను పురస్కరించుకొని చెడుపై మంచిని సాధించిన అమ్మవారి దయ, కృపాకటాక్షాలతో ప్రజలంతా అష్టైశ్వర్యాలు, సుఖ సంతోషాలతో జీవించాలన్నారు.

## పోలీస్ ఉన్నతాధికారులు వేధించడం సరైనది కాదు

**ఆత్మహత్యకు పాల్పడ్డ కానిస్టేబుల్ కుటుంబానికి న్యాయం చేయాలి**

**ఆధార్ పార్టీ జిల్లా ఛైర్మన్ కేశవ గౌడ్**



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** పోలీస్ శాఖలో కానిస్టేబుల్ పై ఉన్నతాధికారుల పెత్తనం సరైనది కాదని, ఇటువంటి విధానాలను మానుకోవాలని ఆదార్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చైర్మన్ కంటే కేశవ గౌడ్ అన్నారు. జిల్లాలోని బూర్గంపాడు కానిస్టేబుల్ ఆత్మహత్యపై ఆయన స్పందించారు. ఈ సందర్భంగా కంటే కేశవ్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ కానిస్టేబుల్ చేయని తప్పుకు అతనిపై నిందలు వేసి బలవన్మరణానికి పాల్పడటానికి ప్రేరేపించిన వారిపై తక్షణమే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెల్ఫీ వీడియోలో తన ఆవేదనను వివరిస్తూ కానిస్టేబుల్ పడ్డ బాధలను చెప్పుకుంటూ ఆత్మహత్యకు పాల్పడటం చూస్తుంటే అతనను ఏ విధంగా ఇబ్బందులు పెట్టారో అర్థం అవుతుందన్నారు. బంగారు భవిష్యత్తు ఉన్న కానిస్టేబుల్ జీవితం అర్ధాంతరంగా ముగిసిందని, తక్షణమే ఆ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం, కోటి రూపాయలు ఎక్స్ గ్రేషియా ప్రకటించాలన్నారు. ఇటువంటి ఘటనలు అనేకం జరుగుతున్నప్పటికీ ఉన్నత శాఖ అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. గతంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వరావుపేట ఎస్సై, ప్రస్తుతం బూర్గంపాడు కానిస్టేబుల్ పైఅధికారుల ఒత్తిడిలకు తట్టుకోలేక మృతి చెందటం బాధాకరమన్నారు. ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకొని అండగా ఉండాలని, లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పూకే ముత్తయ్య, దొర, పూనెం నరేష్, ఈడ, నాగ వెంకట పుల్లారావు, తల్లాడ వెంకటేశ్వరరావు, కుక్కల నాగేశ్వరరావు గౌడ్, పలువురు ఆదార్ పార్టీ నాయకులు ఉన్నారు.

## టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీనం

**ఈ నెల 20న విలీన సభను జయప్రదం చేయాలి**




**విశ్వంభర, మహబూబ్ నగర్:** అక్టోంబర్ 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే టీ.యూ.సీ.ఐలో ఐ.ఎఫ్.టీ.యూ విలీన సభను జయప్రదం చేయాలనీ సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో టీ.ఎన్.జీ.ఓ స్ భవన్లో భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ.ఎఫ్.టీ.యూ) మహబూబ్ నగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలీన సభ పోస్టర్ విడుదల చేశారు. ఐ.ఎఫ్.టీ.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి. వెంకటేష్ మాట్లాడుతూ 1978 లో తెలంగాణ రాష్టంలో ఐ.ఎఫ్.టీ.యూ ఏర్పడిందన్నారు. నాటి నుండి నేటి వరకు ఐ.ఎఫ్.టీ.యూ అనుబంధంగా ఉన్న వివిధ కార్మిక సంఘాలను నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. 26 రంగాల కార్మికుల చట్టబద్ధ యూనియనన్లు అనుబంధం చేశామని. లక్ష మంది కార్మికులకు సభ్యత్వని ఇచ్చామని. మన రాష్టంలో బలమైన కార్మిక ఉద్యమాని బీడీ, భవన, ఆటో అండ్ మోటార్, కేజీబీవీ, హమాలీ, మిల్ గోదాం వర్కర్స్, జీపీ తదితర రంగాలలో నిర్మించే కృషి సాగుతున్న నేపథ్యంలో ఐ.ఎఫ్.టీ.యూ ఏర్పాటు నాటి దేశ, వ్యవస్థ స్వభావం, రాజకియ దృక్పధంపై అంతర్గతంగా చర్చ సాగుతున్నదని తెలిపారు. మారుతున్న కాలమాన పరిస్థితులను అన్వయించుకోవడం ద్వారా పెట్టుబాడీదారి వర్గాల దోపిడీపై పోరాటాలు చేయవాల్సి ఉన్నదన్నారు. శాస్త్రీయమైన రాజకీయ లక్షలను ఏర్పర్చుకోవాల్సియున్నదని. దేశ వ్యాపిత కార్మిక సంఘ నిర్మాణానికి ఐ.ఎఫ్.టీ.యూ పరితపించిందని. నిర్దేశించుకున్నా లక్ష్యలతో దేశ వ్యాపిత కార్మిక సంఘం కోసం అన్వేశించిందన్నారు. తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, బెంగాల్, బీహార్, ఢిల్లీ, పంజాబ్, తదితర 14 రాష్ట్రలలో సంఘటిత, అసంఘటీత రంగాలలో పని చేస్తున్న టీ.యూ.సీ.ఐ నాయకత్వంతో గత సంవత్సర కాలంగా అనేక దాపాలుగా చర్చించి ఉమ్మడి ప్రణాళికను అమోదించిందన్నారు. దేశ వ్యాపిత నిర్మానాంకై ఐ.ఎఫ్.టీ.యూ ను టీ.యూ.సీ.ఐ లో విలీనం కావడం కోసం పునుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.ఎఫ్.టీ.యూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, జిల్లా, వెంకట్రాములు, నర్సింహా, దాసు, ఐ.ఎఫ్.టీ.యూ జిల్లా నాయకులు బాలు, గణేష్, ఆర్ఆర్. మన్యం తోపాటు వివిధ రంగాలలో పని చేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ లక్ష్యాలను నూరు శాతం సాధించాలి



**విశ్వంభర, భూపాలపల్లి:** సి.ఎం.ఆర్ లక్ష్యాలను నూరు శాతం సాధించాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో సి.ఎం.ఆర్, ఖరీఫ్ దాన్యం కేటాయింపు, మిల్లులు ట్యాగింగ్, మార్కెట్ కమిటీ లైసెన్సులు తదితర అంశాలపై పౌర సరఫరాలు, మార్కెటింగ్, సహకార శాఖ, రైస్ మిల్లర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు సి.ఎం.ఆర్ లక్ష్యం 77.46 శాతం పూర్తి చేశామని, మిగిలిన లక్ష్యాన్ని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఖరీఫ్ సీజన్ కు సంబంధించి సి.ఎం.ఆర్ ప్రక్రియపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు మిల్లర్లు మార్కెట్ కమిటి లైసెన్స్ పొందాలని అన్నారు. మిల్లర్లు కేటాయించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయడం ద్వారా ధాన్యం సేకరణ, బియ్యం సరఫరా సక్రమంగా జరుగుతుందని ఆయన అన్నారు. సి.ఎం.ఆర్ లక్ష్యాలను సాధించడం చాలా ముఖ్యమని, ప్రభుత్వానికి సహకరించడం ద్వారా రైతుల ప్రయోజనాలను కాపాడగలరని కలెక్టర్ తెలిపారు. సి.ఎం.ఆర్ లో పాల్గొనే ప్రతి రైస్ మిల్లర్ తప్పనిసరిగా రెండు వేర్వేరు రిజిస్టర్లను నిర్వహించాలని అన్నారు. ఏ సమయంలోనైనా పరిశీలనకు అందించాలని పేర్కొన్నారు. దాన్యం కోనుగోలు గురించి మాట్లాడుతూ ట్యాగ్ చేయని కొనుగోలు కేంద్రాల నుండి దాన్యం స్వీకరించొద్దని, కేటాయించిన మేరకు మాత్రమే దాన్యం స్వీకరించాలని తెలిపారు. సన్న రకం, దొడ్డు రకంలో జాగ్రత్తలు పాటించాలని, టోకెన్ కేటాయించాలని తెలిపారు. ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయడానికి తగినంత స్థలంతో పాటు దిగుమతి చేసేందుకు హమాలీలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనాథ్, డీఎం రాములు, మార్కెటింగ్ డీఎం కనక శేఖర్, సహకార అధికారి వాలియా నాయక్, రైస్ మిల్లర్లు సంగం అధ్యక్షులు తిరుపతి, రైస్ మిల్లు యజమానులు పాల్గొన్నారు.

# ఆకస్మికంగా పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ పోలీస్ స్టేషన్ ను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆకస్మికగా తనిఖీ చేశారు. ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కేసులు నమోదు చేసి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలని ఎస్పీ పోలీస్ అధికారులకు ఆదేశించారు. సోమవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్ పనితీరును పరిశీలించేందుకు ఆకస్మికంగా సందర్శించారు. మొదట పోలీస్ సిబ్బంది యొక్క గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలు, పలు కేసులలో సీజ్ చేయబడిన వాహనాలు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది యూనిఫామ్, నీట్ టర్న్ అవుట్, కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు. పోలీస్ రిసెప్షన్ సెంటర్ లోని మహిళా కానిస్టేబుల్ (రిసెప్షనిస్ట్)రికార్డులు తనిఖీ చేశారు. మహిళా సహాయక కేంద్రం రికార్డ్స్ పరిశీలించారు. సీసీ కెమెరాలు పని తీరు అడిగి తెలుసుకున్నారు, ఈ-కాప్స్ రైటర్ రూమ్ లో విధులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో రోల్ క్లారిటీ వుండాలని, పోలీస్ స్టేషన్లకు వచ్చే అర్జీల విచారణ కోసం అప్పగించే భాధ్యతలను పోలీస్ అధికారులకు సీరియస్ గా తీసుకొని విచారణ చేపట్టాలని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదులపై తక్షణమే స్పందించి న్యాయం జరిగేలా కృషి చేయాలని అన్నారు. కేసుల నమోదు విషయంలో తత్సారం చేయవద్దన్నారు. ప్రతి కేసులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, తద్వారా బాధితులకు సరియైన న్యాయం జరుగుతుందని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, సరిహద్దు రాష్ట్రాల నుండి అక్రమ రవాణా నియంత్రించేందుకు రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కు ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై చేపట్టిన విచారణ నివేదికలను, రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బీట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని



ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24ఇ7 గస్తీ నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. చివరిగా ఎస్పీ చేతులమీదుగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.ఎస్పీ వెంట డీఎస్పీ తిరుపతి రావు, డి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డోర్నకల్ సీఐ రాజేష్, ఎస్.ఐ వంశీదర్, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం



**విశ్వంభర, భూపాలపల్లి:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే)ను పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో గల ఔత్సహిక ఫోటోగ్రఫీ మరియు షార్ట్ ఫిల్మ్ లకు సంబంధించి తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే పోలీస్ అమరవీరుల ప్రాణత్యాగాలను స్మరిస్తూ ఈనెల 21న వారోత్సవాలు నిర్వహించబడుతాయని ఈ పోటీలకు విద్యార్థులతో పాటు, యువత ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లు, షార్ట్ ఫిల్మ్ మేకర్స్ ఉత్సహంగా పాల్గొనాలని అన్నారు. ఇందులో భాగంగా పోలీసుల త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపే విధంగా ఉండే ఇటీవల కాలంలో తీసిన (3) ఫోటోలు, తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈనెల 20 లోపు జిల్లా పోలీస్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్ చేసిన పెన్ డ్రైవ్ ద్వారా, 10ఇ8 సైజ్ ఫోటోలను పోలీస్ పీఆర్ఓకు అందజేయాలన్నారు. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సహికులు మూడనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసులు స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలను, సైబర్ నేరాలు ఈవ్టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం వాటి అనర్దాలు లాంటి అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2023 అక్టోబర్ నుండి ప్రస్తుత సంవత్సరం అక్టోబర్ నెల (ఇప్పటి వరకు) తీసిన మూడు ఫోటోలు, షార్ట్ ఫిల్మ్ మాత్రమే పంపించాల్సి వుంటుంది. ఈ నెల 20 వ తారీఖు లోపు జిల్లా పోలీసు కార్యాలయంలోని పీఆర్ఓ ఆఫీసు నందు ఇవ్వాల్సి వుంటుందని, జిల్లా స్థాయిలో మొదటి, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచిన, ఫోటోలను, షార్ట్ ఫిల్మ్ లను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందని, మరిన్ని వివరాల కోసం 87126 58164 నెంబర్ ద్వారా పీఆర్ఓ ను సంప్రదించాలన్నారు. సమాజంలో శాంతి భద్రత పరిరక్షణ కోసం శ్రమించి తమ అసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ, నిర్వహిస్తున్న పోటీలకు విధ్యార్థులతో పాటు, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాల్సిందిగా ఎస్పీ కిరణ్ ఖరే కోరారు.

## పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడి



**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండల పరిధిలోని విజయపురి కాలనీలో పక్క సమాచారంతో పేకాట స్థావరాలపై ములకలపల్లి పోలీసులు మెరుపు దాడి చేశారు. ఎస్.ఐ కిన్నెర రాజశేఖర్ సిబ్బంది తిరుపతి, ప్రసాద్ తో కలిసి దాడి చేయగా కొయ్యల వీరయ్య, కన్నెబోయిన శివ, బెబినేని మునిరాజు, కొయ్యల చిన్నయ్య, యలమంద, కోట నల్లి, ఈశ్వరయ్య, కన్నె ప్రభాకర్‌లు పట్టుబడ్డారు. రూ. 1900లు నగదు, 52 పేక ముక్కలు పోలీసులు స్వాదీనం చేసుకొని ఏడుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పర్వతారోహకులని అభినందించిన కలెక్టర్




**విశ్వంభర, భూపాలపల్లి:** పర్వతారోహకులను భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అభినందించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని సమావేశం మందిరంలో హిమాచల్ ప్రదేశ్ మనాలి లోని 14,600 ఫీట్స్ (4250 మీటర్స్) ఎత్తు కలిగిన 'మౌంట్ పథల్స్' పర్వతాలను అధిరోహించిన జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ విద్యార్థులను అభినందించారు. జిల్లాకి చెందిన కే. విశాల్, ఎం లక్కీ, పి.సీతారాం చారి ముగ్గురు విద్యార్థులు 'ఎస్ ఫర్ లైఫ్ సే నో టు డ్రగ్స్' అనే థీమ్‌తో పర్వతాన్ని అధిరోహించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులు, యువత ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమములో జిల్లా యువజన, క్రీడల అధికారి జైపాల్ నాయక్, ఖేలో ఇండియా సెంటర్ కోచ్ శ్రీనివాస్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది శివసాగర్ పాల్గొన్నారు.

## హత్య కేసును ఛేదించిన జగద్గిరిగుట్ట పోలీసులు



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధి దీనబంధు కాలనీలో ఆదివారం ఉదయం జరిగిన నదీమ్ (24) హత్య కేసును పోలీసులు ఛేదించారు. మీడియా సమావేశం నిర్వహించిన ఏసీపీ హనుమంతరావు వివరాలు వెల్లడించారు. మద్యం మత్తులో గొడవ పడుతూ తోటి స్నేహితులే నదీమ్ తలపై ఇనుప రాడ్లతో కొట్టి హతమార్చారని తెలిపారు. దీనబంధు కాలనిలో నివాసముండే నదీమ్‌కు మహ్మద్ ఖలీల్, కట్ట ప్రసాద్ ఇద్దరు చిన్నప్పటి స్నేహితులు. శనివారం రాత్రి మద్యం మత్తులో ముగ్గురు మధ్యలో గొడవ జరగగా ఖలీల్, ప్రసాద్‌లను చంపేస్తానని నదీమ్ బెదిరించడంతో ఎలాగైనా నదీమ్‌ను హతమార్చాలని ఆదివారం ఉదయం 3గంటల ప్రాంతంలో నడుచుకుంటూ వెళ్తున్న నదీమ్ తలపై, మొఖం పై ఇనుప రాడ్‌లతో తీవ్రంగా గాయ పరిచారు తోటి స్నేహితులైన ఖలీల్, ప్రసాద్.తీవ్ర గాయాలపాలైన నదీమ్ అక్కడిక్కడే మృతి చెందగా, స్థానికుల సాయంతో సమాచారం అందుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి, వారు హత్యకు ఉపయోగించిన ఇనుప రాడ్లను స్వాదీనం చేసుకున్నారు. నిందితులైన మహ్మద్ ఖలీల్(21), కట్ట ప్రసాద్(26)లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు.

## అబ్దుల్ కలాం జ్ఞాన వేదిక గ్రంథాలయం ప్రారంభం



**విశ్వంభర, మేడిపెల్లి:** మేడిపెల్లి మండలం వల్లంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన అబ్దుల్ కలాం జ్ఞాన వేదిక (గ్రంథాలయం) ఈ గ్రామం నుండి ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికైన సంపతి రాజ్ కుమార్, గౌరీ అనుప్రియ, దొడ్డి రవీనా, సందెల గణేష్ చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. దాతల సహకారంతో మన ఊరు వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఈ లైబ్రరీ అన్ని రకాల పుస్తకాలతో అందుబాటులోకి రావడంతో రాబోయే రోజులలో మరింత మంది ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి తోడ్పడుతుందని గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా గ్రామం నుండి వివిధ రంగాలలో ఉద్యోగాలు చేస్తున్న వారిని సత్కరించడం జరిగింది. అలాగే నిర్మాణానికి సహకరించిన దాతలను సత్కరించడం జరిగింది. ప్రత్యేక అధికారి ఆనంద్, మన ఊరు ఫౌండేషన్ వ్యవస్థాపకులు వెల్మ నవీన్ రెడ్డి, మాజీ సర్పంచ్ వెల్మ సమత, మాజీ ఎంపీటీసీ నాయిని మమత రవి, కార్యదర్శి ప్రవీణ్, గ్రామంలోని అన్ని యూత్‌ల సభ్యులు, గ్రామ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొ న్నారు. దాతలు అందరికి గ్రంథాలయ నిర్మాణానికి సహకరించిన, ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపిన సమతా నవీన్ రెడ్డి మన ఊరు వేల్ఫెట్ అసోసియేషన్ వల్లంపల్లి సభ్యులు.

## ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో దేవి నవరాత్రుల ముగింపు వేడుకలు



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లి గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ 19వ దుర్గామాత ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నవరాత్రులు మరియు దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గాదేవి నవరాత్రులు అట్టహాసంగా ఉత్సాహంగా నిర్వహించారు. దుర్గాదేవి అలంకరణల వేలం పాట గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. అమ్మవారి ముక్కుపుడక 1,31,000 రూపాయలకు బత్తుల ఆంజనేయులు గౌడ్, 19 కిలోల లడ్డు పాలకుర్ల యాదయ్య గౌడ్ 85,000 రూపాయలు, లక్ష్మీ దండ 50, 000 రూపాయలు పుట్టి మల్లేష్ గౌడ్, పెద్దచీర 31,000 రూపాయలు ఈర్లపల్లి లక్ష్మణ్ , చిన్న చీర వడాల బాలరాజు గౌడ్ 24000 రూపాయలు, అదేవిధంగా లక్కీ డ్రా లో లడ్డు విజేత ఏనుకంటి సుంకయ్య గెలుపొందారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామంలో వర్షాలు కురవాలని, పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాలకుర్ల రవికాంత్ గౌడ్, అమంగల్లు మాజీ వైస్ ఎంపీపీ జోగు వీరయ్య, మాజీ ఎంపీటీసీ ఉమావతిబుగ్గయ్య, మాజీ సర్పంచ్ నర్సింహ, మాజీ ఉపసర్పంచ్ శంకరయ్య, నాయకులు పుట్టి యాదయ్య, కరుణాకర్, సుమన్, అజీజ్, వెంకటయ్య, చోటే, చంద్రయ్య, జంగయ్య, శంకర్, నరేష్, పంపుల మల్లేష్, రాజు, నిర్వాహకులు మధు, మహేష్, చందు, శివ, యుగేందుర్ పాల్గొన్నారు.


## నేడు మంత్రులతో ముఖాముఖి..

### పాల్గొననున్న మంత్రి సీతక్క



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజా పాలనలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి మంత్రులతో ముఖాముఖి కార్యక్రమంలో గాంధీభవన్‌లో మంగళవారంపంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క పాల్గొంటారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తారు.

## జంగయ్య కుటుంబానికి నాయకుల అండ



**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లీ మండలం లింగారావుపల్లి గ్రామంలో బోచుపల్లి తిక్క జంగయ్య శుక్రవారం రాత్రి అనారోగ్య సమస్యలతో మరణించారు. ఈ వార్త తెలుసుకున్న పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ కాసు శ్రీనివాస్ రెడ్డి, దగ్గుల బాల్రెడ్డి, పోతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, పరదేపురం యాదయ్య, సురేందర్ రెడ్డి తాజా మాజీ సర్పంచ్ తిరుపతయ్య, అంజి రెడ్డి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ తమ వంతు సహాయంగా శతాబ్ది టౌన్షిప్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కాసు శ్రీనివాస్ రెడ్డి రూ. 5,000లు, పీఏసీఎస్ చైర్మన్ గడ్ల కేశవరెడ్డి రూ. 2,000లు, పోతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి రూ. 2000లు, పరదేపురం యాదయ్య రూ. 1000లు, మాజీ సర్పంచ్ ఎల్లమ్మ తిరుపతయ్య రూ. 1000లు, చింతలపల్లి సురేందర్ రెడ్డి రూ. 1000లు, మొత్తంగా12 వేల రూ. వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.

## వెండి పతకం సాధించిన అంబోజు అనిల్ కుమార్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** మలేషియా కౌలానాపూర్ ఏం ఎస్ ఎన్ స్టేడియంలో జరిగే 36వ మలేషియా మాస్టర్ ఛాంపియన్షిప్ అథ్లెటిక్స్-2024 పోటీలలో ఇండియా టీం తరపున యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలం మోరిపిరాల గ్రామానికి చెందిన హెడ్ కానిస్టేబుల్ అంబోజు అనిల్ కుమార్ టీమిండియా తరపున మాస్టర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ పోటీలో4,400 మీటర్ల రిలే పరుగు పందెంలో టీమిండియాకు వెండి పతకం సాధించి పెట్టాడు. అంబోజు అనిల్ కుమార్‌కి సహచర మిత్రులు మరియు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గాంధీభవన్‌లో మూడు రోజులపాటు కాంగ్రెస్ పార్టీ సమావేశాలు

**విశ్వంభర, హైదరాబాద్:** గాంధీభవన్‌లో టీపీసీసీ మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశాలు జరగనున్నాయి. ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శులు, విష్ణునాథ్, విశ్వనాథం హాజరుకానున్నారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెదక్ జిల్లా కాంగ్రెస్ మీటింగ్ జరగనుంది. బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించనున్నారు టీపీసీసీ చీఫ్. ఆ తర్వాతి రోజైన 16వ తేదీ మధ్యాహ్నం 3 గంటల నుంచి కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఛైర్మన్‌ల సమావేశం జరగనుంది. ఈ మీటింగ్‌కు డీసీసీ అధ్యక్షులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఆఫీస్ బేరర్లు, కార్పొరేషన్ ఛైర్మన్లు, సీనియర్ నాయకులు పాల్గొంటారు.

## ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేవారు ఎవరైనా సహించేది లేదు: చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** లాటరీలో మద్యం షాపులు దక్కించుకున్న వారిని పలు చోట్ల వాటాల కోసం బెదిరించారనే వార్తలను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఏ ఏ ప్రాంతాల్లో ఎవరు ఈ తరహా బెదిరింపులకు పాల్పడ్డారనే విషయంలో సీఎం చంద్రబాబు సమాచారం తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది. పార్టీ యంత్రాంగం, ఇంటెలిజెన్స్, ఆబ్కారీ శాఖ ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు తెప్పించుకుంటున్నారు. మద్యం షాపుల్లో వాటాల కోసం షాపులు పొందిన వారికి ఇబ్బందులు సృష్టిస్తే సహించేది లేదని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇప్పటికే పలువురు నేతలకు పార్టీ అధిష్ఠానం హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది. మద్యం, ఇసుక విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ప్రతీ ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చే వారు ఎవరైనా సరే అంగీకరించేది లేదన్నారు. షాపులు పొందిన వాళ్లు స్వేచ్ఛగా, నిబంధనల ప్రకారం వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను సీఎం ఆదేశించారు.

## కళాశాలల బంద్‌తో పేద విద్యార్థుల చదువులకు నష్టం




**విశ్వంభర, భూపాలపల్లి :** రాష్ట్రంలో గత ఆరేండ్ల నుండి 8 వేల కోట్ల పైగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) భూపాలపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఫీజులను విడుదల చేయకపోవడం వల్ల ఇప్పటికే చాలా రకాల ప్రవేశ పరీక్షలు పూర్తి అయ్యి ఉన్నత చదువులకు వెళ్ళేవారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పేద విద్యార్థులు తాము అప్పులు చేసి మరి సర్టిఫికేట్స్ తీసుకుంటున్నారు అని ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ అన్నారు. ఒక్క ప్రక్కన విద్యార్థులు ఇబ్బందులు, మరోవైపు యాజమాన్యాలు అప్పులు తెచ్చి నడిపిస్తున్నామని, జీతాలు చెల్లించలేమని వాళ్ళు కళాశాలల బంద్‌కు పిలుపునిచ్చారని అన్నారు. దీనిని ప్రభుత్వం యాజమాన్యాలతో చర్చించి పేద విద్యార్థులు నష్టం లేకుండా నిధులు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ తరపున ఆయన డిమాండ్ చేసారు. రాష్ట్రంలో ప్రభుత్వ రంగంలో డిగ్రీ అండ్ పి.జి. కళాశాలలు కంటే ప్రైవేట్ రంగంలో ఎక్కువ ఉన్నాయని వాటిలో ఎక్కువ మంది పేద విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటీ విద్యార్థులే నష్టపోతారని, ఒక్క ప్రక్కన విద్యలో విప్లవాత్మక మార్పులంటూ ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభం చేస్తూనే విద్యార్థుల ఫీజులను గత ప్రభుత్వం వలె విద్యారంగానికి ప్రాధాన్యత తగ్గించి విద్యను ప్రైవేట్ రంగంలో మార్చే ప్రయత్నం చేస్తోందని అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఫీజులను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని అన్నారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

## దిగ్విజయంగా బీజేపీ సభ్యత్వ నమోదు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు దుర్గయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బీజేపీ రాష్ట్ర నాయకులు, నల్లగొండ జిల్లా సభ్యత్వ ప్రముఖులు తుళ్ళ వీరేందర్ గౌడ్, నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను గడపగడపకు తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని, నరేంద్ర మోడీ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మండలంలోని కార్యకర్తలు అందరూ కష్టపడి పని చేయాలని, రాబోయే స్థానిక సంస్థ ఎన్నికలలో అందరూ పోటీ చేసి మెజార్టీ స్థానాలు గెల వాలని సూచించారు. ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగు లయ్య, నకిరేకల్ అసెంబ్లీ కో-కన్వీనర్ మదూరి ప్రభాకర్ రావు, మండల సభ్యత్వ ప్రముఖులు, జిల్లా కార్యదర్శి తాటి పాముల శివకృష్ణ, మండల సభ్యత్వ ప్రముఖులు రూపాని లింగస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు వనం అంజయ్య, బండ మధుకర్ రెడ్డి, సీనియర్ నాయకులు జిల్లా లక్ష్మీనారాయణ, రాపోలు స్వామి, రాపోలు విశ్వనాథం, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు రాపోలు రమేష్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు రాపోల్ నరేష్, పొట్టబత్తుల వెంకటేశం, మూడుదుడ్ల రమేష్, మేడిగ సంతోష్, నాగేంద్ర చారి పాల్గొన్నారు.

## అఖిలపక్ష సదస్సుకు తరలిరండి..

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్‌కు అనుకొని ఆదాని ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని అడ్డుకోవడం కోసం ఈనెల 15న ఉదయం 10 గంటలకు రామన్నపేట మండల కేంద్రంలోని రహదారి బంగ్లా వద్ద నిర్వహించే అఖిలపక్ష సదస్సును జయప్రదం చేయడానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలని రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సిరిగిరెడ్డి మల్లా రెడ్డి పిలుపునిచ్చారు. కాలుష్యం వెదజల్లే ఈ పరిశ్రమ వల్ల పర్యావరణంతో పాటు ప్రాణి కోటికి ప్రమాదం పొంచి ఉందని, ఆరంభంలోనే అడ్డుకుంటే పరిశ్రమ ఏర్పాటు నిలిచిపోతుందని, లేని పక్షంలో ఒక్కసారి పరిశ్రమ ఏర్పాటు అయితే దానిని ఏమి చేయలేమని, ప్రజలందరూ గ్రహించాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్, ఎన్.ఎస్.యు.ఐ, మహిళా కాంగ్రెస్, ఎస్సీ సెల్, మైనార్టీ సెల్, ఎస్టీ సెల్, కిసాన్ సెల్ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## గ్రీవెన్స్‌డేలో సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా వినతిపత్రం



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ నందు జరిగిన గ్రీవెన్స్ డేలో రామన్నపేట మండలంలో అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపనకు వ్యతిరేకంగా పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రామన్నపేటకు చెందిన 11వ, 10వ వార్డు యువకులు, విద్యావంతులు, మేధావులు, కలెక్టర్ ను కలిసి ఫ్యాక్టరీ అనుమతులను నిలిపివేయాలని, కలెక్టర్ కు వినతి పత్రం సమర్పించారు. అంబుజా సిమెంట్ వద్దు, పర్యావరణ ముద్దు అని నినాదాలు చేశారు. పార్టీలకతీతంగా యువకులు పాల్గొన్నారు. వనం చంద్రశేఖర్, మొహమ్మద్ యాసీన్, ఆమీర్, పెద్దబోయిన మణి, మినుముల సందీప్, కందుల శివప్రసాద్, నంగునూరు క్రాంతి, కరీముద్దీన్, శ్యామల సత్తయ్య, ఒంటెద్దు రమేష్, సెల్వన్, వడ్లకొండ సాయి ధీరజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# లారెన్స్ బిష్ణోయ్ ఎవరు..?

## బాబా సిద్ధిఖీ హత్యతో మారుమోగిన పేరు

## గ్యాంగ్‌స్టర్‌గా మారిన జాతీయస్థాయి అథ్లెట్

## లా చదివిన విద్యార్థి సంఘం నేత



**ముంబయి:** మహారాష్ట్ర మాజీ మంత్రి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పేరు దేశవ్యాప్తంగా మార్మోగుతోంది. ఈ 31 ఏళ్ల పంజాబీ గ్యాంగ్ స్టర్ జైల్లో ఉన్నా.. అతడి సోదరుడు, అనుచరుడు కెనడా నుంచి గ్యాంగ్‌ను నడిపించడం ఆందోళనకరంగా మారింది.

### కాలేజీలోనే నేరాలకు నాంది..

లారెన్స్‌ది పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లా ధత్తరన్‌వాలీ గ్రామంలోని సంపన్న కుటుంబం. బిష్ణోయ్ వర్గానికి చెందిన వ్యక్తి. వీరు రాజస్థాన్, హర్యానా, పంజాబ్‌లో ఎక్కువగా ఉంటారు. లారెన్స్ 12వరకు చదివాడు. ఆ తర్వాత పంజాబ్ విశ్వవిద్యాలయ పరిధిలోని డీఏవీ కాలేజీలో చేరాడు. లారెన్స్ బిష్ణోయ్ జాతీయ స్థాయి అథ్లెట్, పంజాబ్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడిగా చేశాడు. న్యాయవిద్యను పూర్తి చేశాడు. ఆ తర్వాత విద్యార్థి రాజకీయాల్లో గోల్డీ బ్రార్‌తో పరిచయం ఏర్పడింది. కొన్నాళ్లకు మెల్లగా అసాంఘిక కార్యకలాపాలు మొదలుపెట్టాడు. విద్యార్థి రాజకీయాలు దీనికి ముసుగుగా మారాయి. డీఏవీ కాలేజీ గ్యాంగ్‌వార్‌లో అతడి ప్రియురాలిని ప్రత్యర్థి వర్గం సజీవ దహనం చేసింది. దీంతో అతడు పూర్తిగా నేరాల వైపు మళ్లినట్లు చెబుతుంటారు. 2018లో తన అనుచరుడు సంపత్ నెహ్రాతో కలిసి సినీ స్టార్ సల్మాన్‌ఖాన్ హత్యకు కుట్రపన్నడంతో జాతీయ స్థాయి వార్తలకెక్కాడు. ప్రస్తుతం బిష్ణోయ్ గ్యాంగ్‌లో పలువురు ప్రొఫెషనల్ షూటర్లు ఉన్నారు. వీరి నెట్‌వర్క్ పంజాబ్, హర్యానా, రాజస్థాన్, దిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌ల్లో విస్తరించింది. లారెన్స్‌ను చంపేందుకు ఇప్పటికీ దిల్లీలోని గ్యాంగ్‌స్టర్లు కాచుకు కూర్చోవడంతో.. అతడిని వివిధ కేసుల్లో న్యాయస్థానాలకు తరలించడం పోలీసులకు కత్తిమీద సాముగా మారింది. అతడు సబర్మతి జైల్లో ఉన్నా తన గ్యాంగ్‌ను మాత్రం నిరాటంకంగా నిర్వహిస్తున్నాడు. అతడి సోదరుడు అన్మోల్, మిత్రుడు గోల్డీ బ్రార్‌లు ఈ వ్యవహారాలు చూసుకొంటున్నారు.

### గ్యాంగ్‌వార్‌లు.. స్మగ్లింగ్..!

గ్యాంగ్‌ల మధ్య ఆధిపత్యపోరులో పలువురు ప్రాణాలు కోల్పోయారు. లారెన్స్ సన్నిహితుడు జస్విందర్‌ను గ్యాంగ్‌స్టర్ జైపాల్ భుల్లర్ హత్య చేశాడు. వాస్తవానికి బిష్ణోయ్ గ్యాంగ్ భరత్‌పుర్‌లో విస్తరించడానికి జస్విందర్ పనిచేశాడు. సిద్ధూ మూసేవాలా హత్యకు కూడా ఈ గ్యాంగ్ యుద్ధాలే కారణం. విక్కీ మిదుఖేడా మరణానికి ప్రతీకారంగా ఈ పంజాబీ గాయకుడిని లారెన్స్ అనుచరులు కాల్చిచంపారు. బిష్ణోయ్ గ్యాంగ్ సీమాంతర ఆయుధ స్మగ్లింగ్, మాదక ద్రవ్యాల రవాణాకు కూడా పాల్పడుతోందని గుజరాత్ ఏటీఎస్ ఆరోపించింది.

### సల్మాన్‌కు బెదిరింపులు..

బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ 1998లో కృష్ణ జింకలను వేటాడారు. దానికి సంబంధించి ఆయనపై కేసు నడుస్తోంది. కృష్ణ జింకలను బిష్ణోయ్ వర్గం వారు పవిత్రంగా పరిగణిస్తారు. వీటిని వేటాడటం అదే వర్గానికి చెందిన లారెన్స్‌కు ఎంతమాత్రం నచ్చలేదు. 2018 నుంచి సల్మాన్ ఖాన్‌ను లక్ష్యంగా చేసుకొని ఈ గ్యాంగ్ పనిచేస్తోంది. 2024 ఏప్రిల్‌లో బాలీవుడ్ స్టార్ ఇంటిపై కాల్పులు జరిపింది. అంతకు మందు అతడి ఫామ్ హౌస్ వద్ద రెక్కీలు నిర్వహించింది. దాదాపు పాతిక మందిని సల్మాన్‌పై దాడికి సిద్ధం చేసినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి.

### జైల్లో నుంచే గ్యాంగ్ ఎలా నడుపుతున్నాడు..?

లారెన్స్ బిష్ణోయ్ కొన్నేళ్లుగా జైల్లోనే ఉంటున్నాడు. కానీ, బ్యారక్‌ల్లో అక్రమంగా వచ్చే సెల్‌ఫోన్ల ద్వారా అనుచరులతో నిరంతరం టచ్‌లో ఉంటాడని పేరుంది. సమాజంలో పెద్ద పేరు గలిగిన వారిని లక్ష్యంగా చేసుకొని హత్యలు చేయడంతో తమ గ్యాంగ్ పేరు బాగా ప్రచారమవుతుందని లారెన్స్ యోచన. దీంతో పాటు ప్రత్యర్థి గ్యాంగ్‌లకు కచ్చితమైన మెసేజ్‌లు పంపడానికి హత్యలకు పాల్పడుతుంటుంది. సిద్ధూ మూసేవాలా, బాబా సిద్ధిఖీపై దాడులు ఈ కోవలోకే వస్తాయి. దీంతో ఉత్తర భారత దేశంలోనే అత్యంత భయానక గ్యాంగ్‌గా పేరు తెచ్చుకొంది. దీంతోపాటు సంపన్న వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేస్తాడని పేరుంది. దిల్లీలోని అఫ్గాన్ జాతీయుడు నాదిర్ షా నుంచి భారీగా డబ్బులు డిమాండ్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. తాజాగా ముంబయిలో ఖాళీగా ఉన్న మాఫియా రాజ్యాన్ని ఆక్రమించడానికి ఇతడు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

# హిట్ లిస్ట్‌లో సిద్ధిఖీ కుమారుడు..!

## సిద్ధఖీ హత్య కేసు విచారిస్తున్న పోలీసులకు సమాచారం

## తండ్రీ కొడుకులను చంపేందుకు షూటర్లకు కాంట్రాక్టు



**ముంబయి:** ఎన్సీపీ కీలక నేత, బాలీవుడ్ మిత్రుడు, మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్యతో ముంబయి నగరం ఉలిక్కిపడింది. ఆ కేసును విచారిస్తోన్న పోలీసులకు మరో కీలక విషయం తెలిసినట్లు సమాచారం. ఆయన కుమారుడు, ఎమ్మెల్యే జీషన్ సిద్ధిఖీ కూడా బిష్ణోయ్ గ్యాంగ్ హిట్‌లిస్ట్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. తండ్రీ కుమారులను చంపేందుకు కాంట్రాక్టు ఇచ్చినట్లు షూటర్లు విచారణలో పేర్కొన్నట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. హత్య జరిగిన ప్రాంతంలోనే సిద్ధిఖీ, ఆయన కుమారుడు ఉంటారని తమకు ఆదేశాలు ఇచ్చిన వ్యక్తులు చెప్పారని షూటర్స్ వెల్లడించారు. ఇద్దరిపైనా దాడి చేసే వీలులేకపోతే.. ఎవరు దొరికితే వారిని హత్య చేయాలని చెప్పినట్లు దర్యాప్తులో వెల్లడించారు. జీషన్ సిద్ధిఖీ కాంగ్రెస్ టికెట్‌పై వంద్రే ఈస్ట్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. లెజిస్లేటివ్ కౌన్సిల్ ఎన్నికలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డాడన్న ఆరోపణలతో పార్టీ ఆయన్ను బహిష్కరించింది. ముగ్గురు దుండగులు ఆరు రౌండ్లు కాల్పులు జరపడంతో బాబా సిద్ధిఖీ ప్రాణాలు కోల్పోయారు. దుండగులు ఆయనపై కాల్పులు జరుపుతున్న సమయంలో నవరాత్రి ఊరేగింపులో బాణసంచా కాలుస్తుండటంతో కాల్పుల శబ్దం బయటకు వినిపించలేదు. ఇది ఒక కిరాయి హత్యని, వ్యాపార లావాదేవీల్లోగానీ, మురికివాడ అభివృద్ధి ప్రాజెక్టులో విభేదాలవల్లగానీ జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. సిద్ధిఖీని తామే చంపామని లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ప్రకటించింది. వచ్చే నెలలో ఎన్నికలు జరిగే అవకాశమున్న మహారాష్ట్రలో జరిగిన ఈ హత్య కలకలం రేపుతోంది.

### ఎయిరిండియా విమానం

# అత్యవసరంగా దారి మళ్లింపు

## దిల్లీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్

## ప్రయాణికులు, సిబ్బంది సురక్షితం

## విమానానికి అందిన భద్రతాపరమైన హెచ్చరిక



**ముంబయి:** ఎయిరిండియా విమానం గాల్లో ఉండగా అత్యవసర పరిస్థితి తలెత్తింది. ముంబయి నుంచి న్యూయార్క్ బయల్దేరిన విమానానికి బాంబు బెదిరింపు రావడంతో అత్యవసరంగా దారి మళ్లించి, దిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. ఈ సమయంలో అందులో 239 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే ప్రస్తుతం సిబ్బంది, ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. "ముంబయి నుంచి బయల్దేరిన ఎయిరిండియా విమానానికి భద్రతాపరమైన హెచ్చరిక వచ్చింది. దాంతో వెంటనే దిల్లీకి దారి మళ్లించాం. ప్రయాణికులందరినీ దింపేశాం. వారంతా సురక్షితంగా ఉన్నారు. అలాగే ఆ విమానాన్ని నిర్మానుష్యంగా ఉండే రన్‌వేపైకి తరలించాం. భద్రతాపరమైన తనిఖీలు చేశాం" అని ఎయిరిండియా ప్రతినిధి తెలిపారు. ఇదిలాఉంటే.. ముంబయి నుంచి జెడ్డా, ముంబయి నుంచి మస్కట్‌ల మధ్య నడుస్తోన్న రెండు ఇండిగో విమానాలకు కూడా ఇలాంటి బెదిరింపులు వచ్చాయి. మూడు రోజుల క్రితం కూడా ఎయిరిండియా విమానానికి ఈతరహాలో ఎమర్జెన్సీ పరిస్థితి ఎదురైంది. హైడ్రాలిక్ వ్యవస్థ పనిచేయడం లేదని గుర్తించిన పైలట్లు.. తిరుచ్చి విమానాశ్రయాన్ని అప్రమత్తం చేశారు. తమిళనాడులోని తిరుచ్చి నుంచి బయల్దేరిన కొద్దిసేపటికే ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో తిరుచ్చి ఎయిర్‌పోర్టులో ఉత్కంఠ పరిస్థితుల మధ్య సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులంతా సేఫ్‌గా ఉండటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో విమానం సురక్షిత ల్యాండింగ్ కావాలంటే అందులో ఉన్న ఇంధనం నిర్దేశిత స్థాయి వరకు తగ్గాల్సి ఉంటుంది. అప్పుడే విమానం ల్యాండింగ్ చేసే వీలుంటుంది. సురక్షిత ల్యాండింగ్ కోసం ప్రయత్నించిన పైలట్లు.. దాదాపు రెండు గంటల పాటు విమానాన్ని గాల్లోనే చక్కర్లు కొట్టించారు.

# కయ్యానికి కాలుదువ్విన కిమ్

## ఉత్తర కొరియా వైపు రోడ్లు ధ్వంసం

## రవాణా మార్గాలను ధ్వంసం చేస్తామని గతంలోనే హెచ్చరిక

## పొరుగుదేశం డ్రోన్లు పంపుతోందని ఆగ్రహం



**ప్యాంగ్‌యాంగ్:** దక్షిణ కొరియాతో కయ్యానికి కాలుదువ్వేందుకు ఉత్తర కొరియా సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా దక్షిణ కొరియాతో అనుసంధానించే రోడ్లు, రైల్వే మార్గాలను ధ్వంసం చేసే అవకాశం ఉందని దక్షిణ కొరియా సైన్యం వెల్లడించింది. తాము రవాణా మార్గాలను నాశనం చేస్తామని ఇప్పటికే ఉత్తర కొరియా హెచ్చరించింది. యుద్ధం వేళ సియోల్ దళాలు తమ దేశంలోకి చొచ్చుకురాకుండా ఈ చర్యలు చేపట్టినట్లు అనుమానిస్తున్నారు. పొరుగు దేశం తమపైకి డ్రోన్లు పంపిస్తోందనే ఆగ్రహంతో కిమ్ సర్కారు ఈ చర్యలు చేపడుతోంది. ఇప్పటికే భారీగా కేమోఫ్లాజ్‌లు ఏర్పాటుచేసుకొని ఆ దేశ దళాలు రోడ్ల ధ్వంసానికి ఏర్పాట్లుచేస్తున్నాయని కొరియాసైన్యం వెల్లడించింది.

### దాడికి మా దళాలు సిద్ధం..

సియోల్‌కు చెందిన డ్రోన్లు తమ గగనతలంలోకి చొరబడినా.. కరపత్రాలు జారవిడిచినా.. ఆ దేశంపై దాడి చేస్తామని ఉత్తర కొరియా హెచ్చరించింది. ఈమేరకు ఆ దేశ రక్షణశాఖ ఓ ప్రకటన చేసింది. శతఘ్ని దళం సహా ఇతర కీలక యూనిట్లను ఇప్పటికే సరిహద్దుల్లోకి పంపినట్లు పేర్కొంది. కిమ్ సోదరి కూడా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు దక్షిణ కొరియా మాత్రం డ్రోన్లు పంపడంపై నోరు మెదిపేందుకు నిరాకరించింది.

### చెత్త బెలూన్లకు జీపీఎస్..!

ఉత్తర కొరియా తరచూ పంపించే చెత్త బెలూన్ల వెనక పెద్ద ప్లానే ఉంది. ఈ విషయాన్ని ఆలస్యంగా దక్షిణ కొరియా దళాలు గుర్తించాయి. ఈ బుడగలకు జీపీఎస్ పరికరాలను అమర్చి పంపిస్తున్నట్లు గుర్తించారు. తాము అనుకున్న ప్రదేశంలోనే చెత్తను పారేయడానికి వీలుగా వీటిని అమర్చినట్లు భావిస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు 6,000 బెలూన్లను దక్షిణ కొరియాపైకి వదిలింది. వీటిల్లో కొన్నింటి శకలాలను ద.కొరియా సైన్యం సేకరించి విశ్లేషించగా అందులో జీపీఎస్ పరికరాలున్నట్లు గుర్తించింది. ఇప్పటివరకు కిమ్ సర్కారు వీటిపై 4,44,148 డాలర్లు వెచ్చించినట్లు భావిస్తున్నారు. వాస్తవానికి ఇవి దక్షిణ కొరియా వైమానిక రంగానికి సంకటంగా మారాయి. ఆ బెలూన్ల కారణంగా జూన్ నుంచి తమ రాజధాని సియోల్‌కు చెందిన రెండు విమానాశ్రయాల్లోని రన్‌వేలను పలుమార్లు మూసేయాల్సి వచ్చిందని ఆ దేశ చట్టసభ సభ్యులు ఇటీవల ఆందోళన వ్యక్తంచేశారు. మరోవైపు దక్షిణ కొరియా కూడా డ్రోన్లలో కరపత్రాలు ఉంచి ఉ.కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌లో వెదజల్లిస్తోంది. కానీ, ఈ విషయాన్ని అధికారికంగా ధ్రువీకరించడం లేదు.

## ఆసుపత్రిలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం



**ముంబయి:** శివసేన(యూబీటీ) చీఫ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే అస్వస్థతకు గురయ్యారు. దాంతో ఆయన్ను ముంబయిలోని రిలయన్స్ ఆసుపత్రిలో చేర్పించారు. ఆయనకు గుండె సంబంధిత సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. దాంతో ఆయనకు యాంజియోప్లాస్టీ నిర్వహించే అవకాశాలున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

### అనారోగ్యంతో ఉంటే బెయిల్ ఇవ్వొచ్చు

**న్యూఢిల్లీ,** మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనలు ఎంత కఠినంగా ఉన్నప్పటికీ అనారోగ్యంతో ఉన్న వారికి బెయిల్ మంజూరు చేయాల్సిన అవసరం ఉం టుందని సుప్రీంకోర్టు పేర్కొన్నది. మనీలాం డరింగ్ కేసులో ఈడీ అరెస్టు చేసిన సేవా వికాస్ కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ అమర్ సాధురామ్ ముల్చందని బెయిల్ పిటిషన్‌ను సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ జేబీ పార్దివాలా ధర్మాసనం విచారించింది. 'పీఎంఎల్ఏ ఎంత కఠినమైనప్పటికీ మేం చట్టానికి లోబడి నడుచుకోవాలి. ఎవరైనా అనారోగ్యంతో ఉంటే వారికి బెయిల్ ఇవ్వొచ్చు.' అని కోర్టు పేర్కొన్నది. ముల్చందనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

# ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నం

## రెండు గన్‌లతో తిరుగుతున్న వ్యక్తి

## అదుపులోకి తీసుకున్న పోలీసులు

## తాను ట్రంప్‌నకు మద్దతుదారుడినన్న నిందితుడు



**న్యూయార్క్:** అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై మరోసారి హత్యాయత్నానికి ప్రయత్నించడం తీవ్ర కలకలం రేపింది. ఇటీవల కాలిఫోర్నియాలోని కోచెల్లాలో ట్రంప్ ర్యాలీ నిర్వహిస్తున్న సమయంలో ఓ వ్యక్తి రెండు గన్‌లతో సంచరిస్తున్నట్లుగా తమకు సమాచారం అందిందని సీక్రెట్ సర్వీసెస్ పేర్కొన్నాయి. నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, అతడిని లాస్‌వెగాస్‌కు చెందిన వేం మిల్లర్(49)గా గుర్తించామని పోలీసులు పోలీసులు పేర్కొన్నారు. అయితే ట్రంప్‌నకు, ర్యాలీకి హాజరైన వారికి గానీ ఎలాంటి ముప్పు వాటిల్లలేదని వెల్లడించారు. నిందితుడు నకిలీ ప్రెస్‌కార్డు, ఎంట్రీ పాస్‌తో ర్యాలీ వేదికకు సమీపంలో లోడ్ చేసిన షాట్‌గన్, హ్యాండ్‌గన్, హై కెపాసిటీ గల మ్యాగజైన్‌తో తిరుగుతుండగా, అతడిని అదుపులోకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు. అంతేకాకుండా నిందితుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పనిచేసే మితవాద సంస్థలో సభ్యుడిగా ఉన్నట్లు గుర్తించామన్నారు. సీక్రెట్ సర్వీసెస్ సహాయంతో ట్రంప్‌పై జరగబోయే మరో హత్యాయత్నాన్ని ఆపగలిగామని అన్నారు. రివర్‌సైడ్ కౌంటీ షెరీఫ్ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం నిందితుడు శనివారమే జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడని, అతడి వాహనానికి కూడా రిజిస్ట్రేషన్ లేదని పేర్కొన్నారు. కారులో మందుగుండు సామగ్రి, తుపాకులు లభించాయన్నారు. నకిలీ పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్ సైతం ఉండటంతో హత్య అనంతరం విదేశాలకు పారిపోవడానికి ఏర్పాట్లు చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే విచారణలో భాగంగా నిందితుడు మాట్లాడుతూ.. తనపై వస్తున్న ఆరోపణలను కొట్టిపడేశాడు. తాను ట్రంప్‌నకు మద్దతుదారుడినని పేర్కొన్నాడు. తన వద్ద ఉన్న ఆయుధాలను 2022లో వ్యక్తిగత రక్షణ కోసం కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. వాటిని తీసుకొని బట్లర్ ప్రాంతం మీదుగా వెళ్తున్న సమయంలో పోలీసులు దాడి చేసి, బలవంతంగా తన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారని నిందితుడు ఆరోపించాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్న అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై దుండగులు పలుమార్లు హత్యాయత్నానికి పాల్పడ్డారు. గత జులైలో అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెన్సిల్వేనియాలోని బట్లర్‌లో ప్రచార సభ నిర్వహించారు. ఆ సమయంలో థామస్ మాథ్యూ క్రూక్స్ అనే యువకుడు ట్రంప్‌పై కాల్పులు జరిపాడు. ఆ కాల్పుల్లో ట్రంప్ కుడి చెవి పైభాగం నుంచి తూటా దూసుకెళ్లింది. వేగంగా స్పందించిన అమెరికా సీక్రెట్ సర్వీస్ సిబ్బంది ఆయన్ను కాపాడారు. మరోసారి ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్‌లో ట్రంప్ గోల్ఫ్ ఆడుతుండగా ట్రంప్‌పై హత్యాయత్నం చోటు చేసుకుంది. ఫెన్సింగ్ నుంచి నిందితుడు తుపాకీతో రావడాన్ని గమనించి భద్రతా బలగాలు కాల్పులు జరిపారు. ఆ వెంటనే నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపిన చేవెళ్ల యువ నాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి, మాణిక్య రెడ్డి మాజీ సర్పంచ్, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్, రామకృష్ణ, తదితరులు. విశ్వంభర, చేవెళ్ళ

# ఆంధ్రప్రదేశ్‌కు వర్ష సూచన..

**కీలక నిర్ణయాలు ప్రకటించిన తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు**

**అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి**

**డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలి**

**టీటీడీ ఈవో శ్యామలరావు**



**విశ్వంభర, తిరుమల:** బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. విపత్తు నిర్వహణ ప్రణాళికపై టీటీడీ అడిషనల్ ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి ఈవో శ్యామలరావు వర్చువల్ విధానంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. రాగల 36 గంటల్లో భారీ వర్ష సూచనపై సమావేశంలో చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో టీటీడీ జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, సీఈ సత్యనారాయణ, ఇతర విభాగాధిపతులు, జిల్లా పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా శ్రీవారి ఆలయంలో 16న వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. 15న సిఫార్సు లేఖలు అనుమతించకూడదని, అలాగే భక్తుల భద్రత దృష్ట్యా బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. అధికారులందరూ విపత్తును ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలని ఈవో సూచించారు. 2021లో భారీ కొండ చరియలు విరిగి పడిన ఘటనతో టీటీడీ 700 పేజీల విపత్తు నిర్వహణ ప్రణాళిక రూపొందించిందన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఈ ప్రణాళిక మరింత మెరుగు పరచాల్సిన అవసరం ఉందని అధికారులకు చెప్పారు. ఈవో స్థాయిలో విపత్తుల నివారణ ఎగ్జిక్యూటివ్ కమిటీ, అడిషనల్ ఈవో ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణ సమన్వయ కమిటీ ఉందన్నారు. అగ్నిమాపక శాఖ, ఆరోగ్య శాఖ, విజిలెన్స్ విభా గం, ఇతర కీలకమైన శాఖల విభాగాధిపతులు తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. "ఘాట్ రోడ్లపై ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్తలు తీసుకో వాలి. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి. విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు నడపడానికి ముందస్తు జాగ్రత్తగా తగినంత డీజిల్ అందుబాటులో ఉంచుకోవాలి. ఐటీ విభాగం వారు భక్తులకు వసతి, దర్శనం, ప్రసాదాల తయారీ కార్యాకలా పాలకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలి. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనే చర్యల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ అంబులెన్సులను అందుబాటులో పెట్టుకుని అప్ర మత్తంగా ఉండాలి. ఇంజనీరింగ్ విభాగం వారు డ్యామ్ గేట్లను పర్యవేక్షించాలి. ట్రాఫిక్ పోలీసులు ఇంజనీరింగ్ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలి. ఏదైనా విపత్కర పరిస్థితి ఎదురైతే వేగంగా స్పందించేందుకు అగ్ని మాపక సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలి. ప్రజా సంబంధాల విభాగం వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసు కుంటూ ఎస్వీబీసీ, మీడియా, టీటీడీ సోషల్ మీడి యా ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ భక్తులను అప్రమత్తం చేయాలి" అని అధికారులను ఈవో ఆదేశించారు.

## ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల మరమ్మతులు



**విశ్వంభర,అమరావతి:** ఆకస్మికంగా వచ్చే వరదల కారణంగా రైల్వే లైన్‌లు, సమీపంలోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని.. వాగులు, చెరువులపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్ష సూచన నేపథ్యంలో నీటిపారుదల శాఖపై మంత్రి రామానాయుడితో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుంగభద్ర, శ్రీశైలం, సోమశిల తదితర ప్రాజెక్టులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. నెల్లూరు, ప్రకాశం, సత్య సాయి, అనంతపురం, చిత్తూరు సహా వివిధ జిల్లాల్లో వాగులు, కాలువల క్యాచ్‌మెంట్ ఏరియాల్లో వరద నీటిని అంచనా వేసి అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వరద నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్ఠం చేయాలన్నారు. సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. "భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్లను అప్రమత్తం చేశాం. ఇంకా కొన్ని జిల్లాల్లో రిజర్వాయర్లు నింపాల్సి ఉంది. గత ఐదేళ్లలో చాలా ప్రాజెక్టులను సరిగా నిర్వహించలేకపోయారు. కనీసం రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షలు కూడా జగన్ ప్రభుత్వం కేటాయించలేక పోయింది. నవంబర్ నెల నుంచి ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టుల మర మ్మతులు, ఇతర పనులు చేపడతాం. పోలవరం పనులపై వర్క్ క్యాలెం డర్ రూపొందిస్తున్నాం. డయాఫ్రం వాల్ పనులు కూడా నవంబర్ నెల నుంచే ప్రారంభం అవుతాయి. ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలనే ఆలోచనలో ఉన్నాం"మంత్రి స్పష్టం చేశారు. 22

## మాచవరం వద్ద కుంగిపోయిన రైల్వే ట్రాక్..

### రాకపోకలకు అంతరాయం

**విశ్వంభర, పొన్నూరు:** గుంటూరు జిల్లా పొన్నూరు మండల పరిధిలోని మాచవరం వద్ద రైల్వే ట్రాక్ కుంగిపోయింది. ఎడతెరిపి లేకుండా కురుస్తోన్న వర్షాల కారణంగా ట్రాక్ కుంగిపో యింది. దీంతో విజయవాడ-చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిరుపతి-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు సైతం ఇబ్బందులు ఎదురయ్యాయి. స్పందించిన అధికారులు వెంటనే రైలును వెనక్కి మళ్లించి అప్పికట్ల రైల్వే స్టేషన్‌లో నిలిపివేశారు. అప్పికట్ల స్టేషన్ నుంచి మూడో లైన్ ద్వారా వందేభారత్ రైలు సికింద్రాబాద్ బయల్దేరింది. మాచవరం వద్ద కుంగిపోయిన రైల్వే ట్రాక్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టారు. అయితే, జోరుగా వర్షం కురుస్తుండడంతో మరమ్మ తులకు ఆటంకం ఏర్పడుతోంది.

## కడప యోగి వేమన యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాజీనామా



**విశ్వంభర,కడప:** యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాంప్రసాద్ రెడ్డి ఆ పదవి నుంచి వైదొలిగారు. ఆయన రాజీనామా లేఖను ఉపకులపతి కృష్ణారెడ్డి ఆమోదించారు. విశ్వవిద్యాలయం తెలుగు ఆచార్యులుగా ఉన్న రాం ప్రసాద్‌రెడ్డి పది రోజుల క్రితమే రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలు ఉన్న నేపథ్యం లో రిజిస్ట్రార్‌గా కొనసాగడాన్ని విద్యార్థి సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. రాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదు కూడా చేశాయి. ఈ నేపథ్యంలోనే రాంప్రసాద్‌రెడ్డి రాజీనామా చేశారు.

## గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ మంత్రి ఎవరో కూడా తెలీదు..

### పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు




**విశ్వంభర, కంకిపాడు:** పరిపాలనలో చంద్రబాబు తనకు స్ఫూర్తి అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. చంద్రబాబు అనుభవం రాష్ట్రానికి చాలా బలమని కొనియాడారు. నాయకుడి అనుభవం ఉపయోగించుకోకపోతే తప్పుచేసిన వాళ్లమవుతామని అభిప్రాయపడ్డారు. అందుకే కూటమిగా ఏర్పడ్డామని తెలిపారు. కృష్ణా జిల్లా కంకిపాడులో సోమవారం నిర్వహించిన 'పల్లె పండుగ-పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో మాట్లాడుతూ.. దెబ్బలు తట్టుకుని నిలబడ్డామని అందుకే ఇప్పుడు పనులు చేయగలుగుతున్నామని చెప్పారు. గత పాలనతో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎవరో కూడా తెలియదని పవన్ కల్యాణ్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో గ్రామసభలు కూడా పెట్టలేదని.. నిర్ణయాలు ఎలా తీసుకున్నారో తెలియదని అన్నారు. గత పాలనలో డబ్బులు ఎలా ఖర్చయ్యాయో ఎవరికీ తెలియదని విమర్శించారు. అభివృద్ధి జరగలేదు కానీ నిధులు మాయమయ్యాయని ఆరోపించారు. ఆగస్టు 23న రాష్ట్రంలోని 13,326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామని తెలిపారు. గ్రామ సభల్లో తీసుకున్న నిర్ణయాల మేరకు పల్లెల్లో పనులు మొదలుపెట్టామని పేర్కొన్నారు. ప్రతి పనికి డిస్‌ప్లే బోర్డు ఉంటుందని అన్నారు.గ్రామసభల్లో తీసుకున్న నిర్ణయాలు అమలు చేయడం అంత ఈజీ కాదని పవన్ కల్యాణ్ అన్నారు. పారదర్శకతతో తాము పాలిస్తున్నామని తెలిపారు. తాము పారదర్శకంగా ఉన్నా అధికారుల తీరు మారడం లేదని మండిపడ్డారు. మా పేరుతో ఓ అధికారి కాకినాడలో డబ్బులు వసూలు చేశారని తెలిపారు. ఏ అధికారి అయిన తప్పు చేస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తమలాగే అధికారులు కూడా పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఇది లంచాల ప్రభుత్వం కాదు.. మంచి ప్రభుత్వమని స్పష్టం చేశారు.

## గత ప్రభుత్వం గుడిని మింగేస్తే..

### ఈ ప్రభుత్వం లింగాన్ని మింగేస్తుంది: వైఎస్ షర్మిల



**విశ్వంభర, అమరావతి:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ పనుల్లో రాజకీయ జోక్యం వద్దని చెప్పిన చంద్రబాబు.. మద్యం సిండికేట్లను అరికట్టడంలో రాజకీయ చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికక్కడే అధికార పార్టీ నాయ కులు కుమ్మక్కై సిండికేట్లుగా ఏర్పడి మద్యం షాపులను దక్కించుకున్నారని తెలిసిందని తెలిపారు. కూటమి సిండికేట్లకే 3 వేలకు పైగా మెజారిటీ షాపులు దక్కాయంటే మీ పారదర్శకత, నిష్పాక్షికత ఎంత గొప్పగా ఉందో అర్థం అవు తుందని చంద్రబా బును ఉద్దేశించి షర్మిల అన్నారు. మీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల కనుసన్నల్లోనే టెండర్ల ప్రక్రియ సాగిందని అన్నారు. సాధారణ ప్రజలకు షాపులు దక్కకుండా రాష్ట్ర వ్యాప్తంగా బెదిరింపులకు పాల్పడ్డారని.. ప్రాణాలు పోతాయని హెచ్చరికలు చేశారని ఆరోపించారు. కూటమి నేతలకు కాదని పొరపాటున ఎవరికైనా లాటరీ చిక్కితే, లైసెన్స్ ఇస్తారా? లేక 30 శాతం కమీషన్ ఇస్తారా? లేకుంటే చస్తారా? అంటూ బెదిరించారని అన్నారు. మమ్మల్ని కాదని మద్యం ఎలా అమ్ముతారో చూస్తాం అంటూ బహిరం గంగానే సవాళ్లకు పాల్పడ్డారని మండిపడ్డారు. సీఎం గారు! ఏసీ రూముల్లో కూర్చుని హెచ్చరికలు జారీ చేస్తే సరిపోతుందా? చర్యలు ఏవి అని ప్రశ్నినంచారు. గత వైసీపీ "ఓన్లీ క్యాష్" అని గుడిని మింగేస్తే ఇప్పుడు మీరు లింగాన్ని మింగేస్తున్నారని ఏపీ ప్రభు త్వంపై షర్మిల మండిపడ్డారు. ప్రైవేటు పేరుతో తక్కువ ధర అని చెప్పి, మద్యం ఏరులై పారించి, వేల కోట్లు దోపిడీకి కూటమి సర్కార్ తెరలేపిందని ఆరోపించారు. అందుకేనేమో మీ పాపాల చిట్టాలు రేపు బయటపడకుండా ఉండటం కోసం, పాత సర్కారు మద్యం స్కాములోని పాపాలపుట్టలు బద్దలుకాకుండా జాగ్రత్త పడుతున్నారని విమర్శించారు.

## బీసీలకు మంచి చేస్తారా? మోసం చేస్తారా?: పోతిన మహేశ్



**విశ్వంభర, అమరావతిః** బీసీలకు మంచి చేస్తారా? లేదా వారిని మోసం చేస్తారా అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని వైసీపీ నాయకుడు పోతిన మహేశ్ ప్రశ్నించారు. జనాభాలో సగం తెలుగుదేశంతో మనం.. ఇది ఎన్నికలకు ముందు బీసీల ఓట్ల కోసం టీడీపీ చేసిన క్యాంపెయిన్ స్లోగన్ అని గుర్తుచేశారు. దీన్ని ఆధారంగా చేసుకునే బీసీలకు రక్షణ చట్టం అనే హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జనాభాలో సగం బీసీలను మరిచిపోయారా? లేక బీసీలు సగం కన్నా తక్కువైపోయారా అని వ్యంగ్యంగా ప్రశ్నించారు.జనాభాలో సగం అని చెప్పి మీ ప్రభుత్వంలో బీసీలకు ఎన్ని పదవులు ఇచ్చారని పోతిన మహేశ్ ప్రశ్నించారు. టీటీడీలో గతంలో అనుసరించిన సంప్రదాయాన్ని అనుసరించి బీసీలకు టీటీడీ చైర్మన్ పదవి ఇస్తున్నారా? లేదా? అని నిలదీశారు. ఒకప్పుడు మీరు తీసుకొచ్చిన రెండు ఉప ముఖ్యమంత్రి పదవులను ఇప్పుడు ఒక్కటికే ఎందుకు పరిమితం చేశారని అడిగారు. మీ రాజకీయ పొత్తుల కంటే బీసీలు తక్కువైపోయారా అని మండిపడ్డారు. బీసీ సామాజికవర్గం వారు రాజీనామా చేసిన రాజ్యసభ సీట్లను అదే సామాజిక వర్గానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలను నెత్తిన పెట్టుకోవాల్సిన అవసరం లేదని.. కనీసం సమానంగా చూస్తే చాలని అన్నారు.

## వరద సహాయ నిధులు విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం

**విశ్వంభర, అమరావతి:** భారీ వర్షాల దృష్ట్యా ఏపీ ప్రభుత్వం వరద సహాయ నిధులను విడుదల చేసింది. ప్రకాశం, చిత్తూరు, తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య, వైఎస్ఆర్ జిల్లాలకు రూ.కోటి చొప్పున నిధులు విడుదల చేసింది. రిలీఫ్ క్యాంపులు, తాగునీరు, ఆహారం, హెల్త్ క్యాంపులు, శానిటేషన్ కోసం అత్యవసర నిధులను ప్రభుత్వం కేటాచించింది. వరద బాధితుల తరలింపునకు అవసరమైతే ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవాలని అధికారులకు సూచించింది. శాఖల సమన్వయంతో పడిపోయిన చెట్లను తొలగించాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారు.

## అమరావతి డ్రోన్ సదస్సు నిర్వహణకు ప్రభుత్వం ఉత్తర్వులు

**విశ్వంభర, అమరావతి:** అక్టోబరు 22, 23 తేదీల్లో జరగనున్న అమరావతి డ్రోన్ సదస్సు-2024 నిర్వహణకు ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాను ఈ జాతీయ సెమినార్ నిర్వహణ భాగస్వామిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ సదస్సు నిర్వహణకు రూ.5.54 కోట్ల వ్యయం అవుతుందని పేర్కొంది. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో రెండు రోజుల పాటు ఈ జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. వ్యవసాయం, వైద్యారోగ్యం, అర్బన్ ప్లానింగ్, శాంతి భద్రతలు, వస్తు ఉత్పత్తి రంగాల్లో డ్రోన్ల వినియోగంపై ఈ సదస్సు ప్రధానంగా దృష్టి పెట్టనుంది. వాణిజ్య పరంగా డ్రోన్ల వినియోగాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. డ్రోన్ సిటీ ఏర్పాటుకు సంబంధించిన రోడ్ మ్యాప్‌కు ఈ సమ్మిట్‌లో రూపకల్పన చేయనున్నారు.ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు సహా కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుల్నమ్ హాజరుకానున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని డ్రోన్ తయారీ సంస్థలు, డ్రోన్ తయారీ నిపుణులు సమ్మిట్‌లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. సమ్మిట్‌కు వచ్చే వారు 'అమరావతి డ్రోన్ సమ్మిట్' వెబ్‌సైట్‌లో ఈనెల 15 వరకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చు. ఈనెల 22న దేశంలో ఎక్కడా జరగని విధంగా 5 వేల డ్రోన్లతో విజయవాడలో డ్రోన్ షో నిర్వహించనున్నారు. భారీ డ్రోన్ షోను ప్రజలు ఉచితంగా వీక్షించవచ్చు. అత్యాధునిక సేవలందించే డ్రోన్లు తయారు చేసిన వారికి ప్రత్యేక నగదు ప్రోత్సాహకాలు కూడా ఇవ్వనున్నారు.

## వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ బెయిల్ పిటిషన్ కొట్టివేత



**విశ్వంభర, గుంటూరు:** వెలగపూడిలో మహిళ హత్య కేసులో నిందితుడిగా ఉన్న వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు న్యాయస్థానంలో చుక్కెదురైంది. అతడు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను గుంటూరు జిల్లా న్యాయస్థానం కొట్టివేసింది. వైకాపా అధికారంలో ఉండగా చంద్రబాబు ఇంటిపై దాడి, మరియమ్మ అనే మహిళ హత్య కేసులో నందిగం సురేశ్ నిందితుడిగా ఉన్నారు. న్యాయస్థానం రిమాండ్ విధించడంతో గుంటూరు జైలుకు ఆయన్ను తరలించిన విషయం తెలిసిందే.

## పొన్నవోలుకు హైకోర్టులో షాక్..

### భద్రత కోరుతూ వేసిన పిటిషన్ కొట్టివేత




**విశ్వంభర, అమరావతి:** సీనియర్ న్యాయవాది, ఆంధ్రప్రదేశ్ మాజీ అదనపు అడ్వొకేట్ జనరల్ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డికి హైకోర్టులో షాక్ తగిలింది. తనకు భద్రత కల్పించాలని కోరుతూ వేసిన పిటిషన్‌ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. సుదీర్ఘ వాదనల తర్వాత తీర్పును రిజర్వ్ చేసిన న్యాయస్థానం.. తాజాగా తీర్పును వెలువరించింది. సుధాకర్‌రెడ్డికి భద్రత కల్పించాల్సిన అవసరం లేదని అభిప్రాయం వ్యక్తం చేసిన ఉన్నత న్యాయస్థానం.. పిటిషన్‌ను డిస్మిస్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

## మద్యం నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: కొల్లు రవీంద్ర




**విశ్వంభర, అమరావతి:** గత ప్రభుత్వం మద్యం విధానాన్ని భ్రష్టుపట్టించిందని ఏపీ ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. తయారీ నుంచి విక్రయాల వరకు అన్నీ ప్రభుత్వ అధీనంలోనే పెట్టుకున్నారని అన్నారు. సొంత బ్రాండ్లను ప్రమోట్ చేసుకొని దోపిడీ చేశారని దుయ్యబట్టారు. తాజాగా మద్యం విధానాలపై సబ్‌కమిటీ అధ్యయనం చేసి, తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇచ్చేలా విధానం రూపొందించిందని అన్నారు. అన్ని మద్యం బ్రాండ్లను ప్రమోట్ చేసుకోవాలని చెప్పారు."ప్రభుత్వంపై నమ్మకం తోనే మద్యం దుకాణాల కేటాయింపునకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. గుడికి, బడికి 100 మీటర్ల పరిధిలో మద్యం దుకాణాలు ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఆ దుకాణాలను మూసివేయిస్తాం. గత ప్రభుత్వంతో పోలిస్తే పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా తయారైంది. బెల్ట్ షాపులు నిర్వహిస్తే తీవ్ర చర్యలుంటాయి" అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## పైడితల్లికి మొక్కులు చెల్లించిన హోం మంత్రి అనిత



**విశ్వంభర, విజయనగరం:** ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు పైడితల్లి అమ్మవారిని హోం మంత్రి అనిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ఘటాన్ని సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న కంట్రోల్ రూమ్‌ను మంత్రి పరిశీలించారు. సిరిమానోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు. హోం మంత్రి వెంట ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి, తెదేపా జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున తదితరులు ఉన్నారు.



# కీలక ఆటగాళ్లు గాయపడినా టీమ్ఇండియాకి ఇబ్బంది లేదు:

### న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్

**బెంగళూరు :** భారత్‌న్యూజిలాండ్ మధ్య ఈ నెల 16 నుంచి మూడు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. తొలి టెస్టుకు బెంగళూరు ఆతిథ్యమివ్వనుంది. భారత స్టార్ పేసర్ మహ్మద్ షమి గాయం కారణంగా ఈ సిరీస్‌కి దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో న్యూజిలాండ్ కోచ్ గ్యారీ స్టీడ్ మాట్లాడాడు. జట్టులో కీలక ప్లేయర్లు గాయపడినా భారత్‌కు పెద్దగా ఇబ్బంది లేదన్నాడు. 'కీలక ఆటగాళ్లు గాయపడినా టీమ్ఇండియాకు ఇతర జట్ల వలె పెద్దగా ఇబ్బంది ఉండదు. ఒకరు ఆటకి దూరమైనా.. అదే స్థాయిలో రాణించగల ఆటగాళ్లు ఆ జట్టులో ఉన్నారు. ఎన్నో టెస్ట్‌లు ఆడిన అనుభవజ్ఞులు ఉన్నారు. వారితో తలపడటం కష్టమైన విషయం.. కానీ ప్రస్తుతం మా ముందున్న సవాలు భారత్‌పై గెలవడం' అని చెప్పుకొచ్చాడు కివీస్ కోచ్.
మరోవైపు.. భారత పర్యటనలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ టిమ్ సౌథీ స్థానం చర్చనీయాంశంగా ఉంది. దీని గురించి కివీస్ కోచ్ మాట్లాడాడు. 'సౌథీ ప్రదర్శన అత్యుత్తమంగా లేదనే విషయాన్ని అతడు గుర్తించాడు. అలా అని జట్టుకి దూరమవ్వాలనే ఆలోచన అతడికి కచ్చితంగా లేదు. జట్టులో ఆడటానికి చాలా కష్టపడుతున్నాడు. చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాడు. తిరిగి పుంజుకోవడానికి శ్రమిస్తున్నాడు. ఇంతకుముందు అతడు భారత్‌పై మంచి ప్రదర్శనలు ఇచ్చి జట్టుని గెలిపించిన రోజులు కూడా ఉన్నాయి. ప్రతి టెస్ట్ పర్యటనలు ముగిసిన తర్వాత ఎలా ఆడామనే దానిపై సమీక్షలు చేసుకుంటాం. ఈ విషయంలో నేను, సౌథీ మాట్లాడుకున్నాం. జట్టు ప్రయోజనాల కోసం కెప్టెన్సీని వీడాలని అతడు నిర్ణయించుకున్నాడు. నేను అతడికి మద్దతు ఇచ్చా. ఒక సెలక్టర్, కోచ్‌గా జట్టు ఎప్పుడూ అత్యుత్తమంగా ఉండాలనే భావిస్తా' అని గ్యారీ స్టీడ్ పేర్కొన్నాడు.

# టీమ్ మేనేజ్‌మెంట్ టార్గెట్ అతడే

### - పాక్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ



**ఇస్లామాబాద్ :** ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో పేలవ ప్రదర్శన చేసిన పాకిస్థాన్ స్టార్ ఆటగాడు బాబర్ అజామ్‌తో పాటు షహీన్ అఫ్రిది, నసీం షా, సర్ఫరాజ్ అహ్మద్‌లపై వేటు పడిన విషయం తెలిసిందే. ఇంగ్లాండ్‌తో మిగిలిన రెండు టెస్ట్‌ల కోసం పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) ప్రకటించిన జట్టులో వీరికి చోటు దక్కలేదు. దీంతో ఈ నిర్ణయంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఈ నేపథ్యంలో పాకిస్థాన్ మాజీ ఆటగాడు బాసిత్ అలీ మాట్లాడాడు. మేనేజ్‌మెంట్ అసలు టార్గెట్ షహీన్ అఫ్రిది అని ఆరోపించాడు.
'ముల్తాన్ పిచ్ బ్యాటింగ్‌కి అనుకూలంగా ఉండేలా వారికి నచ్చినట్టు ఏర్పాటు చేశారు. బాబర్ ఫామ్‌లో లేడు కాబట్టి అలాంటి పిచ్‌లో కూడా ఔట్ అయ్యాడు.. అది అతడి దురదృష్టం. కానీ ప్రతిసారి మేనేజ్‌మెంట్ టార్గెట్ చేసేది మాత్రం షహీన్ అఫ్రిదినే. అయితే ఈ సందర్భంగా షహీన్‌కి ఒక విషయం చెప్పాలనుకుంటున్నాను. ఎవరు స్నేహితులో, ఎవరు శత్రువులో గుర్తించాలి. నవ్వుతూ మాట్లాడే వాళ్లందరూ మనవాళ్లు అవ్వరు' అంటూ చెప్పుకొచ్చాడు బాసిత్. బాబర్ అజామ్, షాహీన్ అఫ్రిది, నసీం షా.. ఈ ముగ్గురూ జట్టులోనే ఉండాలన్నాడు . 'బాబర్ అజామ్ అభిమానులు ఇప్పుడు ఏం చేస్తారో చూస్తాను. మీరు ఇప్పుడు బయటికి వచ్చి వారికి మద్దతుగా నిలవండి. మేనేజ్‌మెంట్ తప్పు చేసింది.. దాని గురించి ప్రశ్నించండి. దేశవాళీ మ్యాచ్‌లు లేనప్పుడు ఆ ముగ్గురికి విశ్రాంతి ఇవ్వడంలో అర్థం లేదు' అంటూ పిలుపునిచ్చాడు.
మరోవైపు.. జట్టు నుంచి తొలిగించిన తర్వాత షహీన్ అఫ్రిది ఎక్స్ వేదికగా స్పందించాడు. రెండో టెస్ట్ ఆడనున్న పాకిస్థాన్ జట్టుకి శుభాకాంక్షలు తెలిపాడు. 'పాకిస్థాన్ జట్టుకి శుభాకాంక్షలు. మీరు బాగా ఆడాలని ఆకాంక్షిస్తున్నా. ఈ మ్యాచ్ కోసం మేమంతా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాం' అంటూ రాసుకొచ్చాడు. ఇదిలా ఉండగా, పాక్‌ఇంగ్లాండ్ మధ్య రెండో టెస్ట్ మంగళవారం (అక్టోబర్ 15న) ముల్తాన్ వేదికగా జరగనుంది.

# 'ఒక్కరోజే నాలుగొందలు కొడుతాం'..

### ప్రత్యర్థులకు గంభీర్ హెచ్చరిక



**విశ్వంభర, క్రీడావిభాగం :** స్వదేశంలో వరుసగా 18వ టెస్టు సిరీస్ విజయం.. ఆ వెంటనే రికార్డు స్కోర్‌తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్. సొంతగడ్డపై టీమిండియా ఎంత శక్తివంతమైనదో చెప్పడానికి ఈ రెండు ఉదాహరణలు చాలు. బంగ్లాదేశ్‌పై చిరస్మరణీయ టెస్టు విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో ముందున్న భారత జట్టు స్వదేశంలో మరో సిరీస్ ఆడనుంది. బంగ్లాను చావుదెబ్బ కొట్టిన టీమిండియా ఇక న్యూజిలాండ్ తో అమీతుమీ తేల్చుకోనుంది.డబ్ల్యూటీసీలో హ్యాట్రిక్ ఫైనల్‌పై కన్నేసిన రోహిత్ సేన అందుకు కివీస్‌ను వైట్‌వాష్ చేయాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో హెడ్‌కోచ్ గౌతం గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'ఒక్కరోజులోనే 400లు కొట్టగల జట్టుగా ఎదగాలి. అవసరమైతే రెండు రోజులు బ్యాటింగ్ చేసి మరీ మ్యాచ్‌ను డ్రా చేసుకోగలగాలి. టీమిండియాలో ఈ విధమైన అనుకూలత కోసం ఎదురు చూస్తున్నాం. టెస్టు క్రికెట్ అంటే అదే మరి. మా డ్రెస్సింగ్ రూమ్‌లో ఈ రెండూ చేయగల సమర్థులైన బ్యాటర్లు ఉన్నారు.క్కరోజులోనే 400 కొట్టడం అనేది మ్యాచ్ గెలవడం కోసమే. అదీ కాదు పరిస్థితులు తారుమారైతే రెండు రోజులు క్రీజులో ఉండి డ్రా చేసుకోవాలి. సుదీర్ఘ ఫార్మాట్‌లో ఇదే మా రెండో, మూడో ప్రాధాన్య అంశం' అని గంభీర్ మీడియా సమావేశంలో తెలిపాడు. కాన్పూర్ టెస్టులో 'బజ్ బాల్'ను తలదన్నేలా ఆడిన భారత ఆటగాళ్లు.. ఉప్పల్ స్టేడియంలో బంగ్లాదేశ్‌పై బౌండరీలతో విరుచుకుపడ్డారు.

# కోహ్లీ తిరిగి ఫామ్‌లోకి వస్తాడు : కోచ్ గంభీర్



**బెంగళూరు :** బంగ్లాతో టెస్టు సిరీస్ లో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ పెద్దగా రాణించలేదు. అయితే.. న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌లో అతడు తిరిగి పుంజుకుంటాడని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆశాభావం వ్యక్తంచేశాడు.
త్వరలో కివీస్, ఆసీస్‌లతో జరిగే సిరీస్‌ల్లో విరాట్ కోహ్లీ తిరిగి ఫామ్‌లోకి వస్తాడని గంభీర్ పేర్కొన్నాడు. ''కోహ్లీ పట్ల నా ఆలోచనలు ఎంతో స్పష్టంగా ఉన్నాయి. అతడు ప్రపంచస్థాయి క్రికెటర్. సుదీర్ఘకాలం గొప్పగా రాణించిన ఆటగాడు. అరగేంట్రం చేసినప్పుడు ఉన్న పరుగుల దాహం అతడిలో ఇప్పటికీ ఉంది. శ్రీలంకతో మ్యాచ్‌లో అరగేంట్రం చేసినప్పుడు అతడితో కలిసి బ్యాటింగ్ చేయడం నాకు గుర్తుంది. అతడిలో పరుగుల దాహం ఎప్పటికీ ఉంటుంది. వచ్చే సిరీస్‌ల్లో అతడు భారీగా పరుగులు సాధించాలనే ఆకలితో ఉంటాడు'' అని గంభీర్ పేర్కొన్నాడు.
కోహ్లీ ఈ ఏడాదిలో మూడు టెస్టులు ఆడాడు. 50+ స్కోర్లను సాధించలేకపోయాడు. దీంతో అతడి ఫామ్‌పై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అతడికి మద్దతుగా గంభీర్ నిలిచాడు. ఈ నెల 16 నుంచి న్యూజిలాండ్‌తో భారత్ మూడు టెస్టులు ఆడనుంది. తొలి టెస్టు బెంగళూరులో జరగనుంది. ఆ తర్వాత నవంబర్‌లో భారత్‌ఆస్ట్రేలియాల మధ్య బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ ప్రారంభం కానుంది.

# టపాసుల నుంచి బీమా రక్షణ..





### ₹9కే ఫోన్‌పే పాలసీ

**ముంబయి:** దీపావళి సందర్భంగా టపాసులు కాల్చే క్రమంలో గాయపడే వారికి బీమా కల్పించే ఉద్దేశంతో ఫోన్‌పే కొత్త తరహా బీమా పాలసీని తీసుకొచ్చింది. ప్రమాదవశాత్తూ ఎవరైనా బాణసంచా వల్ల గాయపడితే వారికి ఈ బీమా అండగా నిలుస్తుంది. రూ.9 చెల్లించడం ద్వారా రూ.25వేల వరకు కవరేజీ లభిస్తుందని కంపెనీ ఓ ప్రకటనలో తెలిపింది.
అక్టోబర్ 25 నుంచి 10 రోజుల పాటు ఈ బీమా కవరేజీ లభిస్తుందని ఫోన్ పే తెలిపింది. ఫోన్‌పే యూజర్‌తో పాటు భార్య పిల్లలు సహా నలుగురు వ్యక్తుల వరకు సమగ్ర కవరేజీ కూడా తీసుకోవచ్చని పేర్కొంది. అక్టోబర్ 25 తర్వాత కొనుగోలు చేసిన వారికి పాలసీ ఆ రోజు నుంచే కవరేజీ ప్రారంభం అవుతుంది. దీపావళిని దృష్టిలో పెట్టుకుని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీతో కలిసి దీన్ని తీసుకొచ్చినట్లు తెలిపింది. ఫోన్‌పేలోని ఇన్సూరెన్స్ సెక్షన్‌లోకి వెళ్లి 'ఫైర్ క్రాకర్ ఇన్సూరెన్స్' ఎంపిక చేసుకుని వివరాలు ఇచ్చి పాలసీని కొనుగోలు చేయాల్సి ఉంటుంది.

# ముల్తాన్ టెస్టుకు ముగ్గురు స్పిన్నర్లు..

### అంతర్జాతీయ టెస్టుల్లో అరగేట్రం చేయనున్న యువకెరటం క్రమాన్ ఘులామ్..




**ఇస్లామాబాద్ :** సొంతగడ్డపై వరుసగా 14 టెస్టులు ఓడిన పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో చావుదెబ్బ తిన్న పాక్ ముల్తాన్‌లో రెండో టెస్టు కోసం భారీ మార్పులు చేసింది. ఇప్పటికే మాజీ కెప్టెన్ బాబర్ ఆజాం, ప్రధాన పేసర్లు షాహీన్ అఫ్రిది, నసీం షాలను సెలెక్టర్లు పక్కనపెట్టేశారు. సిరీస్ సమం చేయడమే లక్ష్యంగా ముగ్గురు స్పెషలిస్ట్ స్పిన్నర్లను ఎంపిక చేశారు. అంతేకాదు యువకెరటం కమ్రాన్ ఘులామ్‌ను జట్టులోకి తీసుకున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో రాణిస్తున్న కమ్రాన్ ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయంగా టెస్టుల్లో అరంగేట్రం చేయనున్నాడు.తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 47 పరుగుల తేడాతో ఓడిన పాక్.. ముల్తాన్‌లో విజయంపై గురి పెట్టింది. అందుకు తగ్గట్టే ముగ్గురు స్పెషలిస్టు స్పిన్నర్లను తీసుకుంది. నౌమాన్ అలీ, సాజిద్ ఖాన్‌లతో పాటు మణికట్టు మాంత్రికుడు జహిద్ మహమూద్‌లను సెలెక్టర్లు ఎంపిక చేశారు. చూస్తుంటే.. రెండో మ్యాచ్ కోసం పాక్ టర్నింగ్ పిచ్ తయారు చేసినట్టు తెలుస్తోంది.
పాకిస్థాన్ తుది జట్టు : సయూం ఆయూబ్, అబ్దుల్లా షఫీక్, షాన్ మసూద్(కెప్టెన్), కమ్రాన్ ఘులామ్, సాద్ షకీల్, మహ్మద్ రిజ్వాన్(వికెట్ కీపర్), సల్మాన్ అలీ అఘా, అమర్ జమాల్, నౌమాన్ అలీ, సాజిద్ ఖాన్, జహిద్ మహ్మద్.

# కోచ్ లేకున్నా వరల్డ్ రికార్డు..

### చరిత్ర సృష్టించిన కెన్యా అథ్లెట్

**విశ్వంభర (క్రీడా విభాగం) :** మరాథాన్ పరుగు అంటే చాలు ఆఫ్రికా దేశాల అథ్లెట్లదే అగ్రస్థానం. విశ్వ క్రీడల నుంచి ఇతర పోటీల్లోనూ సుదీర్ఘ పరుగు పందెంలో వాళ్లే ఎక్కువగా విజేతలుగా నిలుస్తుంటారు. తాజాగా కెన్యా అథ్లెట్ రుత్ చెప్నెగెటిక్ సరికొత్త చరిత్ర సృష్టించింది. చికాగో మారథాన్ 42.19 కిలోమీటర్ల పందెంలో బరిలోకి దిగిన ఆమె ట్రాక్ మీద తన సత్తువకు తిరుగులేదని చాటుతూ వరల్డ్ రికార్డు బద్ధలు కొట్టింది. అది కూడా ఎవరి దగ్గర కోచింగ్ తీసుకోకుండానే ఆమె రికార్డు బ్రేక్ చేయడం విశేషం. సోమవారం జరిగిన చికాగో మారథాన్ పోటీల్లో 30 ఏండ్ల రుత్ సత్తా చాటింది. పట్టువదలని యోధురాలిలా దౌడు తీసిన ఆమె 2:09:56 గంటల్లో లక్ష్యాన్ని చేరుకుంది. అంతే ప్రపంచ రికార్డు ఆమెకు దాసోహం అయింది. రెండు నిమిషాల తేడాతో రుత్ సరికొత్త చాంపియన్‌గా రికార్డు పుస్తకాల్లో తన పేరు పదిలం చేసుకుంది.
గతంలో టిగిస్ట్ అస్సెఫా(ఇథియోపియా) పేరిట ఉన్న 2:11:53 గంటల రికార్డును రుత్ బ్రేక్ చేసింది. నిరుడు బెర్లిన్ మారథాన్‌లో అసెఫా ఈ రికార్డు నెలకొల్పాడు. మట్టిలో మాణిక్యాలకు నెలవైన ఆఫ్రికా నుంచి రుత్ సంచలనాల పర్వం లిఖిస్తోంది. చికాగో మారథాన్‌లో ఈ కెన్యా కెరటం విజేతగా నిలవడం ఇదే మొదటిసారి కాదు. వరుసగా 2021, 2022లో ఆమె చాంపియన్ అయింది. ఇక 2023 ఎడిషన్‌లో రుత్ రెండో స్థానంతో సరిపెట్టుకుంది. 'నా పేరు రుత్ చెప్నెగెటిక్. నాకు కోచ్ లేదు. నాకు నేనే కోచ్' అని చారిత్రక పరుగు అనంతరం మీడియా సమావేశంలో రుత్ సగర్వంగా చెబుతుంటే అక్కడున్నవాళ్లంతా ఆమె చప్పట్లతో అభినందనలు తెలిపారు.




### దేశీయ స్టాక్‌మార్కెట్లలో

# మార్కెట్లలో జోష్..

### 591 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..

విశ్వంభర(బిజినెస్) : గత రెండువారాలుగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని సానుకూల పవనాలకు తోడు.. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రియాల్టీ, బ్యాంకింగ్ స్టాక్స్ కొనుగోళ్ల మద్దతుతో మార్కెట్లు లాభాలబాట పట్టాయి. 30 షేర్ల సెన్సెక్స్ 591.69 పాయింట్లు పెరిగి.. 81,973.05 వద్ద ముగిసింది. మరోవైపు ఎన్ఎస్ఈ నిఫ్టీ 163.70 పాయింట్లు బలపడి 25,127.95కి పెరిగింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,576.93 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది.
ఇంట్రాడేలో 81,541.20 పాయింట్ల కనిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. అత్యధికంగా 82,072.17 పాయింట్ల గరిష్ఠానికి చేరుకుంది. చివరకు 591.69 పాయింట్ల లాభంతో 81,973.05 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 163.70 పాయింట్లు పెరిగి.. 25,127.95 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 షేర్లలో విప్రో, టెక్ మహీంద్రా, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఎల్అండ్‌టీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభపడ్డాయి. ఓఎన్‌జీసీ, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, బజాజ్ ఫైనాన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ పతనమయ్యాయి. మీడియా ఇండెక్స్ అత్యధికంగా 1.31 శాతం పతనం కాగా.. రియల్టీ, ఐటీ, బ్యాంకింగ్ వంటి రంగాలు లాభాలబాటలో పయనించాయి. విస్తృత మార్కెట్‌లో నిఫ్టీ మిడ్‌క్యాప్100 స్వల్పంగా పెరిగింది. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 0.24 శాతం పెరిగింది.



# 5జీతో భారత ఆర్థికవ్యవస్థకు భారీగా ఆదాయం

- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా




**విశ్వంభర (బిజినెస్):** 5జీ సాంకేతికత 2040 నాటికి భారత ఆర్థిక వ్యవస్థలోకి అదనంగా 450 బిలియన్ డాలర్ల సొమ్మును తీసుకొస్తుందని కేంద్ర టెలికామ్ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటుచేసిన గ్లోబల్ స్టాండర్డ్స్ సింపోజియంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచంలో అతిపెద్ద టెలికం ఈవెంట్లలో ఇదొకటి.
''ఒక్క భారత్‌లోనే 2040 నాటికి 5జీ ద్వారా 450 బిలియన్లు సమకూరతాయని అంచనాలున్నాయి. ఇది కేవలం వేగవంతమైన ఇంటర్నెట్ లేదా లో లేటెన్సీ ఉన్నది కాదు.. స్మార్ట్‌సిటీలకు అవసరమైన క్షేత్రస్థాయి పని దీనితోనే సాధ్యం. అత్యాధునిక మౌలిక వసతులు, 'అటానమస్' ఆవిష్కరణలకు ఇది చాలా ముఖ్యం. ఇప్పటికే దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో 5జీ అందుబాటులోకి వచ్చింది. కేవలం 22 నెలల్లోనే 98శాతం జిల్లాలు, 80శాతం జనాభా దీని పరిధిలోకి వచ్చాయి. భారత్‌లోని మార్పునకు ఇదే చిహ్నం. హెల్త్‌కేర్, విద్య, వ్యవసాయంలో అత్యాధునిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. అంతర్జాతీయ సహకారంతో 5జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐవోటీ పూర్తి శక్తుల్ని వాడుకలోకి తెచ్చుకోవచ్చు'' అని సింధియా పేర్కొన్నారు.
ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్న కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విషయంలో బలమైన నిబంధనలు అవసరమని కేంద్ర మంత్రి అభిప్రాయపడ్డారు. ఈక్రమంలో వ్యక్తిగత గోప్యతను కాపాడేందుకు నైతిక అంశాలు, రెగ్యులేటరీ ఫ్రేమ్ వర్క్ అవసరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆవిష్కరించనున్న 6జీని దృష్టిలోపెట్టుకొని ఇవి సమగ్రంగా ఉండాలన్నారు. 5జీ విషయంలో అంతర్జాతీయ ప్రమాణాలు.. భాగస్వామ్యాల ఏర్పాటులో ప్రపంచదేశాలు కృషి చేయాలని కోరారు.

# బోయింగ్ షాకింగ్ డెసిషన్..

### త్వరలో 17 వేల మంది ఉద్యోగులపై వేటు



**విశ్వంభర (బిజినెస్) :** ప్రముఖ విమానాల తయారీ సంస్థ బోయింగ్ షాకింగ్ నిర్ణయం తీసుకుంది. సంస్థలోని మొత్తం ఉద్యోగుల్లో దాదాపు 10 శాతం మంది అంటే సుమారు 17 వేల మంది ఉద్యోగులపై వేటుకు రెడీ అయింది. ఈ విషయాన్ని సంస్థ సీఈవో కెల్లీ ఓర్ట్‌బెర్గ్ ఈమెయిల్ ద్వారా ఉద్యోగులకు తెలియజేశారు. కంపెనీ తీవ్రమైన ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది.
సియాటెల్ ప్రాంతంలో ఆ సంస్థకు చెందిన 33 వేల మంది కార్మికులు నెల రోజులుగా సమ్మె చేస్తున్నారు. దాంతో పలు విమానాల ఉత్పత్తి నిలిచిపోయింది. సమ్మె కారణంగా 2025లో డెలివరీ చేయాల్సిన 777ఎక్స్ విమానాలను ఆ తర్వాత ఏడాదికి అంటే 2026కు వాయిదా వేసింది. ఇప్పటికే ఉన్న ఆర్డర్లు పూర్తయిన తర్వాత 2027 నుంచి 767 ఫైటర్ విమానాల ఉత్పత్తిని కూడా నిలిపివేయాలని కంపెనీ యోచిస్తోంది. ఇక ఉద్యోగులను తొలగిస్తున్నట్టు ప్రకటించిన తర్వాత కంపెనీ షేర్లు 1.7 శాతం పతనమయ్యాయి. కార్మికుల సమ్మె కారణంగా మూడో త్రైమాసికంలో సంస్థ 5 బిలియన్ డాలర్ల నష్టాన్ని మూటగట్టుకుంది. ఈ నష్టాలను పూడ్చుకునేందుకు ఇప్పుడు 17 వేల మంది ఉద్యోగులపై వేటుకు సిద్ధమైంది.

# డీమార్ట్ షేర్లు డౌన్..

### ₹27 వేల కోట్ల మేర క్షీణించిన మార్కెట్ విలువ!




**దిల్లీ:** డీమార్ట్ పేరిట దేశవ్యాప్తంగా రిటైల్ వ్యాపారం నిర్వహిస్తున్న అవెన్యూ సూపర్‌మార్ట్స్ లిమిటెడ్ షేర్లు సోమవారం క్షీణించాయి. సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికానికి ప్రకటించిన ఫలితాల్లో మదుపర్లను మెప్పించడంలో కంపెనీ విఫలమవడంతో 9 శాతం మేర క్షీణించాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.27 వేల కోట్ల మేర ఆవిరైంది.ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులైసెప్టెంబర్ త్రైమాసికానికి డీమార్ట్ ఏకీకృత ప్రాతిపదికన రూ.659.44 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గతేడాదితో పోలిస్తే 5 శాతం మేర పెరిగింది. ఆదాయం సైతం 14.41 శాతం పెరిగి రూ.14,444.50 కోట్లుగా నమోదైంది. అదే సమయంలో ఖర్చులు 14.94 శాతం మేర పెరిగినట్లు నివేదించింది. ఈ ఫలితాలు మదుపర్లను మెప్పించడంలో విఫలమయ్యాయి. దీంతో బ్రోకరేజీ సంస్థలు డీమార్ట్ టార్గెట్ ప్రైస్‌ను తగ్గించాయి. ఈ కారణంగా డీమార్ట్ షేర్లు సోమవారం పతనమయ్యాయి. మరోవైపు క్విక్ కామర్స్ సంస్థల నుంచి డీమార్ట్‌కు ఎదురవుతున్న పోటీ కూడా మరో కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.సోమవారం ఉదయం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీలో డీమార్ట్ షేర్లు 9.46 శాతం క్షీణించి రూ.4,139కు చేరగా.. బీఎస్ఈలో 9.37 శాతం క్షీణించి రూ.4,143.60 వద్ద ట్రేడయ్యాయి. కంపెనీ మార్కెట్ విలువ దాదాపు రూ.27,900 కోట్లు క్షీణించి రూ.2.69 లక్షల కోట్లకు చేరింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో డీమార్ట్ షేర్లు 8.35 శాతం క్షీణించి 4,191.00 వద్ద ముగిశాయి. మరోవైపు సెన్సెక్స్ 591 పాయింట్ల లాభంతో 81,973 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 163.73 పాయింట్ల లాభంతో 25,127.95 వద్ద స్థిరపడింది.

# ఇంట్లో నేనే అసలైన సింహాన్ని



ప్రతి ఒక్కరూ తమ జీవితంలో నమ్మక ద్రోహాన్ని ఎదుర్కొని ఉంటారని సినీ నటి కాజోల్ అన్నారు. కృతిసనన్, కాజోల్ కీలక పాత్రల్లో నటించిన మిస్టరీ థ్రిల్లర్ 'దో పత్తి' . శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ అక్టోబరు 25వ తేదీ నుంచి ప్రముఖ ఓటీటీ వేదికగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా సోమవారం జరిగిన ట్రైలర్ విడుదల వేడుకలో కాజోల్ మాట్లాడారు. "ద్రోహం అనేది పూర్తిగా వ్యక్తిగతం. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో నమ్మక ద్రోహాన్ని ఎదుర్కొనే ఉంటారు. మనం పిల్లలుగా ఉన్నప్పుడు, యవ్వనంలోకి వచ్చాక ఇలా జీవితంలో ఏదో ఒక సమయంలో ఎవరో ఒకరు మీకు ద్రోహం చేసే ఉంటారు. అలా జరగకుండా ఉండే పరిస్థితే ఉండదు. అలా కాకపోయుంటే మీరు చెట్టుకింద కూర్చొని ఉండే సన్యాసి అయి ఉండాలి. 'దో పత్తి'లోనూ ఇలాంటి మోసమే ఉంటుంది. అయితే, అది చాలా అందంగా ఉంటుంది. సినిమా మొత్తం ఎన్నో చిక్కుముడులతో ఉంటుంది" అని చెప్పుకొచ్చారు.

తొలిసారి పోలీస్ పాత్ర పోషించడం ఎలా ఉందన్న ప్రశ్నకు కాజోల్ సమాధానమిస్తూ.. 'మీరు యూనిఫాం ధరిస్తే ఉంటే, తెలియకుండానే గౌరవభావం కలుగుతుంది. నా సినిమాల విడుదల సమయంలో నేనెప్పుడూ ఆందోళనపడను. ఎందుకంటే వందశాతం మనసు పెట్టి పనిచేస్తా. నాపై నాకు నమ్మకం ఉంది. ప్రతి ఒక్కరికీ ఒక్కో దృష్టి కోణం ఉంటుంది. కొందరికి నచ్చుతుంది. మరికొందరికి నచ్చకపోవచ్చు. ప్రేక్షకుల ప్రేమ కోసమే మేము పనిచేస్తాం' అని అన్నారు. 'సింగమ్' చిత్రాల్లో పోలీస్‌గా ప్రేక్షకులను మెప్పించే భర్త అజయ్ దేవ్‌గణ్ నుంచి ఏమైనా సలహాలు తీసుకున్నారా? అని అడగ్గా, 'ఈ విషయాన్ని చాలాసార్లు చెప్పాను. ఇంట్లో నేనే సింహం. ఈ పాత్ర కోసం అజయ్ నుంచి ఎలాంటి సలహాలు తీసుకోలేదు' అని కాజోల్ చెప్పడంతో కార్యక్రమంలో నవ్వులు వెల్లివెరిశాయి.

'దో పత్తి'లో కృతి సనన్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. కవలలైన అక్కా చెల్లెళ్ల గురించిన రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ కనిపించనున్నారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకం పై కృతి నిర్మిస్తున్న తొలి చిత్రమిది. షహీర్ షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలక పాత్రలు పోషించారు.

# 'ధమాకా' దర్శకుడితో మరోసారి..

ఈ మధ్యన రవితేజ వరుస చిత్రాలు విడుదలైనా ఏదీ సరిగ్గా విజయం సాధించలేదు. 'ధమాకా' ఒక్కటే హిట్‌గా నిలిచి వంద కోట్ల క్లబ్‌లో చేరింది. దాంతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించిన నక్కిన త్రినాథరావుపై టాలీవుడ్‌లో హీరోలకు నమ్మకం పెరిగింది. ఇప్పుడు ఆయన 'మజాకా' సినిమా తీస్తున్నారు. సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్నారు. ఈ సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'మజాకా' తరవాత నక్కిన త్రినాథరావు రవితేజతో ఓ మరో సినిమా చేయబోతున్నట్టు టాలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది. అందుకు సంబంధించిన కథ కూడా సిద్ధం చేసుకొన్నట్టు సమాచారం. 'ధమాకా' విడుదలైన వెంటనే నక్కిన త్రినాథరావుతో మరో సినిమా చేయడానికి రవితేజ ఆసక్తి చూపించారు. అయితే.. రవితేజ చేతిలో అప్పటికే చాలా సినిమాలున్నాయి. మరోవైపు నక్కిన త్రినాథరావు కూడా వేరే నిర్మాతల దగ్గర అడ్వాన్సు తీసుకొన్నారు. అందుకే రవితేజతో సినిమా కాస్త ఆలస్యమైంది. అయితే 'మజాకా' పూర్తయిన వెంటనే రవితేజతో సినిమా ఉండబోతోందని ఇన్ సైడ్ వర్గాలు నుంచి సమాచారం. 'ధమాకా' సమయంలోనే రవితేజకు మరో లైన్ చెప్పి 'ఓకే' చేయించుకొన్నాడు నక్కిన. 'మజాకా' పనులు ఓ వైపు జరుగుతున్నా, మరో రైటింగ్ టీమ్ తో రవితేజ కథపై చర్చలు జరుగుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం



రవితేజ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలో ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల రవితేజకు ఆపరేషన్ జరగడం వల్ల, ఆ సినిమా షూటింగ్‌కు కాస్త బ్రేక్ ఇచ్చారు. అయితే ఫిబ్రవరి, మార్చ్ నాటికి రవితేజ సినిమా షూటింగ్ పూర్తయ్యే అవకాశాలున్నాయి. వేసవిలో రవితేజ సినిమా విడుదల అవుతుంది. ఆ తరవాత నక్కిన సినిమా పట్టాలెక్కుతుంది. ఈలోగా నక్కిన 'మజాకా' కూడా వచ్చేస్తుంది.

## డిసెంబరు 27న..

# థియేటర్లలోకి ప్రీతి పగడాల 'పతంగ్'

ఇప్పటి వరకు ఎన్నో స్పోర్ట్స్ డ్రామాలు ప్రేక్షకులు చూసి ఉంటారు. కాని అందరిలో ఎంతో మమేకమైన పతంగుల పోటీతో రాబోతున్న కామెడీ స్పోర్ట్స్ డ్రామా చిత్రం 'పతంగ్'. సినిమాటిక్ ఎలిమెంట్స్ అండ్ రిషన్ సినిమాస్ పతాకంపై విజయ్ శేఖర్ అన్నే, సంపత్ మక, సురేష్ కొత్తింటి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి ప్రణీత్ ప్రత్తిపాటి దర్శకుడు. తాజాగా ఈ మూవీ రిలీజ్ డేట్‌ను చిత్ర యూనిట్ ప్రకటించింది.

నాని బండ్రెడ్డి క్రియేటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో ఇన్‌స్టాగ్రామ్ సెన్సేషన్ ప్రీతి పగడాల , జీ సరిగమప రన్నరప్ ప్రణవ్ కౌశిక్ తో పాటు వంశీ పూజిత్ ముఖ్య తారలుగా నటిస్తున్నారు. మరికొంత మంది నూతన నటీనటులతో పాటు ప్రముఖ సింగర్, నటుడు ఎస్పీ చరణ్ ఈ చిత్రంలో కీలకమైన పాత్రలో కనిపించబోతున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 27న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవల ఈ మూవీ నుంచి విడుదల చేసిన పాటలకు, టీజర్‌కు మంచి స్పందన సైతం వచ్చింది. ఈ క్రమంలో తాజాగా ఈ చిత్రాన్ని డిసెంబరు 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ సినిమా థియేటర్‌లో యూత్ ఫెస్టివల్‌లా ఉంటుంది. కొత్తవాళ్లతో చేసిన మా సినిమా కొత్తగా ఉండటంతో పాటు చాలా పెద్ద సినిమా క్వాలిటీతో ఉంటుంది అన్నారు. ఈ సినిమాకు కథే హీరో. ఈ చిత్రానికి జోస్ జిమ్మి అద్భుతమైన పాటలు ఇచ్చాడు. పాట వింటూంటే అందరిలో పాజిటివ్ వైబ్స్ కలుగుతాయి. తప్పకుండా మా పతంగ్ చిత్రం అన్నివర్గాల వారిని అలరిస్తుందనే నమ్మకం ఉంది అన్నారు. కొత్త కంటెంట్‌ను ఆదరించే తెలుగు ప్రేక్షకులు మా ప్రయత్నాన్ని తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకంతో. డిసెంబరు 27న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.




# సంక్రాంతి బరిలో సుమంత్ 'మహేంద్రగిరి వారాహి'




కాస్త విరామం తర్వాత సుమంత్ నటిస్తోన్న కొత్త చిత్రం మహేంద్రగిరి వారాహి . రాజశ్యామల బ్యానర్‌పై ప్రొడక్షన్ నెంబరు 2గా తెరకెక్కుతున్న ఈ చిత్ర గ్లిమ్స్ ను ఇటీవల ప్రముఖ దర్శకుడు క్రిష్ విడుదల చేశారు. అయితే ఈ మూవీ గ్లిమ్స్ ఆసక్తికరంగా ఉందంటూ మాస్ కా దాస్ విశ్వక్ సేన్ తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేయడంతో గ్లిమ్స్ కు మరింతగా స్పందన లభించింది. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. సుమంత్ చివరగా 2021లో మళ్లీ మొదలైంది సినిమాలో కథానాయకుడిగా నటించగా 2022లో ధనుష్ సార్, దుల్కర్ సల్మాన్ సీతారామం సినిమాల్లో క్యారెక్టర్ పాత్రల్లో నటించారు. ఇప్పుడు విరామం తర్వాత హీరోగా 'మహేంద్రగిరి వారాహి' అనే ఓ ఆసక్తికరమైన చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయ్యాడు. 'రంగమార్తాండ' వంటి సినిమా తర్వాత రాజశ్యామల ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా, సంతోష్ జాగర్లమూడి దర్శకుడిగా, మీనాక్షి గోస్వామి కథానాయికగా పరిచయం అవుతోంది. బ్రహ్మానందం కీలక పాత్రలో నటిస్తున్నాడు. అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నాడు. మహేంద్రగిరిలో కొలువుదీరిన వారాహి అమ్మవారి ఆలయం చుట్టూ తిరిగే కథాంశం ఆధారంగా చేసుకుని ఈ సినిమాను రూపొందిస్తున్నామని చిత్ర నిర్మాత కాలిపు మధు తెలిపారు. వచ్చే ఏడాది.. 2025 సంక్రాంతికి ఈమహేంద్రగిరి వారాహి చిత్రాన్ని విడుదల చెయ్యడానికి యూనిట్ సన్నాహాలు చేస్తోంది.

## రేషన్ బియ్యంతో..

# ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలో తెలుసా ?

సమాజంలో నిరుపేదలకు ప్రభుత్వం ఉచితంగా లేదా తక్కువ ధరకు రేషన్ షాప్ ద్వారా బియ్యం అందిస్తోంది. ప్రతి నెలా చౌక దుకాణంల ద్వారా బియ్యం, నూనె, పంచదార, కందిపప్పు వంటి కొన్ని రకాల నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తోంది. కిలో బియ్యం రుపాయని అని లేదా ఫ్రీగా వచ్చాయని చాలా మంది ఈ రేషన్ బియ్యాన్ని చులకనగా చూస్తారు. ఇంకా చెప్పాలంటే ఈ బియ్యంతో చేసిన అన్నం లేదా ఆహార పదార్థాలు తినడం ఏదో పాపం.. నేరంగా చూస్తారు. మార్కెట్ లో దొరికే సన్న బియ్యం కొనుగోలు చేసి తినడానికి ఆసక్తిని చూపిస్తారు. అయితే రేషన్ బియ్యమే మన శరీరానికి మేలు చేస్తాయని తెలుసా.!. నేటి వరకు నిరుపేదలు ఫుల్ టైం ఫుడ్ గా ఉన్న ఈ రేషన్ బియ్యం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. అవి తెలుసుకుంటే.. ఇప్పటి వరకూ రేషన్ బియ్యం తినడానికి ఇష్టపడని వారు సైతం వెంటనే రేషన్ బియ్యంతో చేసిన ఆహారం తినడానికి రెడీ అవుతారు. రేషన్ బియ్యం తినడం వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలు గురించి తెల్సుకుందాం..వాస్తవానికి తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే చాలా ప్రాంతంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కొనసాగుతోంది. ఈ బియ్యాన్ని స్మగ్లింగ్ చేసి, పాలిష్ చేసి, వేరే రూపంలో మార్కెట్ లోకి ఎక్కువ ధరతో మనకే తిరిగి అమ్మేస్తున్నారు.

రేషన్ బియ్యాన్ని ఎలా శుభ్రం చేయాలంటే : రేషన్ బియ్యంతో అన్నం వండడం కొంచెం కష్టంగా భావిస్తారు. అయితే ముందు రేషన్ బియ్యాన్ని కొన్న తర్వాత బాగా ఆరబెట్టి దుమ్ము, పొట్టు లేకుండా చేసుకోవాలి. వండడానికి ముందు రేషన్ బియ్యాన్ని నీళ్లలో కొంచెం ఉప్పు వేసి నానబెట్టాలి. ఇలా చేసిన తర్వాత ఆ బియ్యాన్ని వంట చేసుకుని తినొచ్చు. ఈ రేషన్ బియ్యంతో అన్నం తినడం ఇష్టం లేకుంటే పొంగల్ గా తినొచ్చు. లేదా ఇడ్లీ, దోసె, ఇడియప్పం, ఉప్మా, అప్పం చేసి తినొచ్చు. కొందరు ఈ బియ్యాన్ని 10 గంటలకు పైగా నానబెట్టి గ్రైండ్ చేస్తే పిండిగా చేసి రకరకాల వంటకాలు తయారు చేస్తారు.

**మధుమేహ వ్యాధిగ్రస్తులు :**

ఈ రేషన్ బియ్యం తినడం వల్ల కలిగే ప్రయోజనాలను పరిశీలిస్తే మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఇది మేలు చేస్తుంది. మధుమేహ వ్యాధిని నయం చేయడానికి మధుమేహ నిపుణులు ఈ రేషన్ బియ్యాన్ని సిఫార్సు చేస్తున్నారు. రేషన్ బియ్యం వండి తింటే జీర్ణ సమస్యలు తీరుతాయి. చిన్నారులు, యువత, గర్భిణుల్లో వరుసగా 67శాతం, 57శాతం, 52శాతం రక్తహీనత ఉన్నట్టు జాతీయ కుటుంబ సర్వే నివేదిక వెల్లడించింది. కనుక ఈ బియ్యాన్ని తింటే విటమిన్లు అందటమే కాదు రక్తహీనత బారినపడకుండా ఉండొచ్చు. అదేవిధంగా సన్నగా ఉన్నవారు రోజూ ఇది తింటే బరువు పెరుగుతారు.. ఈ అన్నం తింటే ఎక్కువసేపు ఆకలి వేయదు.. 3 పూటలా తినే ఆహారం 2 పూటలకు తగ్గిపోతుంది.. శరీరం కూడా బలపడుతుంది. ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ B12 లను కలిపిన ఈ బియ్యాన్ని రేషన్ షాప్ ద్వారా ప్రజలకు అందిస్తోంది ప్రభుత్వం.





**సామాజిక హోదా :**

ఎక్కువ మంది రేషన్ బియ్యాన్ని "సామాజిక హోదా" అనే సర్కిల్‌లో చేర్చినందున.. ఈ బియ్యం తినడం వలన కలిగే ప్రయోజనాలను గుర్తించకుండానే వీటిని దూరంగా ఉంచుతున్నారు. అంతే కాదు ధర తక్కువగా ఉండడం లేదా ఉచితంగా ఇవ్వడంతో ఈ బియ్యం తో చేసిన పదార్థాలు తినడం వలన కలిగే ప్రయోజనాలను విస్మరించి.. సన్న బియ్యం తినడం వైపు దృష్టి సారిస్తున్నారు.

## పెదకాపు కర్ణ హీరోగా.. పాన్ ఇండియా

# 'నాగబంధం'




పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు నిర్మించే పాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్‌తో దర్శకుడిగా సక్సెస్ ఫుల్ డెబ్యు చేసిన తర్వాత, తన అప్ కమింగ్ డైరెక్షనల్ వెంచర్ 'నాగబంధం ది సీక్రెట్ ట్రెజర్ ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేశారు. అభిషేక్ నామా కథ, స్క్రీన్ ప్లే కూడా అందిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి NIK స్టూడియోస్ ప్రొడక్షన్ నంబర్ 1 గా కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. తారక్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు. 'పెదకాపు' సినిమాలో తన పవర్ ప్యాక్డ్ యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో అందరి ప్రశంసలు అందుకున్న విరాట్ కర్ణ ఈ మూవీలో లీడ్ రోల్ పోషిస్తుండగానభా నటేష్ , ఐశ్వర్య మీనన్ ఫిమేల్ లీడ్స్ గా నటిస్తున్నారు. జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. భారీ అంచనాలున్న ఈ చిత్రం సోమవారం టీం, ప్రత్యేక అతిథుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవి ముహూర్తం షాట్‌కి క్లాప్ కొట్టారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ కెమెరా స్విచాన్ చేయగా, తొలి షాట్‌కి అజయ్ భూపతి దర్శకత్వం వహించారు. ఆసియన్ సునీల్ స్క్రిప్ట్‌ని మేకర్స్‌కి అందజేశారు. అభిషేక్ నామా డివైన్, అడ్వంచర్ ఎలిమెంట్స్ తో కూడిన పవర్ ఫుల్ స్క్రిప్ట్ రాశారు. తిరువనంతపురంలోని పద్మనాభస్వామి ఆలయంలో నిధి, పూరీ జగన్నాథ ఆలయంలో రత్న భండార్‌ను తెరిచిన తర్వాత గుప్త నిధుల అంశం దేశంలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రస్తుతం భారతదేశంలోని 108 విష్ణు దేవాలయాలు నాగబంధం ద్వారా రక్షించబడుతున్నాయి. ఆ 108 విష్ణు దేవాలయాలకు సంబంధించిన నాగబంధం చుట్టూ ఈ సినిమా కథ ఉండనుంది. ఇప్పటికే విడుదల చేసిన ఇంట్రో వీడియో ప్రేక్షకులను కట్టిపడేయగా KGFలో తన పాత్రతో పేరు తెచ్చుకున్న అవినాష్ అఘోరాగా కనిపించారు. ఈ చిత్రంలో VFX, ప్రొడక్షన్ వాల్యూస్, టెక్నికల్ స్టాండర్డ్స్ అద్భుతంగా ఉండబోతున్నాయి. ఈ చిత్రానికి సౌందర్ రాజన్ డీవోపీగా పని చేస్తుండగా, అభె సంగీతం అందిస్తున్నారు. కళ్యాణ్ చక్రవర్తి డైలాగ్స్ రాయగా, సంతోష్ కామిరెడ్డి ఎడిటర్. అశోక్ కుమార్ ప్రొడక్షన్ డిజైనర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన హైబడ్జెట్ ప్రాజెక్ట్ మేజిక్, మిస్టరీ, అడ్వెంచర్ జర్నీని ప్రామిస్ చేస్తోంది. పాన్ ఇండియా మూవీ నాగబంధం 2025లో తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళంలో ఏకకాలంలో విడుదల కానుంది. ఈ నెల 23న రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ అనౌన్స్ చేశారు. నిర్మాత కిషోర్ అన్నపురెడ్డి మాట్లాడుతూ.. చిరంజీవి గారు ఈ ఈవెంట్ కి ముఖ్య అతిథిగా రావడం మాకు చాలా పాజిటివ్ ఎనర్జీ వచ్చింది. అక్టోబర్లోనే ఈ మూవీ షూటింగ్ స్టార్ట్ చేస్తున్నాం. మరో ఏడాదిన్నరలోనే సినిమాని ప్రేక్షకులను తీసుకొస్తున్నాము. ఎగ్జాక్ట్ డేట్ త్వరలోనే చెప్తాము. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ తో మీ ముందుకు వస్తామన్నారు. హీరో విరాట్ కర్ణ మాట్లాడుతూ.. చిరంజీవి గారు వచ్చి మమ్మల్ని బ్లెస్ చేసినందుకు చాలా హ్యాపీగా ఫీలౌతున్నాను. సినిమా చాలా మంచిగా వస్తుందని కోరుకుంటున్నాను. అందరికీ థాంక్ యూ' అన్నారు హీరోయిన్ నభా నటేష్ మాట్లాడుతూ.. నాగబంధం ఇంట్రో వీడియో రిలీజ్ చేసినప్పుడే ఈ సినిమా ఎంత అద్భుతంగా ఉంటుందో అందరికీ అర్థమై ఉంటుంది. అభిషేక్ గారు ఈ సినిమాని చాలా అద్భుతంగా రూపొందిస్తున్నారు. విరాట్ తో ఫస్ట్ టైం వర్క్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ సినిమాలో చాలా ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్ ప్లే చేస్తున్నాను. ఈ అవకాశం ఇచ్చిన డైరెక్టర్ అభిషేక్ గారికి థాంక్యూ. త్వరలోనే మరిన్ని అప్డేట్స్ తో మీ ముందుకు వస్తాం' అన్నారు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com